
శుక్రవారం 21, మార్చి 2025
https://www.telugudesam.org



# చైతన్యరథం



సమాజమే దేవాలయం, ప్రజలే దేవుళ్ళు

**దొంగచాటుగా సంతకాలు చేసి సభకు డుమ్మానా?**
- వైకాపా ఎమ్మెల్యేల తీరుపై స్పీకర్ అసహనం

6


**రక్తమోడిన దండకారణ్యం**
- రెండు చోట్ల భారీ ఎన్‌కౌంటర్లు
- 30 మంది మావోలు హతం
- ఒక జవాను కూడా మృతి

16

# 30 యేళ్ల నిరీక్షణ నిజం చేశా

- ఎస్సీ ఉపకులాల సమన్యాయం కోసమే వర్గీకరణ
- ఎన్నికలముందిచ్చిన మాట నిలబెట్టుకుంటున్నాం
- అపోహలొద్దు.. ఏ ఒక్కరికీ అన్యాయం జరగదు
- 2011 జనాభా ప్రాతిపదికన రాష్ట్రం యూనిట్‌గా వర్గీకరణ
- 2026 జనగణన తర్వాత జిల్లా యూనిట్‌గా అమలు
- ఎస్సీల హక్కుల పరిరక్షణకు ఆదినుంచీ కట్టుబడి ఉన్నా
- అంటరానితనంపై అప్పట్లోనే జస్టిస్ పున్నయ్య కమిషన్ వేశాం
- 42 సిఫారసులు ఆమోదించి, 25 జీవోలు తెచ్చాం..
- శాసనసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- ఆనాటి వివక్షను ప్రస్తావిస్తూ.. ఉద్వేగానికి గురైన సీఎం

>>>2లో..



## పేదల ఎదుగుదలే లక్ష్యంగా...
# ఉగాదినుంచి పీ-4 ప్రారంభానికి సన్నాహాలు

- ఆర్థిక అసమానతలు రూపుమాపే సంకల్పం
- 'జీరో పావర్టీ-పీ4'పై సీఎం చంద్రబాబు సమీక్ష


3



## ఔను!
# కార్యకర్తే అధినేత!

- నాయకుడి పిలుపును ఆచరణలో పెడుతున్న తెలుగుదేశం
- ఇకపై ప్రతి కార్యకర్తనూ కలిసి సమస్యలు పరిష్కరించాలి
- నియోజకవర్గాల్లో ప్రతి బుధవారం కార్యకర్తలతో సమావేశం
- ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జిలకు ఆదేశాలు
- చంద్రబాబునాయుడు, నారా లోకేష్ సంచలన నిర్ణయం

3



# వినోదం.. ఒక సందేశం

- సీఎం చంద్రబాబు వ్యాఖ్య
- ప్రజాప్రతినిధుల సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరు
- ప్రతిభావంతులకు అవార్డులతో సత్కారం

4





**పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాల్ ఏర్పాటుకు కృషి**
- గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణికి మంత్రి నారా లోకేష్ హామీ

5

## స్పీకర్ స్థానానికి మంత్రి లోకేష్ ఎనలేని గౌరవం

- కారు వరకూ వచ్చి అయ్యన్నపాత్రుడికి వీడ్కోలు
- డోర్ తీసి ముందు సీట్లో కూర్చోబెట్టి పంపించిన వైనం



5

చైతన్యరథం

# 30యేళ్ల నిరీక్షణ నిజం చేశా

- ఎస్సీ ఉపకులాల సమన్యాయం కోసమే వర్గీకరణ
- ఎన్నికలముందిచ్చిన మాట నిలబెట్టుకుంటున్నాం
- అపోహలొద్దు.. ఏ ఒక్కరికీ అన్యాయం జరగదు
- 2011 జనాభా ప్రాతిపదికన రాష్ట్రం యూనిట్‌గా వర్గీకరణ
- 2026 జనగణన తర్వాత జిల్లా యూనిట్‌గా అమలు
- ఎస్సీల హక్కుల పరిరక్షణకు ఆదినుంచీ కట్టుబడి ఉన్నా
- అంటరానితనంపై అప్పట్లోనే జస్టిస్ పున్నయ్య కమిషన్ వేశాం
- 42 సిఫారసులు ఆమోదించి, 25 జీవోలు తెచ్చాం..
- శాసనసభలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు
- ఆనాటి వివక్షను ప్రస్తావిస్తూ.. ఉద్వేగానికి గురైన సీఎం



అమరావతి (చైతన్య రథం) ఎన్నికల సమయంలో చెప్పినట్టుగానే -ఎస్సీ వర్గీకరణపై మాట నిలబెట్టుకున్నట్టు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఎస్సీ ఉపకులాల్లో సమన్యాయం కోసం సుప్రీంకోర్టు తీర్పు మేరకు వర్గీకరణ చేశామన్నారు. 1995లో తాను మొదట ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటినుంచి నేటివరకు సుదీర్ఘకాలంపాటు సాగిన వర్గీకరణ అంశం మళ్లీ తన హయాంలోనే సాకారం చేయడం సంతృప్తినిచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణపై శాసనసభలో గురువారం సీఎం ప్రసంగించారు. 2011 జనాభా లెక్కల ప్రాతిపదికన రాష్ట్రం యూనిట్‌గా అమలు చేయాలని నిర్ణయించామని, 2026 జనాభా గణన తర్వాత వర్గీకరణను జిల్లా యూనిట్‌గా అమలు చేసే అంశాన్ని పరిశీలిస్తామన్నారు. బడుగు, బలహీన వర్గాలను సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా పైకి తెచ్చేందుకు ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. బుడగ జంగాలను కూడా ఎస్సీల్లో చేర్చాలని అసెంబ్లీలో చేసిన తీర్మానాన్ని కేంద్రానికి పంపుతామని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

## మాదిగ దండోరా పేరిట మందకృష్ణ పోరాడారు

స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటినా అసమానతలపై పోరాడాల్సి రావడం బాధాకరం. నేటికీ కొందరు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా వెనుకబడి ఉన్నారు. మాదిగలకు అన్యాయం జరిగిందని, మాదిగ పేరు చెప్పేందుకు కూడా కొందరు వెనకాడుతున్నారనే ఉద్దేశంతో మాదిగ దండోరా అనే ఆర్గనైజేషన్ పెట్టి మందకృష్ణ పెద్ద ఉద్యమం చేశారు. నేను వారి సమస్యలను ప్రత్యక్షంగా చూశాను. వారు డిమాండ్లు సమంజసమని భావించి 10.09.1996లో జస్టిస్ రామచంద్రరావు కమిషన్ వేశాం. ఈ కమిషన్ రాష్ట్రమంతా తిరిగి అధ్యయనం చేసి 28.05.1997న నివేదిక ఇచ్చింది. సమాజంలో అసమానతలు తొలగి, పేదరికం లేని సమాజం లక్ష్యంగా 1997 జూన్ 6న ఎస్సీ రిజర్వేషన్లను ఏ,బీ,సీ,డీలుగా వర్గీకరిస్తూ ఉత్వర్తులిచ్చాం. నవంబర్ 30, 1999న నాటి రాష్ట్రపతి కేఆర్ నారాయణన్ ఆమోదంతో వర్గీకరణ అమల్లోకి వచ్చింది. దీంతో మాదిగలు, ఉప కులాలకు 22 వేలకు పైగా ఉద్యోగాలు వచ్చాయి. అయితే వర్గీకరణ అంశం కోర్టుకు వెళ్లడంతో వర్గీకరణ చేసే అధికారం ఒక్క పార్లమెంటుకే ఉందని 2004 నవబంర్ 5న సుప్రీంకోర్టు తీర్పునిచ్చింది. ఈ క్రమంలో నాటి కేంద్ర ప్రభుత్వం వేసిన ఉషా మెహ్రా కమిషన్ వర్గీకరణ అమలైన 2000-2004 మధ్య మంచి ఫలితాలు వచ్చాయని స్పష్టం చేసింది. ఎస్సీ రిజర్వేషన్‌ల వర్గీకరణకు అనుకూలంగా గతేడాది ఆగస్టులో సుప్రీం తీర్పు ఇచ్చింది. జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలోని ఏడుగురు సభ్యులతో కూడిన ధర్మాసనం తీర్పును వెలువరించిందని సీఎం పేర్కొన్నారు.

## పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా

30 ఏళ్ల క్రితం ఎస్సీ వర్గీకరణకు నేను కమిటీ వేశాను. నాటినుంచి వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చేంత వరకూ ఈ సుదీర్ఘ ప్రయాణంలో నేను భాగస్వామిని కావడం అరుదైన అవకాశంగా, పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నాను. సామాజిక న్యాయం కోసం నేను చేసిన ఆలోచన సబబని అత్యున్నత న్యాయస్థానం తీర్పు ద్వారా స్పష్టమైంది.

ఎన్టీఆర్ సామాజిక న్యాయం కోసం అనునిత్యం తపించారు. దేశంలోనే మొదటిసారిగా ఎస్సీ, ఎస్టీలకు శాశ్వత గృహాలు నిర్మించిన వ్యక్తి ఎన్టీఆర్. దేశంలో మొదటిసారిగా ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు చదువుకునేందుకు సోషల్ వెల్ఫేర్ స్కూలు పెట్టింది కూడా ఎన్టీఆరే. నాడు ముఖ్యమంత్రిగా ఎస్సీలపట్ల వివక్షను నేను స్వయంగా చూశాను. ఆ రోజుల్లో తెలంగాణలో అయితే 'బాన్చన్.. నీ కాల్ మొక్కుతా' అనేవారు. అంటరానితనాన్ని రూపుమాపేందుకు నాకు చాలా సమయం పట్టింది. ఆనాడు బోర్లు, బావుల దగ్గర నీరు తీసుకునేందుకు ఎస్సీలను రానిచ్చేవారు కాదు. వారు చెప్పులు లేకుండా ఊళ్లో తిరగాలి. టీ స్టాల్ దగ్గర గ్లాస్‌లు వేరే పెట్టేవారు. ఇవన్నీ చూశాక నేను జస్టిస్ పున్నయ్య కమిషన్ వేయగా బలహీన వర్గాల అభ్యున్నతికి ఆయన చిత్తశుద్ధితో పనిచేశారు. రాష్ట్రంలో కుల వివక్ష ఉండకూడదనే ఉద్దేశంతో 25 మెమోలు, జీవోలు ఇచ్చానని చంద్రబాబు గుర్తు చేసుకున్నారు.

## మిశ్రా నేతృత్వంలో ఏకసభ్య కమిషన్ వేశాం

ఎస్సీ వర్గీకరణపై 15.11.2024లో రిటైర్డ్ ఐఏఎస్ అధికారి రాజీవ్ రంజన్ మిశ్రాతో ఏక సభ్య కమిషన్ వేశాం. వారు 13 ఉమ్మడి జిల్లాల్లో తిరిగి ప్రజల అభిప్రాయాలు తీసుకున్నారు. 10.03.2025న సమగ్ర నివేదిక ఇచ్చారు. 59 ఉపకులాలను 3 కేటగిరీలుగా విభజించి రిజర్వేషన్లు కేటాయించారు.

గ్రూప్ 1 -అత్యంత వెనుకబడింది
గ్రూప్ 2 -వెనుకబడింది
గ్రూప్ 3 -సాపేక్షంగా తక్కువ వెనుకబడింది

1. గ్రూప్ 1 -అత్యంత వెనుకబడిన కేటగిరి -రెల్లి ఉప కులాలకు 1.0శాతం
2. గ్రూప్ 2 -వెనుకబడిన కేటగిరీ -మాదిగ ఉపకులాలకు 6.5శాతం
3. గ్రూప్ 3 -సాపేక్షంగా వెనుకబడిన కేటగిరి -మాల ఉప కులాలకు 7.5శాతం

రోస్టర్ విధానం ప్రకారం మొదట 100 పోస్టులు వస్తే 8 పోస్టులు మాల సామాజిక వర్గానికి వస్తాయి. మాదిగ సామాజిక వర్గానికి 6 శాతం, రెల్లి సామాజిక వర్గానికి ఒక శాతం వస్తాయి. మూడు కలిపితే 15 శాతమవుతుంది. 200 పోస్టులు వస్తే మాల సామాజికి వర్గానికి 15, మాదిగ సామాజిక వర్గానికి 13, రెల్లికి 2 వస్తాయి. తద్వారా రోస్టర్‌లో అందరికీ న్యాయం జరుగుతుందని చంద్రబాబు వివరించారు.

## కుల వివక్షపై యుద్ధం చేశాం

టీడీపీ ఆవిర్భావం నుంచీ కుల వివక్షతపై యుద్ధం చేసింది. గిరిజన భూములు గిరిజనులకే చెందాలని చట్టాన్ని తెచ్చి అమలు చేశాం. 694 జీవో ప్రకారం జిల్లా, డివిజన్, మండలస్థాయిలో ఎస్సీ, ఎస్టీల సమస్య పరిష్కార కోసం ప్రత్యేక సెల్ ఏర్పాటు చేశాం. అధికారులంతా వారానికోసారి గ్రామానికి వెళ్లేలా ఆదేశాలిచ్చాం. కుల వివక్ష చూపే వారిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు పెట్టేందుకు ఆదేశాలిచ్చాం. దేవాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో అంటరానితనం నిర్మూలనకు చర్యలు తీసుకున్నాం. అంటరానితనంపై పోరాడేవారికి జిల్లాస్థాయిలో ఐదుగురికి రూ.10 వేల నగదుతో అవార్డులు, రాష్ట్రస్థాయిలో రూ.25 వేల నగదుతో ప్రోత్సాహకాలు అందించాం. ఎస్సీ మహిళలపై అత్యాచారాలు జరిగితే కలెక్టర్, ఎస్పీలు 24 గంటల్లో వెళ్లి చర్యలు తీసుకునేలా ఆదేశాలిచ్చాం. ఎస్సీ అట్రాసిటీస్‌పై ప్రత్యేక కోర్టులు పెట్టాం. ప్రభుత్వ వ్యయంతో న్యాయవాదులను నియమించాం. సామాజిక సమానత్వంపై క్యాంపులు పెట్టి చైతన్యం తెచ్చాం. రాష్ట్రస్థాయిలో నోడల్ ఆఫీసర్‌ని నియమించాం. ప్రతి నెలా 30న ప్రతి గ్రామంలో పౌరహక్కుల ఉత్సవాలు జరిపామని చంద్రబాబు గుర్తు చేశారు.

## సామాజిక న్యాయానికి కట్టుబడి ఉన్నాం

మొదటిసారిగా దళితుణ్ణి లోక్‌సభ స్పీకర్‌ని చేసిన ఘనత తెలుగుదేశానిదే. ఎస్సీ బిడ్డ బాలయోగి స్పీకర్‌గా బ్రహ్మాండంగా రాణించి దేశాన్ని మెప్పించారు. 1999లో దళిత మహిళ ప్రతిభా భారతిని అసెంబ్లీ స్పీకర్‌ని చేసిన ఘనత కూడా తెలుగుదేశానికే దక్కింది. కాకి మాధవరావును చీఫ్ సెక్రటరీగా నియమించాం. ఎన్టీఆర్ నేషనల్ ఫ్రంట్ అధ్యక్షునిగా ఉన్నప్పుడే బిఆర్ అంబేద్కర్‌కి భారతరత్న వచ్చింది. ఎన్డీఏ ప్రభుత్వంలోనే అంబేద్కర్ ఫోటో పార్లమెంటులో పెట్టారు. నేను యునైటడ్ ఫ్రంట్ కన్వీనర్‌గా ఉన్నప్పుడు ఎస్సీ వర్గానికి చెందిన కేఎల్ నారాయణన్‌ను రాష్ట్రపతిని చేశాం. నాటి ప్రధాని వాజ్‌పేయి సహకారంతో అబ్దుల్ కలామ్‌ని రాష్ట్రపతిని చేయడంలోనూ టీడీపీ పాత్ర ఉన్నందుకు గర్వంగా ఉంది. షెడ్యూల్ కులానికి చెందిన రామ్‌నాథ్ కోవింద్, గిరిజన మహిళ ముర్మని ప్రధాని మోదీ రాష్ట్రపతులుగా నిలబెట్టారు. వీటన్నింటిలో నేనూ భాగస్వామిని అయినందుకు సంతోషంగా ఉంది. అందరికీ సామాజిక న్యాయం చేసేందుకు ఎన్డీఏ కూటమి కట్టుబడి ఉందని చంద్రబాబు వివరించారు.

## గత ప్రభుత్వం అన్యాయం చేసింది

గత ప్రభుత్వం ఐదేళ్లలో వెనుకబడిన కులాలకు ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదు. వారి సంక్షేమం పట్టించుకోలేదు. ఆర్థిక ఇబ్బందులున్నా ఎన్డీఏ ప్రభుత్వం ఎస్సీల కోసం రూ.804 కోట్ల ఔట్‌లేతో రూ.240 కోట్ల ప్రభుత్వ గ్రాంట్‌తో ఆదుకుంది. ఎస్సీ, ఎస్టీలకు 2014-19 మధ్య సబ్ ప్లాన్ నిధులు అందించాం. మాల, మాదిక సామాజిక వర్గాలకు జనాభా దామాషా ప్రకారం ఆర్థిక వనరులు కేటాయించాం. మేము చేసిన ఎస్సీ వర్గీకరణవల్ల 22 వేలమందికి లబ్ధి చేకూరింది. గత పాలకులు నేషనల్ ఫైనాన్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నుంచి ఒక్క రూపాయి తేకపోగా పోతూ పోతూ బకాయిలు పెట్టిపోయారని చంద్రబాబు దుయ్యబట్టారు.

## పేదరికంలేని సమాజమే నా లక్ష్యం

20 ఇళ్లు మాత్రమే ఉన్న మారుమూల గ్రామంలో నేను పుట్టాను. మా ఊరికి అప్పట్లో సరైన రోడ్డు కూడా లేదు. రోడ్డు వేయించేందుకు ఇంటికో ఎడ్లబండి కట్టి మట్టి తోలేవాళ్లం. రోజుకు ఒకసారి ఊరికి బస్ వచ్చేది. నేను విద్యార్థి దశనుంచి పోరాటాల్లో ఉన్నాను. అంచెలంచెలుగా ఎదిగాను. ఢిల్లీలో బిల్‌గేట్స్‌తో మాట్లాడినప్పుడు... 30 ఏళ్ల క్రితం నాటి సంగతులు ఆయన గుర్తు చేస్తే చాలా సంతోషం అనిపించింది. రాష్ట్రంలో పేదరికం ఉండకూడదనే లక్ష్యంతో పని చేస్తున్న నాకు ప్రధానిమోదీ, పవన్ కల్యాణ్ సహకరిస్తున్నారు.

ఒకప్పుడు పీ3 తెచ్చి సంపద సృష్టించి పేదలను ఆదుకున్నాం. ప్రజలకు మెరుగైన వసతులు కల్పించాం. ఈనెల ఉగాది నాడు పీ-4 తెస్తున్నాం. సమాజంలో ఆర్థికంగా ఉన్నత స్థితిలో ఉన్న 10శాతం మంది పేదరికంలో అట్టడుగు స్థాయిలో ఉన్న 20శాతం మందికి చేయూతనివ్వడమే లక్ష్యంగా ముందుకెళ్తున్నాం. తూర్పు కాపులకు కుల సర్టిఫికెట్ ఇచ్చే అంశంపైనా కసరత్తు చేస్తాం. సమాజంలో అన్ని వర్గాలకు సామాజిక న్యాయం చేయడమే ఎన్డీఏ ప్రభుత్వ లక్ష్యమని సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు.

# పేదల ఎదుగుదలే లక్ష్యంగా...

| ఉగాదినుంచి పీ-4 ప్రారంభానికి సన్నాహాలు | ఆర్థిక అసమానతలు రూపుమాపే సంకల్పం | 'జీరో పావర్టీ-పీ4'పై సీఎం చంద్రబాబు సమీక్ష |
|---|---|---|



అమరావతి (చైతన్య రథం): ఉగాది రోజున ప్రారంభించనున్న 'జీరో పావర్టీ-పీ4' (పబ్లిక్-ప్రైవేట్-పీపుల్ పార్టనర్‌షిప్) పురోగతిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సమీక్షించారు. మార్చి 30న జరిగే ప్రారంభోత్సవ సమావేశంపై ప్రధానంగా అధి కారులతో చర్చించారు. మహిళలు, గ్రామీణ ప్రజలను పీ-4లో ప్రధాన భాగస్వాముల్ని చేయాల ని... దీని అమలులో పారదర్శకత, విధాన రూపకల్పన అవసర మని అధికారులకు స్పష్టం చేశారు. పీ-4 విధానాన్ని మరింత మెరుగు పరిచేందుకు ప్రజల నుంచి అభి ప్రాయాల్ని తీసుకోవాలని సూచిం చారు. దీర్ఘకాలిక ఫలితాలను దృష్టిలో పెట్టుకుని... పీ-4 సొసైటీని ప్రైవేట్‌రంగ భాగస్వామ్యంతో నెలకొల్పాలన్నారు. ప్రారంభ కార్యక్రమంలో ప్రజలు పెద్దఎత్తున పాల్గొనేలా... మరింత మంది పీ-4 విధానాన్ని అర్థం చేసుకుని ప్రయోజనం పొందేలా సన్నాహాలు జరగాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు.

### ఆర్థిక అసమానతలు తగ్గించాలనే సంకల్పం

స్వర్ణాంధ్ర -2047 విజన్ పది సూత్రాల అమలులో భాగంగా 'జీరో పావర్టీ-పీ4'ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతోంది. ప్రజల ఆర్థికవృద్ధికి చురుకుగా దోహదపడేలా, వారి జీవన ప్రమాణాలు మెరుగుపడేలా చూడటమే పీ-4 ప్రధాన లక్ష్యం. ఆర్థికంగా సంపన్నులైన అగ్రశ్రేణి 10 శాతం కుటుంబాలు... పేదరికంలో అట్టడుగున ఉన్న 20శాతం పేద కుటుంబాలకు మార్గదర్శకత్వం వహించడంతోపాటు వారి ఆర్థిక ఎదుగుదలకు మద్దతుగా నిలిచేలా చేస్తాయి. పీ-4 అమలు ద్వారా సామాజిక, ఆర్థిక అంతరాలను తగ్గించాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం ఉందని చంద్రబాబు అన్నారు.

# ఔను! కార్యకర్తే అధినేత!



- నాయకుడి పిలుపును ఆచరణలో పెడుతున్న తెలుగుదేశం
- ఇకపై ప్రతి కార్యకర్తనూ కలిసి సమస్యలు పరిష్కరించాలి
- నియోజకవర్గాల్లో ప్రతి బుధవారం కార్యకర్తలతో సమావేశం
- చంద్రబాబునాయుడు, నారా లోకేష్ సంచలన నిర్ణయం

అమరావతి (చైతన్య రథం): కార్యకర్తే అధినేత అనే మాటలను తెలుగుదేశం పార్టీ ఆచరణలో పెడుతోంది. ఇకపై ప్రతి కార్యకర్తను కలిసి సమస్యలు పరిష్కరించాలని పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబునాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు అండగా నిలిచిన కార్యకర్తలే తెలుగుదేశం పార్టీకి బలం. దేశంలో ఏ పార్టీకి లేని సంస్థాగత నిర్మాణం తెలుగుదేశానికి ఉంది. ఇటీవల కోటి సభ్యత్వాలతో చరిత్ర సృష్టించి అతిపెద్ద కుటుంబంగా మారిన నేపథ్యంలో కార్యకర్తే అధినేత అని పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పిలుపునిచ్చారు. ఈమేరకు అన్ని నియోజకవర్గాల్లో ప్రతి బుధవారం ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జ్‌లు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించి అండగా నిలవాలని, సమస్యలు పరిష్కరించాలని పార్టీ నాయకులు, శ్రేణులకు ఆదేశాలు జారీ చేశారు. తన నియోజకవర్గ పర్యటనలో ముందుగా కార్యకర్తలను కలుసుకుని వారి యోగక్షేమాలు అడిగి తెలుసుకుంటున్నారు నారా లోకేష్. క్లస్టర్, యూనిట్, బూత్ ఇంఛార్జ్‌లతోపాటు బాబు ష్యూరిటీ-భవిష్యత్‌కు గ్యారెంటీ ఫీల్డ్ వర్క్, శంఖారావం ఫీల్డ్ వర్క్, ఓటర్ వెరిఫికేషన్, పార్టీ యాప్స్, సభ్యత్వ నమోదులో ఉత్తమ పనితీరు కనబరిచిన కార్యకర్తలతో సమావేశాలు నిర్వహిస్తూ వారిని అభినందిస్తున్నారు.

### నియోజకవర్గాల్లో ప్రతి బుధవారం కార్యకర్తలతో సమావేశం

పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల ప్రకారం అన్ని నియోజకవర్గాల్లో ఇన్‌చార్జ్‌లు, ఎమ్మెల్యేలు ప్రతి బుధవారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు నియోజకవర్గ ప్రజల నుంచి గ్రీవెన్స్ స్వీకరించాలి. మధ్యాహ్నం నుంచి నియోజకవర్గ స్థాయిలో కార్యకర్తల సమావేశం నిర్వహించి వారి సమస్యలను పరిష్కరించడంతో పాటు ఫిర్యాదులు స్వీకరించాలని ఆదేశించారు. పార్టీ సంస్థాగత నిర్మాణం, అన్ని విభాగాలు, కార్యక్రమాలలో ఉత్తమ పనితీరు కనబరిచిన వారిని అభినందించాలని దిశానిర్దేశం చేశారు. సమావేశం అనంతరం మినిట్స్‌ను కేంద్ర పార్టీ కార్యాలయానికి పంపించాలని ఆదేశించారు.

ప్రతి నెల ఇంచార్జి మంత్రులు తమకు కేటాయించిన జిల్లాలో రెండురోజుల పాటు పర్యటించాలి. మొదటిరోజు జిల్లా అధికారులతో సమావేశం నిర్వహించాలి. రెండవ రోజు పార్లమెంట్ అధ్యక్షులు, జోనల్ కో -ఆర్డినేటర్లతో కలిసి పార్టీ క్యాడర్ సమావేశం ఏర్పాటు చేయాలి. మీటింగ్ మినిట్స్‌ను కేంద్ర పార్టీ కార్యాలయానికి పంపించాలి. ఎవరైనా మీటింగ్స్‌ను నిర్వహించని పక్షంలో లిఖిత పూర్వక వివరణ ఇవ్వాల్సి ఉంటుందని ఈ సందర్భంగా ఆదేశాలు జారీ అయ్యాయి.





శాసనమండలి సభ్యులుగా పదవీకాలం పూర్తిచేసుకున్న పరుచూరి అశోక్ బాబు, దువ్వారపు రామారావులను సన్మానించిన గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. సభలో వారు హుందాతనంగా వ్యవహరించి ప్రజా సమస్యలపై పోరాడారని ప్రశంస. రాష్ట్రాభివృద్ధికై ఇద్దరి పోరాట పటిమ అభినందనీయమని ప్రశంసించిన సీఎం చంద్రబాబు.





# వినోదం.. ఒక సందేశం

## ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్య

### ప్రజాప్రతినిధుల సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరు - ప్రతిభావంతులకు అవార్డులతో సత్కారం

విజయవాడ (చైతన్య రథం): వినోదం.. ఒక సందేశం అని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. అసెంబ్లీ, మండలి బడ్జెట్ సమావేశాల ముగింపు సందర్భంలో గత రెండురోజులపాటు ప్రజాప్రతినిధులకు క్రీడా, సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. గురువారం సాయంత్రం విజయవాడ ఏ కన్వెన్షన్‌లో నిర్వహించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతిక కార్యక్రమాలు, విజేతలకు బహుమతీ ప్రదానోత్సవ సభకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరయ్యారు. క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రతిభ కనబర్చిన సభ్యులకు అవార్డులు ప్రదానం చేసిన అనంతరం సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడారు. 'డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు చెప్పిన డైలాగులు వినగానే ఎన్టీఆర్ గుర్తొచ్చారు. ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు బ్రహ్మాండంగా నటించారు. కార్యకర్త నాయకుడిని ఎలా అడుగుతాడో మాచర్ల ఎమ్మెల్యే బ్రహ్మారెడ్డి కూడా అలాగే అడిగారు. ఆంజనేయులు కూడా ఎమ్మెల్యే ఎలా స్పందించాలో అలాగే స్పందించి నటించారు. (నవ్వుతూ) కానీ ఈ తంతు ఇప్పుడు లేదు ఒకప్పుడు ఉండేది. ఎమ్మెల్యేలంతా ఈవిధంగా ఉత్సాహంగా ఉంటే ఆసుపత్రులకు వెళ్లాల్సిన అవసరమే ఉండదు. అందరం ఆరోగ్యంగా, ఆనందంగా ఉంటాం. ఎవరిపైనా ఒత్తిడి ఉండదు. అవసరమైతే హెల్త్ బడ్జెట్ తగ్గించి ఎంటర్టైన్మెంట్, స్పోర్ట్స్ బడ్జెట్ పెంచండి



(గట్టిగా నవ్వుతూ)' అని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజాప్రతినిధులను మరింత ఉత్సాహపర్చారు. 'ప్రతిపక్షం, అధికారపక్షం అనేది ప్రజాసమస్యలపై పోరాడటానికి తప్ప వ్యక్తిగత విభేదాలు పెట్టుకోవడానికి కాదు. ఒకప్పుడు సభ్యులంతా ఆప్యాయంగా పలకరించుకునేవాళ్లం. కానీ ఇప్పుడు రాష్ట్రంలో రాజకీయాలు కలుషితమయ్యాయి. బద్ధశత్రులుగా మారారు. మర్రి చెన్నారెడ్డి సీఎంగా ఉన్నప్పుడు ఓ అంశంపై నేను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఎమోషన్‌లో బల్ల గుద్ది చెప్పాను. చెన్నారెడ్డికి కోపం వచ్చి బల్ల ఎందుకు గుద్దావు. ఏమనుకుంటున్నావు నువ్వు అని నన్ను ప్రశ్నించారు. గుద్దుతాను ఏం చేస్తారు అని నేను కూడా గట్టిగా ప్రశ్నించగానే వెంటనే కూర్చున్నారు. అసెంబ్లీ అనేది ప్రజలకు జావాబు దారీతనంగా ఉండాలి తప్ప ప్రతిపక్షాలకు కాదు. అసెంబ్లీలో మనం మాట్లాడే ప్రతి మాటా రాష్ట్రం మొత్తం వెళు్తంది. గతేడాది వరకు అసెంబ్లీ సమావేశాలు జరిగితే ప్రజలు టీవీలు కట్ చేశారు, వారి బూతులు వినలేక. కానీ ఇప్పుడు గర్వంగా చెప్తున్నా. కౌరవ సభ గౌరవ సభగా మారింది. ప్రజలకు కావాల్సింది సమస్యల పరిష్కారం. బూతులు తిడితే తిట్టిన వారికి ఆనందం కలిగిస్తాయి తప్ప ప్రజలకు కాదు' అని చంద్రబాబు ఉద్ఘాటించారు. జీవితాంతం క్రీడలు పెద్ద కార్యక్రమంగా ఉండాలంటూనే.. ఎప్పుడూ చూడని విధంగా క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల్లో సభ్యులు పాల్గొనడం, అసెంబ్లీ అర్థవంతంగా సాగడం ఆనందంగా ఉందని చంద్రబాబు స్పష్టం చేశారు. ఎన్డీయేలో ఉండే ఎమ్మెల్యేలంతా శాశ్వతంగా ఎమ్మెల్యేలుగా ఉండాలి. ప్రజలకు కావాల్సింది చేసి వారికి వివరించి చేసినదాని గురించి వివరించాలి. కూచిపూడి నా మనసుకు చాలా దగ్గరగా ఉంటుంది. తెలుగువారి వారసత్వం కూచిపూడి. ఆ గ్రామాన్ని, ప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తే ఎవరైనా వచ్చి నేర్చుకుంటే అది ప్రపంచమంతా వెళ్తుంది. కూచిపూడి నాట్య ప్రదర్శన వీడియోను తప్పకుండా చూస్తాను. త్వరలో ప్రధాని సభలో కూచిపూడి నాట్య ప్రదర్శనకు అవకాశం కల్పిస్తాం. మనకు రెండు వారసత్వాలు ఉన్నాయి. ఒకటి కూచిపూడి నాట్యం, రెండు వెంకటేశ్వరస్వామి. నా జీవితంలో ఎప్పుడూ లేనివిధంగా బాగా వినోదం పొందాను. వచ్చే ఏడాది కూడా ఈ తరహా కార్యక్రమాలు నిర్వహిస్తామని చంద్రబాబు నాయుడు అన్నారు.


















# స్పీకర్ స్థానానికి మంత్రి లోకేష్ ఎనలేని గౌరవం





- కారు వరకూ వచ్చి అయ్యన్నపాత్రుడికి వీడ్కోలు
- డోర్ తీసి ముందు సీట్లో కూర్చోబెట్టి పంపించిన వైనం

అమరావతి (చైతన్యరథం): విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ రాజ్యాంగబద్ధమైన స్పీకర్ స్థానానికి ఎనలేని గౌరవం ఇస్తారు. ఆ విషయం గురువారం శాసనసభ ఆవరణలో మరో సారి వెల్లడయింది. అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడిని దగ్గరుండి మరీ కారు వరకూ తీసుకొచ్చి డోర్ తీసి, లోపల కూర్చోబెట్టి మంత్రి లోకేష్ వీడ్కోలు పలి కారు. అసెంబ్లీ నిరవధికంగా వాయిదా పడిన అనంతరం ఒకరి తర్వాత మరొక రుగా మంత్రి లోకేష్, స్పీకర్ అయ్యన్న పాత్రుడు సభ నుంచి బయటకు వచ్చారు. ముందు వెళ్తున్న మంత్రి లోకేష్‌ను.. లాబీ లో లోకేష్ గారూ అంటూ సభాపతి పిలి చారు. దీంతో స్పీకర్‌కు ఎదురెళ్లిన మంత్రి లోకేష్ కబురు పెడితే మీ ఛాంబర్‌కే వచ్చే వాడినిగా అని వినయంగా బదులిచ్చారు. స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ క్రీడా పోటీలకు 2 రోజులు గైర్హాజరై నందున సాంస్కృతిక పోటీలకు తప్పక రావాలని మంత్రి లోకేష్‌ను కోరారు. స్పీకర్ ఆదేశాలు తప్పక పాటిస్తా అంటూ లోకేష్ సరదాగా అన్నారు. నేనిక సెలవు తీసుకుంటానన్న స్పీకర్‌తో కారు వరకూ నేనూ వస్తానని మంత్రి లోకేష్ వెంట నడి చారు.స్పీకర్ వద్దని వారిస్తున్నా కార్ డోర్ తీసి ఆయనను ముందు సీటులో కూర్చో పెట్టి పంపించిన మంత్రి లోకేష్ ఆయన పట్ల తన గౌరవాన్ని చాటుకున్నారు.



# పార్లమెంట్‌లో అరకు కాఫీ స్టాల్ ఏర్పాటుకు కృషి

- గిరిజన ఉత్పత్తుల ప్రోత్సాహానికి సహకరిస్తా
- గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణికి మంత్రి లోకేష్ హామీ




అమరావతి (చైతన్యరథం): పార్ల మెంట్‌లో అరకు కాఫీ స్టాల్ ఏర్పాటుకు, గిరిజన ఉత్పత్తుల ప్రోత్సాహానికి తన వంతు సహాయ, సహకారాలు అందిస్తా నని రాష్ట్ర విద్య, ఐటీశాఖల మంత్రి తెలిపారు. రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి సంధ్యారాణి గురువారం మంత్రి లోకేష్‌ని కలిసి గిరిజన కార్పొరేషన్ ఉత్పత్తులతో కూడిన గిఫ్ట్ ప్యాక్‌ను బహు మతిగా ఇచ్చారు. దీనిపై మంత్రి లోకేష్ స్పందించారు. సోదరి, మంత్రి సంధ్యా రాణి గిరిజన కార్పొరేషన్ ఉత్పత్తులతో కూడిన గిఫ్ట్ ప్యాక్‌ను తనకు బహుమతి గా ఇచ్చారని తెలిపారు. పూర్తిగా ఆర్గా నిక్ విధానంలో పండిస్తున్న అరకు కాఫీ ఇప్పటికే అంతర్జాతీయఖ్యాతి గడించింద న్నారు.గిరిజన ఉత్పత్తుల బ్రాండ్ ఇమేజ్ కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారని తెలిపారు. ప్రధాని మోదీ, బిల్ గేట్స్ వంటి ప్రముఖులను కలిసిన పుడల్లా వారికి అరకు కాఫీతో కూడిన గిఫ్ట్ ప్యాక్‌ను అందజేస్తూ విస్తృత ప్రాచు ర్యం కల్పిస్తున్నారన్నారు. సోదరి సంధ్యా రాణి కోరిన విధంగా అసెంబ్లీ తరహాలో పార్లమెంటులో అరకు కాఫీ స్టాల్ ఏర్పా టుకు, గిరిజన ఉత్పత్తుల ప్రోత్సాహానికి తన వంతు సహాయ, సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చారు.



# గతం మరిచి మండలిలో బొత్స నీతులు

- టీడీపీ నేత కిమిడి నాగార్జున ధ్వజం
- వైసీపీ హయాంలో విద్యా రంగం సర్వనాశనం
- టీచర్ల బదిలీల్లో భారీగా అవినీతి
- విద్యా కిట్లలోనూ దోచుకున్నారు
- నారా లోకేష్ హయాంలో గాడిన పడుతున్న విద్యాశాఖ

అమరావతి (చైతన్యరథం): విద్యాశాఖ మంత్రిగా ఉండి ఆ రంగాన్ని సర్వనాశనం చేసిన బొత్స సత్య నారాయణ గతం మరిచి శాసనమండలిలో నీతులు వల్లిస్తున్నారని టీడీపీ విజయనగరం పార్లమెంట్ అధ్యక్షుడు కిమిడి నాగార్జున ధ్వజమెత్తారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో గురు వారం జరిగిన విలేకరుల సమావేశంలో నాగార్జున మాట్లాడుతూ శాసనమండలిలో బొత్స మాట్లాడిన మాటలు చాలా విడ్డూరంగా ఉన్నాయని విమర్శిం చారు. బొత్స సత్యనారాయణ విద్యాశాఖ మంత్రిగా ఉండి ఈ రాష్ట్రానికి ఏమీ చేయలేదు. సొంత విజయనగరం జిల్లాకు, తన సొంత నియోజకవర్గమైన చీపురుపల్లి నియోజకవర్గానికి చేసింది శూన్యం. వైసీపీ హయాంలో విద్యారంగం కుదేలైంది. 2019లో ప్రభుత్వ పాఠశాలల్లో 39లక్షల మంది విద్యార్థులుంటే 2024లో ఆ సంఖ్య 34 లక్షలకు తగ్గిపోయింది. వైసీపీ హయాంలో ప్రభుత్వ పాఠశాలలపై విద్యార్థుల తల్లిదండ్రులకు నమ్మకం సన్నగిల్లి విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలల్లో చేర్పించారు. ఇది వాస్తవమా.. కాదా..బొత్స సమాధానం చెప్పాలి. వైసీపీ హయంలో 5 లక్షల మంది విద్యార్థులను వారి తల్లిదండ్రులు ప్రైవేట్ బడులకు పంపించిన విషయం వాస్తవం కాదా తెలపాలి. వైసీపీ హయాంలో ఉపాధ్యాయుల బదిలీలో అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయి. 11 వందల మంది ఉపాధ్యాయులను అక్రమంగా బదిలీ చేశారు. ఒక్కో బదిలీలో 3 లక్షలు మొదలుకొని 8 లక్షల రూపాయల వరకు అవినీతికి పాల్పడ్డారని పత్రికలు, ఉపాధ్యాయ సంఘాలు కోడై కూశాయి. టీచర్ల బదిలీల కోసం లంచాలు తీసుకున్నారన్నది నిజమా.. కాదా బొత్స సమాధానం చెప్పాలి.

అదే విధంగా వైసీపీ హయాంలో విద్యార్థులకు నాసిరకం కిట్లు ఇచ్చారు. వాటిలో నాణ్యత లోపిం చింది. స్కూల్ యూనిఫామ్, బ్యాగులు వెనువెంటనే చిరిగిపోతున్నాయని అనేక ఫిర్యాదులు వచ్చాయి. ఏడున్నర లక్షల విద్యా కిట్లు అదనంగా కొన్నారు. అవి ఏమయ్యాయో లెక్కలు చెప్పాలి. వాటి కోసం



వెచ్చించిన రూ.160 కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో తెలియడంలేదు. అవసరం లేకున్నా విద్యా కానుక కిట్లు కొని ప్రజాధనాన్ని వృథా చేశారు. విద్యా కానుక కిట్ల అవినీతిలో రూ.160 కోట్లు ఎవరి జేబుల్లోకి వెళ్లాయో బొత్స సమాధానం చెప్పాలి. బొత్స సొంత నియోజకవర్గం చీపురుపల్లిలో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించలేక పోయారు. చీపురుపల్లి లోని బాలుర హైస్కూలులో ఒక్క మరుగుదొడ్డిని కూడా కట్టించలేకపోయారు. అదనపు తరగతి గదుల నిర్మాణం కూడా పూర్తి చేయలేకపోయారు.

వైసీపీ హయాంలో రాష్ట్ర వ్యాప్తంగా విద్యారంగం ఏ విధమైన అభివృద్ధికి నోచుకోలేదు. విద్యారంగాన్ని పూర్తిగా భ్రష్టుపట్టించింది. వైసీపీ తెచ్చిన జి.ఓ 117 వల్ల అనేక పాఠశాలలు మూతపడ్డాయి. ఐదేళ్ల పాలన లో జగన్‌రెడ్డి ఒక్క డీఎస్సీ కూడా ప్రకటించలేదు. గత ప్రభుత్వపు తలా, తోకా లేని ఫీజు రీయింబర్స్ మెంట్ విధానంతో లక్షలాది మంది విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అలాంటి బొత్స ఇప్పుడు శాసనమండలిలో ప్రగల్భాలు పలుకుతున్నారు.

నేడు విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ బడుగు, బలహీన వర్గాల విద్యార్థులకు నిజమైన తోడుగా నిలుస్తున్నారు. రాష్ట్ర విద్యావ్యవస్థను సువర్ణాక్షరాలతో లిఖిస్తున్నారు. రాష్ట్రంలో విద్యారంగం నారా లోకేష్ బాధ్యతలు తీసుకోక ముందు ఒకలాగ, తీసుకున్నాక ఒకలాగ ఉంది. అప్పుడు భ్రష్టుపట్టిన విద్యారంగాన్ని లోకేష్ గాడిలో పెడుతున్నారు. వైసీపీ నాయకులు అవాకులు, చవాకులు పేలడం మానుకోవాలి. రానున్న కాలంలో ఎవరూ ఊహించని విధంగా రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని కిమిడి నాగార్జున ఆశాభావం వ్యక్తం చేశారు.

# 'తోటపల్లి' ఆధునికీకరణ పనుల పునః పరిశీలన

- కొత్త అంచనాలు సిద్ధం చేస్తాం
- అసెంబ్లీలో మంత్రి రామానాయుడు



అమరావతి (చైతన్యరథం): ఉత్తరాంధ్రలోని తోటపల్లి ప్రాజెక్టు ఆధునికీకరణ పనులకు సంబంధించి పునః పరిశీలన చేస్తామని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. గురువారం అసెంబ్లీలో ఆ ప్రాంత ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం చెప్పారు. పాలకొండ, రాజాం, కురుపాం నియోజకవర్గాలకు నీరందించే ఆశయంతో నాగావళి నదిపై తోటపల్లి వద్ద ఈ ప్రాజెక్టు నిర్మించి శతాబ్ద కాలం గడిచిపోయినందున ముఖ్య నిర్మాణాలు, అనుబంధ కాలువలు శిథిలావస్థకు చేరిపోయాయి. తోటపల్లి ఆయకట్టు రైతుల అగచాట్లను దృష్టిలో పెట్టుకుని 2018లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం తోటపల్లి కుడి, ఎడమకాలువల ఆధునీకరణ పనులకు రూ.195 కోట్లు కేటాయించి పనులను కాంట్రాక్టర్‌కు అప్పగించింది. రూ 41.66 కోట్ల విలువైన 22 శాతం పనులు పూర్తి చేసినట్లు నిమ్మల స్పష్టం చేశారు. దురదృష్టవశాత్తు 2019లో వచ్చిన దుర్మార్గ వైసీపీ ప్రభుత్వం 25శాతం లోపు జరిగిన పనులను ఎక్కడివి అక్కడే ఆపేయడం, రద్దు చేయడంవంటి దుశ్చర్యల్లో భాగంగా తోటపల్లి ఆధునీకరణ పనులు కూడా ఆగిపోయాయన్నారు. గతంలో ఈ పనులు చేసిన కాంట్రాక్టర్ కూడా తిరిగి చేపట్టేందుకు సిద్ధంగా లేరన్నారు. సభ్యుల కోరిక మేరకు తోటపల్లి కుడి, ఎడమ కాలువల ఆవశ్యకతను, ప్రాధాన్యతను పరిగణలోకి తీసుకుని కొత్త రేట్లు ప్రకారం అంచనాలు వేయించి పునః పరిశీలన చేస్తామని మంత్రి నిమ్మల తెలిపారు.

**వారు గాలికి వదిలేశారు...**

**మనం గాడిలో పెడదాం**

శ్రీకాకుళం జిల్లా హిరమండలం గొట్టా గ్రామం వద్ద వంశధార నదిపై నిర్మించిన గొట్ట బ్యారేజ్ అనుబంధ కాలువల ఆధునికీకరణ పనులను గత వైకాపా ప్రభుత్వం గాలికి వదిలేసిందని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం నాడు అసెంబ్లీలో ధ్వజమెత్తారు. వంశధార స్టేజ్ 2 కింద ఎడమ కాలువ ఆయకట్టు భూములకు నీరందడం లేదని నరసన్నపేట, టెక్కలి, పలాస ఎమ్మెల్యేలు ఆందోళన వ్యక్తం చేసిన నేపథ్యంలో మంత్రి వారికి స్పష్టమైన వివరణ ఇచ్చారు. 1,48,235 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన ఈ బృహత్తర ప్రాజెక్టు ప్రాధాన్యత ప్రభుత్వానికి తెలుసునన్నారు. అందువల్లనే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు 2018లో గొట్టా బ్యారేజ్ కాలువల ఆధునీకరణకు 676 కోట్ల రూపాయలతో అంచనాలు తయారు చేయించారని చెప్పారు. ప్రతిపాదన కార్యరూపం దాల్చే స్థాయిలో కొత్తగా వచ్చిన అరాచక వైకాపా ప్రభుత్వం వాటిని గాలికి వదిలేసిందని మంత్రి విమర్శించారు. వంశధార స్టేజ్–2 లో కుడికాలువ కొంతవరకు పర్వాలేదు. 48 ఏళ్ల కిందట నిర్మించిన ఎడమ కాలువ రాతి కట్టడాలు, షట్టర్లు పూర్తిగా దెబ్బ తినడంతో అనుకున్న స్థాయిలో ఆయకట్టు రైతులకు నీరు అందడం లేదు. 2481 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం ఉన్న ఎడమ కాలువ ద్వారా ప్రస్తుతం 1800–1900 క్యూసెక్కుల మాత్రమే ప్రవహిస్తున్నట్లు మంత్రి రామానాయుడు వివరించారు.దీనికి తోడు ఎడమ కాలువపై 24 లిఫ్టులు ఉండడం వల్ల వాటికి మరో 360 క్యూసెక్కుల నీరు వెళుతోంది. అందువల్లనే ఆయకట్టు భూములకు పూర్తిస్థాయిలో నీరందడం లేదన్నారు. ఆయకట్టు రైతుల అగచాట్లను, సమస్య తీవ్రతను ప్రభుత్వం గుర్తించింది. అందులో భాగంగానే వంశధార స్టేజ్–2 ఎడమ కాలువ పూడిక తీయడం, గట్లు పటిష్ట పరచడం, షట్టర్లు తదితర ఇతర నిర్మాణాలు ఆధునికరించటం వంటి పనులన్నిటికి ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అత్యవసర ప్రాతిపదికన చేపట్టాల్సిందిగా కోరతామన్నారు. అలాగే గొట్టా బ్యారేజ్ ఆధునీకరణకు కూడా రూ.16 కోట్లు వ్యయం కాగల ప్రతిపాదన ఇప్పటికే ప్రభుత్వానికి సమర్పించి పరిపాలనామోదం కోసం చూస్తున్నామని మంత్రి రామానాయుడు వివరించి చెప్పారు.

**ల్యాండ్ కన్వర్షన్ వివరాల సేకరణ**

మూడు దశాబ్దాలుగా ల్యాండ్ కన్వర్షన్ (భూ మార్పిడి) వివరాల సేకరణ కార్యక్రమం జరగలేదని గురువారం అసెంబ్లీలో కావలి ఎమ్మెల్యే దాగుమాటి వెంకట కృష్ణారెడ్డి అడిగిన ప్రశ్నలకు సమాధానంగా జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఈనెల 25న జరిగే కలెక్టర్ల సమావేశంలో ల్యాండ్ కన్వర్షన్ వివరాల సేకరణ కార్యక్రమానికి శ్రీకారం చుట్టి రెండు నెలల్లో పూర్తిచేస్తామని వివరించారు. పట్టణీకరణ, సెజ్‌లు, పారిశ్రామికీకరణ నేపథ్యంలో పెద్ద మొత్తంలో వ్యవసాయ భూములు ఇతర అవసరాలకు మారిపోయాయన్నారు. రెవెన్యూ, వ్యవసాయం, ఇరిగేషన్ శాఖల సమన్వయంతో ల్యాండ్ కన్వర్షన్ వివరాలు సేకరించాల్సి ఉంది. ఈ లెక్కలు తేలిన తర్వాత కన్వర్షన్ అయిన భూములను ఆయకట్టు పరిధి భూముల నుంచి తొలగిస్తామని మంత్రి రామానాయుడు స్పష్టమైన సమాధానం ఇచ్చారు.

రాష్ట్రంలో మొత్తం నాలుగు కోట్ల ఎకరాల భూ విస్తీర్ణంలో రెండు కోట్ల ఎకరాల విస్తీర్ణం మాత్రమే సాగుకు అనువైనదిగా ఆయన పేర్కొన్నారు. ఈ రెండు కోట్ల ఎకరాల్లో ప్రస్తుతం కోటి ఆరు లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నట్లు అనుబంధ ప్రశ్నలకు సమాధానంగా చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వివిధ దశల్లో ఉన్న అన్ని నీటి వనరులను సమీకరించుకుని కొత్తగా 43.598 లక్షల ఎకరాలకు నీరు ఇవ్వబోతున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో మరో 48.612 లక్షల ఎకరాలకు నీరు అందించేందుకు ప్రతిపాదనలు, ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకెళుతున్నట్లు మంత్రి రామానాయుడు వివరించారు.

పోలవరం– బనకచర్ల డీపీఆర్ తయారీ సందర్భంలో సభ్యుడు ప్రతిపాటి పుల్లారావు సూచనలు పరిగణలో తీసుకుంటామని మంత్రి హామీ ఇచ్చారు. సాగర్ ఆయకట్టు కాలువల పూడిక తీత, కలుపు తొలగింపు తదితర పనులు కూడా ఓ అండ్ ఎం పనుల్లో భాగంగా చేస్తామన్నారు. గత ఐదేళ్ల పాలనలో ఓ అండ్ ఎం పద్దు కింద నిధులు కేటాయించకపోవడం వలనే ఈ దుస్థితి దాపురించిందని, వచ్చే వేసవి నుంచి ఈ పరిస్థితిని చక్క దిద్దుతామని మంత్రి రామానాయుడు తెలిపారు.

## దొంగచాటుగా సంతకాలు చేసి సభకు డుమ్మానా?

**- వైకాపా ఎమ్మెల్యేల తీరుపై స్పీకర్ అసహనం**



అమరావతి (చైతన్యరథం): వైకాపా ఎమ్మెల్యేలు దొంగచాటుగా రిజిస్టర్‌లో సంతకాలు చేస్తూ సభకు మాత్రం డుమ్మా కొడుతున్నారని స్పీకర్ చింతకాయల అయ్యన్న పాత్రుడు తప్పుబట్టారు. వైకాపా ఎమ్మెల్యేలు శాసనసభకు రాకుండా సంతకాలు చేస్తుండటంపై స్పీకర్ గురువారం ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వైకాపా ఎమ్మెల్యేలు సభకు హాజరవడం మీరెవరైనా చూశారా.. అంటూ సభ్యులను స్పీకర్ ప్రశ్నించారు. ఎమ్మెల్యేగా ఎన్నికైన సభ్యులు సభకు సగౌరవంగా అసెంబ్లీకి హాజరు కావాల్సి ఉందన్నారు. వైకాపా సభ్యులు ఎవరికీ కనపడకుండా దొంగచాటుగా వచ్చి రిజిస్టర్లో సంతకాలు చేయాల్సిన పనేముందని అసహనం వ్యక్తం చేశారు. అలా వచ్చి వెళ్లడం వారి గౌరవాన్ని పెంచదన్నారు. వైకాపా సభ్యులు బాలనాగిరెడ్డి, తాటిపర్తి చంద్రశేఖర్, మత్స్యలింగం, విరూపాక్ష, విశ్వేశ్వరరాజు, ఆకేపాటి అమర్నాథ్ రెడ్డి, దాసరి సుధ, తదితరులు సంతకాలు చేసినట్లు తేలిందని స్పీకర్ చెప్పారు. గవర్నర్ ప్రసంగం తర్వాత వీరెవరూ సభకు హాజరు కాలేదన్నారు. వేర్వేరు తేదీల్లో వీరు రిజిస్టర్లో సంతకాలు చేసినట్టు తన దృష్టికి వచ్చిందని తెలిపారు. హాజరుపట్టీలో వారి సంతకాలు ఉన్నా వాళ్లు సభకు వచ్చినట్టు స్పీకర్‌గా తాను గుర్తించలేదన్నారు. ఓటేసి గెలిపించిన ప్రజలకు తలవంపులు తేవొద్దంటూ అయ్యన్నపాత్రుడు వ్యాఖ్యానించారు.

## మీ ప్రస్థానం కోట్లాదిమందికి స్ఫూర్తిదాయకం

**- మెగాస్టార్ చిరంజీవికి మంత్రి లోకేష్ అభినందనలు**

అమరావతి (చైతన్యరథం): బ్రిటన్ ప్రభుత్వ పురస్కారం అందుకున్న మెగాస్టార్ చిరంజీవికి విద్య, ఐటీశాఖల మంత్రి నారా లోకేష్ హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ప్రజాసేవలో అత్యుత్తమంగా రాణించి లండన్‌లోని హౌజ్ ఆఫ్ కామన్స్‌లో మెగాస్టార్ చిరంజీవి.. జీవిత సాఫల్య పురస్కారం అందుకున్నందుకు ఎంతో గర్వంగా ఉందన్నారు. చిరంజీవి ప్రస్థానం కోట్లాది మందికి స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఈ పురస్కారానికి చిరంజీవి అన్నివిధాలా అర్హులన్నారు. ఆయ న మరిన్ని పురస్కారాలు, గౌరవాలు పొందాలని మంత్రి లోకేష్ ఆకాంక్షించారు.

# అవినీతికి పాల్పడుతున్న అవుట్ సోర్సింగ్ ఉద్యోగిని

- విచారణ జరిపించి తొలగించాలి
- ఫేక్ చెక్కు ఇచ్చి పొలం రాయించుకొని బెదిరింపులు
- గ్రీవెన్స్‌లో నేతలకు బాధితుల ఫిర్యాదు
- అర్జీలు స్వీకరించిన జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్, రుడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి





అమరావతి(చైతన్యరథం): అన్నమయ్యజిల్లా కంభం వారిపల్లి మండల తహశీల్దార్ కార్యాలయంలో పని చేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగిని ఒకరు అవినీతి అక్రమాలకు పాల్పడుతూ.. ఆన్‌లైన్‌లో ప్రజల పేర్లు తొలగిస్తున్నారని, ఆమె అవినీతి, అక్రమాలపై విచారణ జరిపి ఉద్యోగంనుండి తొలగించాలని గోవర్ధన్అనేవ్యక్తి టీడీపీ కేంద్రకార్యాలయంలో గురువారంజరిగిన ప్రజా వినతుల స్వీకరణ కార్యక్రమంలో విజ్ఞప్తిచేశారు. వివిధ సమస్యలపై తరలి వచ్చినవారి నుంచి మాజీ మంత్రి, జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్,రాజమండ్రి అర్బన్ డెవలప్‌మెంట్అథారిటీ(రుడా) చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి అర్జీలు స్వీకరించి, పరిష్కారానికి కృషి చేశారు.

శ్రీసత్యసాయి జిల్లా కొత్తచెరువు మండలం బంగారు చెన్నేపల్లి గ్రామానికి చెందిన రామిరెడ్డి విజ్ఞప్తి చేస్తూ.. విజయ్ అనే వ్యక్తి తమ వద్ద పొలం కొని అడ్వాన్స్ కింద పది లక్షల రూపాయలకు చెల్లని చెక్కు ఇచ్చి కాగితాలు రాయించుకున్నాడని.. తరువాత ఆ కాగితాలు అడ్డుపెట్టుకుని తమను బెదిరిస్తున్నాడని ఫిర్యాదు చేశాడు.

కడప జిల్లా సింహాద్రిపురం మండలం మద్దలబాయి గ్రామానికి చెందిన బందలదిన్నె మాబి విజ్ఞప్తి చేస్తూ.. తాను సాగు చేసిన చీనీ చెట్లు పూర్తిగా ఎండిపోవడంతో పెట్టుబడి పెట్టిన రూ.7 లక్షలు నష్టపోయానని తనకు ప్రభుత్వం సాయం చేసి ఆదుకోవాలని వేడుకున్నారు.

1986 నుండి దినసరి వేతనంతో వైద్యఆరోగ్య శాఖ ప్రకాశం జిల్లా మలేరియా విభాగంలో పనిచేస్తున్న ఎస్సీ వర్గానికి చెందిన తమను ఖాళీగా ఉన్న నాల్గో తరగతి ఉద్యోగాల్లో భర్తీ చేసి ఆదుకోవాలని ప్రకాశం జిల్లా పెద్ద దోర్నాల మండలం చిన్న దోర్నాల గ్రామానికి చెందిన ఆర్. వెంకటయ్య, తదితరులు విజ్ఞప్తి చేశారు.

ప్రజల నుండి డబ్బులు వసూలు చేసి బోర్డు తిప్పేసిన సిమ్స్ (సెక్యూరిటీ ఇన్వెస్ట్‌మెంట్ మేకింగ్ సర్వీస్) కంపెనీకి సంబంధించిన ఆస్తులను త్వరగా వేలం వేసి మోసపోయిన బాధితులకు పరిహారం అందేలా చూడాలని పలువురు బాధితులు గ్రీవెన్స్‌లో అర్జీ ఇచ్చి విజ్ఞప్తి చేశారు.

అన్నమయ్య జిల్లా మదనపల్లెకు చెందిన ప్రసాద్ రెడ్డి గ్రీవెన్స్‌లో విజ్ఞప్తి చేస్తూ.. తన స్థలాన్ని కబ్జా నుండి విడిపించాలని కోర్టు ఆదేశించినా కోర్టు ఆదేశాలను అధికారులు పట్టించుకోవడంలేదని.. కోర్టు ఆదేశాలను ధిక్కరిస్తున్న అధికారులపై చర్యలు తీసుకొని తన స్థలాన్ని కబ్జా నుండి విడిపించాలని కోరారు.

కృష్ణా జిల్లా గుడివాడకు చెందిన తాళ్లూరి నిర్మల విజ్ఞప్తి చేస్తూ.. వంగేవరపు జోషి అనే వ్యక్తి మరణాయుధంతో తనపై దాడి చేస్తే.. పోలీసులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని.. దాంతో వారి కుటుంబ సభ్యులు మళ్లీ తనపై హత్యాయత్నానికి పూనుకున్నారని. వారిపై చర్యలు తీసుకొని తనకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు.

అనంతపురం జిల్లా గార్లదిన్నె మండలం యర్రగుంట్ల గ్రామానికి చెందిన కె.మంగమ్మ విజ్ఞప్తి చేస్తూ.. గతప్రభుత్వంలో చేపట్టిన రీ సర్వేలో తాము సాగు చేసుకుంటున్న భూమిని మరొకరి పేరుతో ఆన్ లైన్ చేశారని.. దీనిపై విచారణ జరిపించి, తమకు న్యాయం చేయాలని కోరారు.

## గత ఐదేళ్లలో ఎమ్మెల్యేలంటే బూతులు, బెదిరింపులు...

# నేడు ఆటలు, నాటికలు

- ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల ఐక్యత, పోరాట పటిమకు క్రీడా, సాంస్కృతిక పోటీలు ఉపయోగం
- ఇదే సమష్టి స్ఫూర్తితో రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములవుదాం
- సభ్యుల క్రీడా, సాంస్కృతిక స్ఫూర్తి అద్భుతం
- కొనియాడిన ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్
- సాంస్కృతిక పోటీల అనంతరం క్రీడా పోటీల విజేతలకు బహుమతుల ప్రదానం
- ముఖ్యమంత్రి చంద్రబాబుతో కలిసి పాల్గొన్న పవన్ కళ్యాణ్



విజయవాడ (చైతన్యరథం): గత ఐదేళ్లలో శాసన సభ్యులంటే బెదిరింపులు, బూతులు అనే ధోరణిని చూశారు... ఆ పరిస్థితి నుంచి బయటకు వచ్చి శాసన సభ్యుల్లో ఓ సుహృద్భావ వాతావరణం, సోదరభావం పెంపొందించేందుకు క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించడం శుభ సంప్రదాయం.. అని ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కొనియాడారు. ఐక్యతతో, పోరాట పటిమతో, సమష్టిగా ముందుకు సాగడానికి ఈ పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. రెండు రోజులుగా సాగిన క్రీడా పోటీలు, గురువారం సాయంత్రం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాల్లో శాసనసభ్యుల ప్రతిభ అద్భుతం అనిపించిందని చెప్పారు. శాసనసభ, శాసనమండలి బడ్జెట్ సెషన్ ముగింపు వేళ ఉభయ సభల సభ్యులకు రెండు రోజుల పాటు క్రీడా పోటీలు, గురువారం సాయంత్రం విజయవాడలో సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని క్రీడా పోటీల విజేతలకు బహుమతుల ప్రదాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో కలిసి పవన్ కళ్యాణ్ పాల్గొన్నారు. శాసనసభ్యులు, శాసనమండలి సభ్యులు సాంస్కృతిక కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. వివిధ రకాల వేషాలు, ఏకపాత్రాభిన యాలు, స్కిట్లతో అలరించారు. కార్యక్రమాన్ని పవన్ కళ్యాణ్ ఆసాంతం ఆనందించారు. చప్పట్లతో తోటి శాసనసభ్యులను, మండలి సభ్యులను ప్రొత్సహించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పక్కనే ఆశీనులై కామెడీ స్కిట్లు చూసి మనసారా నవ్వుకున్నారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ శాసన సభ్యుల కామెడీ స్కిట్లు చూస్తే తన గబ్బర్ సింగ్ సినిమా పోలీస్ స్టేషన్ సీన్ గుర్తుకువచ్చిందన్నారు. మనసారా నవ్వుకున్నాను. చాలా రోజులపాటు తల్చుకొని మరీ నవ్వుకునేంత ఎంజాయ్ చేశాను. ఇదో అద్భుతమైన రోజు. ముఖ్యంగా శాసనసభలో ఎస్సీ వర్గీకరణ మీద తీర్మానం చేసి పంపిన రోజు. సీఎం చంద్రబాబు చొరవ, మంద కృష్ణ స్ఫూర్తితో సుమారు 3 దశాబ్దాల పోరాటానికి విజయం సాధించిన ఈ రోజున ఈ సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొనడం నిజంగా అభినందనీయం అని పవన్ కళ్యాణ్ అన్నారు.



### చంద్రబాబు మనసారా నవ్వడం చూశాను

ఎప్పుడూ పాలన, భవిష్యత్తు మీద ఆలోచనలతో గుంభనంగా ఉండే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చాలా రోజులు తర్వాత మనసారా నవ్వడం చూశాను. ఒక శాసనసభ్యుడికే బోలెడు పనులు, సమస్యలు ఉంటాయి. అలాంటిది ఓ రాష్ట్రాన్ని మొత్తం చూసుకోవల్సిన బాధ్యత ఉన్న ముఖ్యమంత్రి నిత్యం ఆలోచనలతోనే ఉంటారు.

గుంభనంగా ఉండే ఆయన మోముపై నవ్వుల పువ్వులు పూయించిన ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. ఇలాంటి సత్సంప్రదాయం మనలో ఐక్యతను నింపుతుంది. వేర్వేరు పార్టీల నుంచి వచ్చిన సభ్యులుగా ఒకే కూటమిలో ఉన్న మనకు ఇలాంటి పోటీలు కొత్త ఉత్సాహాన్ని ఇస్తాయి. ఇలాంటి సంప్రదాయం ఎల్లపుడూ కొనసాగాలి. శాసనసభ్యుల్లో ఉన్న ఈ స్ఫూర్తి చూస్తే ముచ్చటేసింది. చిన్నప్పటి నుంచి క్రీడలకు నేను కాస్త దూరం. అయినప్పటికీ వచ్చే ఏడాది నేను కూడా ఏదైనా పోటీలో పాల్గొనేందుకు ప్రయత్నిస్తానని పవన్ చెప్పారు.

### సభాపతి అయ్యన్న పాత్రుడికి ధన్యవాదాలు

స్వతహాగా హాస్య చతురతతో ఉండే సభాపతి అయ్యన్న పాత్రుడు చొరవ తీసుకొని ఈ పోటీలు నిర్వహించడం శుభ పరిణామం. సభ్యులు కూడా అంతే ఉల్లాసంగా పోటీల్లో పాల్గొన్నారు. దుర్యోధనుడిగా ఏక పాత్రాభినయం చేసిన డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణరాజుకి, బాలచంద్రుడిగా చేసిన దుర్గేష్‌కి, ఇతర సభ్యులకు మనస్ఫూర్తిగా ధన్యవాదాలు. ఒకప్పుడు రాష్ట్రంలో ఉన్న అరాచక ప్రభుత్వాన్ని సాగనంపడానికి అంతా ఏకమై ముందుకు సాగాం. ఇప్పుడు రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా ముందుకు తీసుకెళ్లడానికి ఇదే స్ఫూర్తితో ముందుకు వెళదామని ఉప ముఖ్యమంత్రి పవన్ పిలుపు ఇచ్చారు.



చైతన్యరథం

## ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతిక కార్యక్రమాలు..

# ఆద్యంతం ఉత్సాహభరితం









విజయవాడ (చైతన్యరథం): విజయవాడలోని ఏ కన్వెన్షన్‌లో గురువారం ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల సాంస్కృతికకార్యక్రమాలు ఎంతో ఉల్లాసంగా, ఆనంద భరిత వాతావరణంలో జరిగాయి. ఈ కార్య క్రమాలు ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉపముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్, శాసన సభ స్పీకర్ చింతకా యల అయ్యన్న పాత్రుడులను సైతం కడుపుబ్బ నవ్వించాయి.. ప్రజాప్రతినిధులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక పోటీల్లో ఎవరికి వారు పోటీపడి తమ ప్రదర్శనలను ఇచ్చారు. వారిని ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి, స్పీకర్‌లు అభినం దించారు. ఈ కార్యక్రమాలు ప్రతి ఏడాది నిర్వహించ నున్నట్లు ముఖ్యమంత్రి సైతం ప్రకటించారు.

### ఎంతో ఆనందంగా ఉంది: స్పీకర్ అయ్యన్న

ఈ సందర్భంగా శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ ఈ రోజు తనకు చాలా ఆనందంగా ఉందన్నారు. తాను 1983 నుంచి మాజీ ముఖ్యమంత్రి స్వర్గీయ ఎన్టీ రామారావు కాలం నుంచి ఎమ్మెల్యేగా పనిచేసానన్నారు. నేడు ముఖ్య మంత్రి నారా చంద్రబాబు నాయుడు సారధ్యంలో, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సహకారంతో ముందుకు వెళుతున్నామన్నారు. అప్పట్లో ఎప్పుడూ ప్రజాప్రతినిధుల స్పోర్ట్స్ జరుగుతుండేవని, మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ ఎన్టీ రామారావు కూడా సాంస్కృతిక కార్యక్రమాల్లో పాల్గొని దుర్యోధనుడి పాత్ర వేసి మొదటి ప్రైజ్ గెలుచుకున్నార న్నారు. ఇది సాంస్కృతిక కార్యక్రమాలకు ఆనాటి ముఖ్యమంత్రి, దివంగత నేత ఎన్టీ రామారావు ఇచ్చిన తోడ్పాటుకు నిదర్శనం అన్నారు. అదే ఒరవడిని నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కూడా కొనసాగిస్తున్నార న్నారు. ప్రజాప్రతినిధులు అందరూ క్రీడల్లో పాల్గొని తమ క్రీడా స్ఫూర్తిని కొనసాగించా రన్నారు. విజయవాడ నగర వాసులు సైతం ప్రజాప్రతినిధుల క్రీడలను చూసేందుకు తరలివచ్చా రన్నారు. తక్కువ సమయంలోనే తోడ్పాటు అందించిన ఆర్థక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్, క్రీడల మంత్రి రాంప్రసాద్ రెడ్డి, శాప్ చైర్మన్ అనిమిని రవి నాయుడు, సిబ్బంది అందరినీ ఈ సందర్భంగా స్పీకర్ అభినందించారు..

### అందరికీ ధన్యవాదాలు: మంత్రి పయ్యావుల

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వందన సమర్పణ చేస్తూ తాను 28 ఏళ్లకే రాజకీయాల్లోకి వచ్చానన్నా రు. అప్పటి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు క్రీడా స్ఫూర్తిని చూస్తున్నా నన్నారు. ముఖ్యమంత్రి వ్యక్తిత్వం చూస్తే పాలిటిక్స్‌లో గాని, పర్సనాలిటీలో గాని ఎప్పుడూ రాజీ పడలేదన్నారు. ప్రతి విష యాన్ని నిశితంగా గమనిస్తూ పనే ధ్యాస గా పనిచేస్తూఉంటారన్నారు.ముఖ్యమంత్రి చంద్రబాబు ఇంతగా నవ్విన సందర్భం ఎప్పుడూ లేదన్నారు.

ప్రజాప్రతినిధుల క్రీడలను ఇంత విజయవంతంగా నిర్వ హించేందుకు సహకరించిన ప్రతి ఒక్కరికీ మంత్రి పయ్యావుల ధన్యవాదాలు తెలయ జేశారు.కార్యక్రమంలో మంత్రులు,ప్రభుత్వ విప్‌లు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజ యానంద్, వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధితాధికారులు, తదితరులు పాల్గొన్నారు.







చైతన్యరథం




# 'అమరావతి చిత్ర కళా వీధి'

**- పోస్టర్ ఆవిష్కరించిన ఉప ముఖ్యమంత్రి**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్‌లో నిర్వహించనున్న "అమరావతి చిత్ర కళా వీధి" పోస్టర్‌ను రాష్ట్ర సృజనాత్మకత, సాంస్కృతిక కమిషన్ చైర్‌పర్సన్ తేజస్వి పొడపాటితో కలిసి ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, ఈ ప్రత్యేకమైన కళా ఉత్సవం ఆంధ్రప్రదేశ్ లోని కళాకారులందరికీ ఒక ఆశాకిరణంలా నిలుస్తుందని అన్నారు. ప్రతిభావంతులైన కళాకారులు వారి కళను ప్రదర్శించడానికి, గుర్తింపు పొందడానికి ఒక వేదికను అందించడంలో తన పూర్తి మద్దతు ఉంటుందని ఆయన హామీ ఇచ్చారు.

తేజస్వి పొడపాటి మాట్లాడుతూ, సంవత్సరాలుగా విస్మరణకు గురైన కళాకారులను ప్రోత్సహించడానికి సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక కమిషన్ కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమం కేవలం ఒక వాగ్దానం మాత్రమే కాదని, కళాకారుల సాధికారతకు ఒక స్పష్టమైన ముందడుగు అన్నారు. కళాకారుల సంఘం నుండి అపూర్వమైన స్పందన లభించిందని ఆమె పునరుద్ఘాటించారు. వచ్చే ఏప్రిల్ 4న రాజమండ్రిలో జరగనున్న "అమరావతి చిత్ర కళా వీధి" కార్యక్రమం రాష్ట్రంలో ఈ తరహాలో మొదటి కార్యక్రమం కావటం విశేషం. ఇది దేశవ్యాప్తంగా ఉన్న కళాకారులను ఒకే వేదికపైకి తీసుకువచ్చి, వారి కళాఖండాలను ప్రదర్శించి విక్రయించడానికి, కళాభిమానులతో ప్రత్యక్ష సంభాషణకు అవకాశం కల్పిస్తుంది.

# అన్ని వర్గాల అభివృద్ధే సీఎం చంద్రబాబు లక్ష్యం

- **ఎన్నికల్లో ఇచ్చిన మాటకు కట్టుబడి ఎస్సీ వర్గీకరణ**
- **గతంలో వర్గీకరణ చేసిన ఘనత చంద్రబాబుదే**
- **అసెంబ్లీలో మంత్రి డోలా బాల వీరాంజనేయస్వామి**

అమరావతి (చైతన్యరథం): సమాజంలోని అన్ని వర్గాలు అభివృద్ధి చెందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా.డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి అన్నారు. గురువారం నాడు శాసనసభలో ఎస్సీ వర్గీకరణ అంశంపై మంత్రి మాట్లాడుతూ.. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఎస్సీ వర్గీకరణ చేపడుతున్నామన్నారు. దీనికోసం ఏకసభ్య కమిషన్ నియమించాం. ఈ కమిషన్ రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో పర్యటించి ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. 59 ఎస్సీ కులాలను మూడు గ్రూపులుగా విభజించాలని కమిషన్ ప్రతిపాదించింది.

మొదటి గ్రూప్‌లో రెల్లి, అనుబంధ కులాలు, రెండవ గ్రూప్‌లో మాదిగ, అనుబంధ కులాలు, మూడవ గ్రూప్‌లో మాల, అనుబంధ కులాలుగా విభజించింది. ఇందులో మొదటి గ్రూపునకు ఒక శాతం, రెండవ గ్రూప్‌నకు 6.5 శాతం, మూడవ గ్రూప్‌నకు 7.5 శాతం రిజర్వేషన్ కల్పించాలని కమిషన్ ప్రతిపాదించింది. జిల్లాల వారీగా వర్గీకరణ చేయాలని పలువురు సభ్యులు కోరారు. కొత్త జిల్లాల నేపథ్యంలో జనాభా లెక్కలు సరిగా లేనందున భవిష్యత్తులో జనాభా లెక్కలు జరిగిన తర్వాత జిల్లాల వారీగా వర్గీకరణ చేయాలని కమిషన్ సూచించిందని, సభ్యులందరూ ఈ ప్రతిపాదనను ఆమోదించాలని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కోరారు. ఎస్సీ, ఎస్టీల సంక్షేమం కోసం అన్న ఎన్టీఆర్ ఎంతగానో పాటుపడ్డారని మంత్రి డోలా గుర్తు చేసారు.

ఎస్సీ ఎస్టీలకు నాణ్యమైన విద్య అందించేందుకు ఎన్టీఆర్ గురుకుల పాఠశాలలు స్థాపించారన్నారు. నాడు అంటరానితనం నిర్మూలించేందుకు జస్టిస్ పున్నయ్య కమిషన్ వేసి ఆ సిఫారసులు అమలు చేసిన ఘనత చంద్రబాబు నాయుడుదేనన్నారు. గతంలో ఉమ్మడి రాష్ట్రంలో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే తొలిసారిగా ఎస్సీ వర్గీకరణ అమలు చేశారని గుర్తు చేశారు. విభజిత ఏపీలో.. గత టీడీపీ ప్రభుత్వం రాజధానిలో 120 అడుగుల అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలం



కేటాయించి పనులు కూడా ప్రారంభించిందని, కానీ చంద్రబాబుకు మంచి పేరు వస్తుందన్న అక్కసుతో తరువాత అధికారంలోకి వచ్చిన జగన్ దాన్ని నిర్వీర్యం చేశారని విమర్శించారు. ఎస్సీల ఇంటి నిర్మాణానికి అదనంగా కూటమి ప్రభుత్వం రూ.50 వేలు అందిస్తోందన్నారు. ఎస్సీ కాలనీల్లో సిమెంట్ రోడ్లు, పలు అభివృద్ధి కార్యక్రమాలు టీడీపీ ప్రభుత్వంలో జరిగినవే తప్ప గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఎస్సీలకు జగన్ చేసిందేమీలేదన్నారు. సబ్ ప్లాన్ నిధులను సైతం జగన్ దారి మళ్లించారన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక చరిత్రలో ఎన్నడు లేని విధంగా రూ. 143 కోట్లతో హాస్టళ్లలో మరమ్మతులు చేస్తున్నామని, తల్లిదండ్రులు లేని విద్యార్థుల కోసం వేసవికాలంలో అనురాగం పేరుతో హాస్టళ్లల్లోనే వసతి సౌకర్యం కల్పిస్తున్నట్టు తెలిపారు.

విద్యార్థులకు అత్యవసర వైద్య సహాయం కోసం సాంత్వన పథకాన్ని తీసుకువస్తామన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులతో రాష్ట్రంలో కొత్తగా 30 ఎస్సీ హాస్టళ్లు నిర్మిస్తున్నామని, వీటికి సీఎం చంద్రబాబు నాయుడు ఈ నెలలోనే శంకుస్థాపన చేయనున్నట్టు తెలిపారు. ఎస్సీ కార్పొరేషన్‌కి రూ. 341 కోట్లు కేటాయించామని, దీని ద్వారా 20 వేల మందికి లబ్ధి చేకూరుంతుదన్నారు. లిడ్ క్యాప్ ద్వారా చర్మకారులను ప్రోత్సహిస్తామన్నారు. పీ 4 ద్వారా ఎస్సీలకే మేలు జరుగుతుందని మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి స్పష్టం చేశారు.

# రైతులకు ఇబ్బంది లేకుండా ట్రాన్స్‌ఫార్మర్లు అందిస్తాం

**- అసెంబ్లీలో విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్**



అమరావతి (చైతన్యరథం): రైతులకు ఇబ్బంది లేకుండా వచ్చే వ్యవసాయ సీజన్ నాటికి కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులోకి తీసుకొస్తామని విద్యుత్‌శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ తెలిపారు. అసెంబ్లీలో గురువారం ఆయన మాట్లాడుతూ ఏపీఎస్పీడీసీఎల్ పరిధిలో ఇప్పటికే 22 సబ్ స్టేషన్లకు టెండర్లు పిలిచామన్నారు. లోడ్ ఆధారంగా రైతులకు ట్రాన్స్‌ఫార్మర్లు అందజేస్తామని చెప్పారు. గత ప్రభుత్వం 90 శాతం ట్రాన్స్‌ఫార్మర్లను ఒకే కంపెనీ నుంచి కొనుగోలు చేసింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు అవకాశం కల్పిస్తున్నాం. ట్రాన్స్‌ఫార్మర్లు తయారు చేసే ఎంఎస్ఎంఈలను కూడా ప్రభుత్వం తరపున ప్రోత్సహిస్తున్నాం. అవసరం మేరకు కొత్త ట్రాన్స్‌ఫార్మర్లను, విద్యుత్ స్తంభాలను కొనుగోలు చేస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు ఎక్కువ ధరకు కొనుగోలు చేశారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత ట్రాన్స్‌ఫార్మర్ల ధరలను 20శాతానికి పైగా తగ్గించామని మంత్రి గొట్టిపాటి తెలిపారు.

# క్రీడల అభివృద్ధికి చర్యలు

**- మూడు జిల్లాలకో క్రీడా పాఠశాల**

**- శాసనమండలితో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. శాసనమండలి ప్రశ్నోత్తరాల్లో గురువారం సభ్యుల ప్రశ్నలకు మంత్రి సమాధానమిస్తూ కడపలోని క్రీడా పాఠశాలలో ఉచిత విద్యతో పాటు పలు క్రీడలపై విద్యార్థులకు శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. 2024-29 నూతన క్రీడా పాలసీ ప్రకారం దశల వారీగా ప్రతి మూడు జిల్లాలకు ఒక క్రీడా పాఠశాలను నిర్మించాలని ప్రభుత్వ లక్ష్యంగా పెట్టుకుందన్నారు. ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ (శాప్ ) ఆధ్వర్యంలో విజయవాడ, విజయనగరంలలో క్రీడా పాఠశాలలను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. 14-18 మధ్య వయస్సు మధ్య ప్రతిభ కలిగిన క్రీడాకారుల కోసం దశల వారీగా విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, ఎన్టీఆర్, నెల్లూరు తిరుపతిలలో క్రీడా అకాడమీలను తిరిగి నిర్మిస్తామన్నారు. గత ప్రభుత్వ హయాంలో నిలిచిపోయిన క్రీడా సముదాయాలను సీఎం చంద్రబాబు నాయకత్వంలో పునర్నిర్మించడానికి చర్యలు తీసుకుంటున్నట్లు మంత్రి మండిపల్లి తెలిపారు.

# పాస్టర్ల గౌరవ వేతనాలకు రూ.12.82 కోట్లు విడుదల



**- 2024 మే నుండి చెల్లింపు**

**- మైనారిటీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ వెల్లడి**

అమరావతి (చైతన్యరథం): రాష్ట్రంలో క్రైస్తవ పాస్టర్లకు గౌరవ వేతనాల చెల్లింపు కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.12.82 కోట్లు విడుదల చేసిందని రాష్ట్ర న్యాయ, మైనారిటీ సంక్షేమ శాఖల మంత్రి ఎన్ఎండి ఫరూక్ తెలిపారు. గురువారం ఈ మేరకు అమరావతిలో ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్రంలోని 8,427 మంది పాస్టర్లకు నెలకు ఒక్కొక్కరికి రూ.5000 చొప్పున గౌరవ వేతనం ఇస్తున్నట్లు తెలిపారు. గత ఏడాది మే నెల నుంచి పాస్టర్లకు గౌరవ వేతనం చెల్లింపునకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని తెలిపారు. ఇప్పటికే గత నెలలో రాష్ట్రంలోని ఇమాములు, మౌజాన్లకు 6నెలల గౌరవ వేతనం చెల్లింపు ప్రక్రియను పూర్తి చేసి రూ. 45 కోట్లు చెల్లించామని తెలిపారు. మైనార్టీల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. గత ప్రభుత్వం మైనార్టీల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. మైనారిటీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రణాళికాబద్ధమైన చర్యలను అమలు చేస్తున్నదని మంత్రి ఫరూక్ పేర్కొన్నారు.

# డ్రగ్స్ మహమ్మారిపై ప్రభుత్వం ఉక్కుపాదం

**- డ్రగ్స్ నియంత్రణలో గత ప్రభుత్వం విఫలం**

**- యువతలో ఆలోచన రేకెత్తించేలా డార్క్ డీల్స్ సినిమా**

**- ట్రైలర్ విడుదల కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్**



విజయవాడ (చైతన్యరథం): డ్రగ్స్ మహమ్మారిపై కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తోందని, రాష్ట్ర హోంమంత్రి అనిత సారథ్యంలో ఈగల్ టీం.. ఈ విషయంలో ఉక్కుపాదం మోపుతోందని రాష్ట్ర కార్మికశాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం డ్రగ్స్ నియంత్రణను పూర్తిగా విస్మరించిందని, చిన్న పిల్లలను కూడా డ్రగ్స్‌కు అలవాటు చేసిందని మండిపడ్డారు. గురువారం విజయ వాడలో సమీరా ఫిలిమ్స్ నిర్మించిన డార్క్ డీల్స్ చిత్రం ట్రైలర్‌ను మంత్రి వాసంశెట్టి సుభాష్ చేతుల మీదుగా విడుదల చేశారు. చిత్ర నిర్మాత కసునూరి మౌలాలి అధ్యక్షతన జరిగిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. డ్రగ్స్‌ని నియంత్రించడంలో గత ప్రభుత్వ నిర్లక్ష్యం వహించిందని, ఈ విషయంలో జగన్మోహన్ రెడ్డి పూర్తి విఫలమయ్యా డని ఆరోపించారు. గత ప్రభుత్వం నిరుద్యోగ సమస్య పరిష్కారంలో పూర్తిగా విఫలమైందని, ఫలితంగా నిరాశ, నిస్పృహల్లో కూరుకుపోయిన యువత చెడు అలవాట్లకు బానిసలుగా మారి మత్తులో కూరుకుపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు నాయకత్వంలో హోంమంత్రి అనిత డ్రగ్స్‌పై నిరంతరం పోరాడుతున్నారన్నారు. డార్క్ డీల్స్ వంటి సినిమాలు వల్ల యువతలో చైతన్యం పెరిగి డ్రగ్స్ బారిన పడకుండా ఉంటారని, యువతలో మంచి ఆలోచనలకు దారి తీసే విధంగా ఈ చిత్రం ఉందని చెప్పారు. యువ తలో చైతన్యం, స్ఫూర్తి కలిగించే ఇలాంటి సినిమాలు రానున్న రోజుల్లో ఎన్నో రావాలని కోరుతూ ఈ చిత్ర యూనిట్‌ని మంత్రి వాసంశెట్టి అభినందించారు. అలాగే నిరుద్యోగ సమస్యను పరిష్కరించి, యువతను సక్రమ మార్గంలో పయనించేలా తమ ప్రభుత్వం తగు చర్యలు తీసుకుంటుందన్నారు. ఇందుకు గాను ఉపాధి శిక్షణ కార్యక్రమాలను నిర్వహించి ఎక్కడికి అక్కడే ఉద్యోగాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి చర్యలు తీసుకుంటున్నారని మంత్రి తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్మాత కసునూరి మౌలాలి మాట్లాడుతూ నేడు యువత ఎంతోమంది మత్తుకి బానిస అవుతున్నారన్నారు. యువతీ, యువకులు వాళ్ళ జీవితాలను డ్రగ్స్ వల్ల నాశనం చేసుకుంటున్నారని, అలాంటి వారిలో ఎంతో కొంత మార్పు తీసుకు రావాలనే ఉద్దేశంతో ఈ చిత్రాన్ని నిర్మించినట్లు తెలిపారు. మంత్రి ఎంతో బిజీగా ఉన్నా కూడా మా కోసం సమయాన్ని కేటాయించి ట్రైలర్ విడుదల చేసి నందుకు డార్క్ డీల్స్ టీమ్ తరఫున ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా డైరెక్టర్ కిరణ్ మాట్లాడుతూ మంత్రి వాసంశెట్టి సుభాష్ మా ట్రైలర్‌ని వీక్షించి చాలా బాగుందని మెచ్చుకున్నారన్నారు. మా టీంకి సమయం కేటాయించినందుకు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో హీరోయిన్ తేజస్విని, ఆశ ,ఉమా, ఏడుకొండలు, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

# ఇంటికో పారిశ్రామికవేత్త తయారీకి సమన్వయంతో పనిచేయాలి

**- రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్**



విజయవాడ (చైతన్యరథం): ఒక కుటుంబం –ఒక పారిశ్రామికవేత్త లక్ష్య సాధనకు స్వల్పకాలిక, దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళికతో ముందుకు సాగాలని రాష్ట్ర సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమలు, గ్రామీణ పేదరిక నిర్మూలన, ప్రవాసాంధ్రుల సాధికారత సంబంధాల శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్లు, మేనేజర్లతో రెండు రోజులపాటు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన వర్క్ షాప్‌లో గురువారం మంత్రి శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025–26 ఆర్థిక సంవత్సరంలో స్వయం సహాయక సంఘాల వారీగా రుణ ప్రణాళిక తయారు చేయాలని సూచించారు. స్వయం సహాయక సంఘాలు, గ్రామ సంఘాల ఆర్థిక దావాదేవీలను ఎప్పటికప్పుడు నమోదు చేసే విధంగా సమగ్రంగా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. ఇకపై ప్రతి మూడు నెలలకు ఒకసారి సంఘాల పుస్తకాలను అంతర్గత ఆడిట్ నిర్వహించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. బోగస్ గ్రూపులు ఏర్పాటు చేసుకొని బ్యాంకు నుండి అక్రమంగా రుణాలు పొందడాన్ని పూర్తిగా నివారించాలని అన్నారు. ఎన్‌ఆర్‌ఎల్‌ఎంఐడి ఉన్న గ్రూపులకే బ్యాంకు రుణాలు ఇచ్చే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. స్త్రీనిధి రుణాలు నూటికి నూరు శాతం వసూలయ్యే విధంగా పథక సంచాలకులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు చెబుతున్నట్లుగా ఒక కుటుంబంలో ఒక పారిశ్రామికవేత్త లక్ష్య సాధనకు ప్రతి సీసీ, ఏపీఎంలు స్వల్పకాలిక, దీర్ఘకాలిక కార్యాచరణ ప్రణాళిక తయారు చేసుకోవాలని నిర్దేశించారు. ప్రతి కుటుంబం నుండి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేసే క్రమంలో సంఘ సభ్యులకు కావలసిన సాంకేతికపరమైన శిక్షణ, వ్యాపార సంస్థల నిర్వహణలో మెళకువలు, మార్కెటింగ్ లింకేజ్ ఏర్పాటుపై జిల్లాస్థాయిలో అన్ని ప్రభుత్వ శాఖలతో జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థలు సమన్వయం ఏర్పాటు చేసుకొని సేవలందించాలని మంత్రి కోరారు. సభ్యుల జీవనోపాధుల మెరుగుదలకు ఇప్పటికే ఖైతీ, నాబార్డ్, ఉబయ్ ఆక్వా, బుజ్వర్తీ ఫౌండేషన్, ఫ్లిప్ కార్ట్, వృత్తి, క్యాపిటలిస్ట్ మేనేజ్మెంట్ సర్వీస్, ఫామ్ వేద వంటి సంస్థలతో ఎంఓయులు చేసుకున్నామని, వారి ద్వారా వివిధ రంగాల్లో జీవనోపాధుల మెరుగుదలకు చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రస్థాయిలో ప్రత్యేకంగా విజిలెన్స్ వింగ్ ఏర్పాటు చేయాల్సిందిగా సెర్ఫ్ సీఈవోకు మంత్రి సూచించారు. సీ వీడ్ కల్టివేషన్, హేలో పైలేట్స్ సాగుకు అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం కోసం జాతీయ ఉప్పు, సముద్ర రసాయనాల పరిశోధన సంస్థ సహకారం తీసుకోవాలన్నారు. నూతన సాంకేతిక పరిజ్ఞానంతో నాణ్యమైన ఉప్పు తయారీకి చర్యలు చేపట్టడం ద్వారా సముద్ర ఒడ్డు గ్రామాల్లోని జాలర్ల జీవనోపాధులు పెంచే అంశంపై ఈ సమావేశంలో చర్చించారు. గత 25 సంవత్సరాలుగా సంస్థాగత నిర్మాణం, సభ్యుల సామర్థ్యాల పెంపునకు సెర్ఫ్ కృషి చేసిందని ఇకపై ముఖ్యమంత్రి చంద్రబాబు సూచించిన విధంగా సభ్యుల జీవనోపాధుల మెరుగుదలకు కృషి చేయాలన్నారు. పేదరికం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దడం కోసం అందరూ సమష్టిగా ముందుకు సాగాలని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పిలుపు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సెర్ప్ సీఈవో వాకాటి కరుణ, చేనేత జౌళి శాఖ కమిషనర్ రేఖారాణి, జాతీయ ఉప్పు, సముద్ర రసాయనాల పరిశోధన సంస్థ సంచాలకులు కన్నన్ శ్రీనివాస్, సెర్ప్ అదనపు సీఈఓ శ్రీరాములు నాయుడు, డైరెక్టర్లు, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్లు, ప్రాజెక్ట్ మేనేజర్లు పాల్గొన్నారు.

# దిగ్విజయంగా ప్రజాప్రతినిధుల క్రీడలు

**- క్రీడల విజయవంతానికి కృషి చేసిన శాప్ సిబ్బందికి ఛైర్మన్ అనిమిని రవినాయుడు అభినందనలు**



విజయవాడ (చైతన్యరథం): ఏపీ శాసనసభ్యులు, శాసనమండలి సభ్యుల క్రీడాపోటీల నిర్వహణలో సమన్వయంతో సమష్టి కృషితో పనిచేసిన శాప్ సిబ్బంది, పలు జిల్లాల డీఎస్డీఓలను శాప్ ఛైర్మన్ రవినాయుడు ప్రత్యేకంగా అభినందించారు. ప్రజాప్రతినిధుల క్రీడలను గతంలో ఎన్నడూలేని విధంగా పతిష్టాత్మకంగా నిర్వహిం చామన్నారు. శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు, క్రీడాశాఖ మంత్రి రాంప్రసాద్‌రెడ్డి ఆదేశాలతో అంచనాలను మించి దిగ్విజయంగా, సమర్థవంతంగా రెండురోజులపాటు క్రీడాపోటీలను నిర్వహించామ న్నారు. క్రీడల నిర్వహణ పట్ల మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సంతృప్తి వ్యక్తం చేయడం సంతోషకరమన్నారు. ముఖ్యంగా వీఎంసీ సిబ్బంది సహకారం ఎనలేనిదన్నారు. క్రీడాపోటీలు విజయవంత మవడానికి కృషి చేసిన ప్రతీ ఒక్కరికీ ప్రజాప్రతినిధులందరి తరుపున శాప్ ఛైర్మన్ ఈ సందర్భంగా అభినందనలు తెలియ జేశారు. శాప్ సిబ్బంది, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని, భవిష్యత్తులో మరిన్ని క్రీడాకార్యక్రమాలను సమర్థవంతంగా నిర్వహించగలిగేలా పనిచేయాలని సూచించారు.

# ఎండలు, వడగాల్పుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**- విస్తృత ప్రచారంతో ప్రజలకు అవగాహన కల్పించాలి**

**- అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎస్ విజయానంద్**



అమరావతి (చైతన్యరథం): రానున్న మూడు నెలలు అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని, వడగాల్పుల నుండి ఉపశమనం పొందేందుకు అవసరమైన అన్ని ముందుజాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్) కె.విజయానంద్ సూచించారు. రోజురోజుకూ పెరుగుతున్న ఉష్ణోగ్రతలు, రానున్న రోజుల్లో ఉధృతమయ్యే వడగాల్పుల సన్నద్ధతపై రాష్ట్ర సచివాలయం నుండి వివిధ శాఖల అధికారులతో గురువారం వీడియో సమావేశం ద్వారా సీఎస్ సమీక్షించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ ప్రస్తుతం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో 40 నుండి 42 డిగ్రీల సెంటీగ్రేడ్ వరకూ ఉష్ణోగ్రతలు నమోదు అవుతున్నాయని రానున్న రోజుల్లో మరింత పెరిగే అవకాశం ఉన్నందున తగిన ముందు జాగ్రత్త చర్యలు తీసుకునేలా ప్రజల్లో అవగాహన కలిగించేందుకు చర్యలు తీసుకోవాలని విపత్తుల నిర్వహణ సహా సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా ఉపాధి కూలీలు పనిచేసే చోట్ల తాగునీరు, మజ్జిగ, టెంట్లు, ప్రథమ చికిత్స వంటి కనీస సౌకర్యాలు కల్పించాలని చెప్పారు.

అదే విధంగా ప్రస్తుతం విద్యార్థులకు పరీక్షలు జరుగున్నందున ఆయా పరీక్షా కేంద్రాల వద్ద తగిన తాగునీరు, ఇతర సౌకర్యాలను కల్పించాలన్నారు. నిరంతర విద్యుత్ సరఫరాకు చర్యలు తీసుకోవాలని ట్రాన్స్‌కో అధికారులను ఆదేశించారు.

ముఖ్యంగా జిల్లా వడగాల్పుల కార్యాచరణ ప్రణాళికను రూపొందించి తగు ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, జిలా స్థాయిలో వివిధ శాఖలను సమన్వయం చేసేందుకు వీలుగా ఒక నోడల్ అధికారిని నియమించుకోవాలన్నారు. ప్రజల్లో అవగాహన కల్పించేందుకు వివిధ మాధ్యమాల ద్వారా విస్తృత ప్రచారం చేయాలని చెప్పారు. ఏఏ ప్రాంతాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదు అయ్యేది ముందుగానే సంక్షిప్త సందేశాలు జారీ చేయడం ద్వారా ప్రజలను అప్రమత్తం చేయాలని విపత్తుల నిర్వహణ సంస్థ అధికారులను ఆదేశించారు. వైద్య, ఆరోగ్య, విద్య, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, రక్షిత మంచినీటి సరఫరా, కార్మిక, వ్యవసాయ, విద్యుత్, గ్రామ, వార్డు సచివాలయాల, నీటిపారుదల, తదితర విభాగాలు అవసరమైన ముందు జాగ్రత్త చర్యలను తీసుకుని ప్రజలను పూర్తి అప్రమత్తం చేయాలన్నారు.

ఎండలు రోజురోజుకీ పెరుగుతున్న క్రమంలో బయటకు వెళ్లేటప్పుడు ఎలాంటి రక్షణ లేకుండా వెళ్లవద్దని ప్రజలకు సీఎస్ సూచించారు. ఎండా కాలంలో సాధారణంగా నమోదయ్యే ఉష్ణోగ్రతల కంటే 4 నుంచి 5.4 డిగ్రీల సెల్సియస్ వరకు అధికంగా నమోదైతే ఆ పరిస్థితులను హీట్ వేవ్ అంటారని కొన్నిసార్లు అది 6.4 డిగ్రీల సెల్సియస్ కంటే అధికంగా ఉంటే దానిని తీవ్రమైన హీట్ వేవ్ అంటారని పేర్కొన్నారు. ఎక్కువ ఎండలో తిరిగి వడదెబ్బ తగిలితే శరీరంలో నియంత్రణ వ్యవస్థ దెబ్బతింటుందని, దాని వల్ల శరీర ఉష్ణోగ్రత విపరీతంగా పెరిగి, శ్వాస తీసుకోవడంలో ఇబ్బందులు ఎదుర్కొవాల్సి వస్తుందని డాక్టర్లు చెబుతున్నారన్నారు. గత ఏడాది రికార్డులను పరిశీలిస్తే మార్చిలో వడగాల్పులు నమోదు కాలేదని, ఏప్రిల్ నెలలో రాయలసీమ ప్రాంతంలో 10 రోజులు హీట్ వేవ్, కోస్తా ప్రాంతంలో 9 రోజులు, మే లో రాయలసీమ ప్రాంతంలో 6 రోజులు, కోస్తా ఆంధ్ర ప్రాంతంలో 5 రోజులు వడగాల్పులు నమోదు అయ్యాయని సీఎస్ విజయానంద్ పేర్కొన్నారు. వడదెబ్బ నుండి ఉపశమనం పొందేందుకు నీటిని అధికంగా తీసుకోవడంతో పాటు తేలికపాటి ఆహారం తీసుకోవాలని సూచించారు. ఎండ వేడిమి అధికంగా ఉన్నప్పుడు ముఖ్యంగా ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకు అత్యవసరమైతే తప్ప బయటకు రాకూడదని ప్రజలకు సూచించారు. పళ్ల రసాలు తాగుతూ ప్రధానంగా శరీరం లవణాలను కోల్పోకుండా కాస్త ఉప్పు వేసిన ద్రవపదార్థాలు తీసుకోవాలన్నారు. కూల్ డ్రింకులు కాకుండా కొబ్బరి బొండం, మజ్జిగ వంటివి తీసుకోవడం మంచిదని సీఎస్ విజయానంద్ సూచించారు.

ఈ సమావేశంలో రాష్ట్ర విత్తుల నిర్వహణ సంస్థ డైరెక్టర్ ఆర్ కూర్మనాథ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఈ నెల 18వ తేదీనఅత్యధికంగా 42.7 సెంటీగ్రేడ్, 19న 42.3 సెంటీగ్రేడ్ ఉష్ణోగ్రతలు నమోదు అయ్యాయని తెలిపారు. భారత వాతావరణ శాఖ అంచనా ప్రకారం ఈ ఏడాది మార్చి నుండి మే వరకూ రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో వడగాల్పులు వీచే అవకాశం అధికంగా ఉందని తెలుస్తోందని వివరించారు. అధిక ఉష్ణోగ్రతలు, వడగాల్పుల నుండి రక్షణ పొందేందుకు తీసుకోవాల్సిన ముందు జాగ్రత్తలపై ఇప్పటికే వివిధ ప్రచార మాధ్యమాల ద్వారా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు తగిన చర్యలు తీసుకున్నట్టు వివరించారు. అంతేగాక ఎప్పటికప్పుడు వాట్సప్, సోషల్ మీడియా ద్వారా అలెర్ట్ మెసేజ్‌లు జారీ చేస్తున్నట్టు కూర్మనాథ్ తెలిపారు. ఈ వీడియో సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమమే మా లక్ష్యం : కిడారి శ్రావణ్



అమరావతి (చైతన్యరథం): రాష్ట్ర రాజధాని మంగళగిరి టీడీపీ కేంద్ర కార్యాలయంలో రాష్ట్ర ప్రజలు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాలను, ప్రజలు ఇచ్చిన వినతులను తీసుకోవడం జరిగిందని రాష్ట్ర జీ.సీ.సీ ఛైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ తెలిపారు. గురువారం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో కిడారి శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... టీడీపీ ప్రభుత్వం ప్రజల ప్రభుత్వమని, ప్రజల కష్టాలు కోరికలు నెరవేర్చడం తమ ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. తమకు ప్రజలు ఇచ్చిన వినతులను ఆయా శాఖాధికారులకు పంపించి తగిన సాయం చేస్తామన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఏపీలో అభివృద్ధి మొదలైందని, దేశంలో ఎక్కడలేని విధంగా ప్రజల సమస్యలు తెలుసుకోవడం కోసమే పార్టీ కేంద్ర కార్యాలయంలోనే గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. నాయకులు నేరుగా ప్రజా సమస్యలు తెలుసుకుంటూ సమస్యల పరిష్కారానికి కృషి అభినందనీయమన్నారు. ప్రజా సమస్యలు పరిష్కారానికి వేదికగా తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయం ఉంటుందని, ఏ సమస్య ఉన్న నేరుగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుతో కలిసే అవకాశం ఉంటుందన్నారు. టీడీపీ అనేది ప్రజల పార్టీ అని రాష్ట్ర ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందించడమే తెలుగుదేశంపార్టీ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో రుడా ఛైర్మన్ బొడ్డు వెంకట రమణ చౌదరి, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# నడిరోడ్డుపై కాలిబూడిదైన పల్సర్ బైక్!



శ్రీకాకుళం (చైతన్యరథం): జిల్లాలోని పలాసలో అత్యధిక ఉష్ణోగ్రతల వల్ల ఒక పల్సర్ బైక్ మంటలు చెలరేగింది. షార్ట్ సర్క్యూట్ కారణంగా మంటలు చెలరేగి, ఎండ తీవ్రతతో బైక్ పూర్తిగా దగ్ధమైంది. తిమ్మల విశ్వనాథం అనే వ్యక్తి ఈ ప్రమాదం నుండి తప్పించుకున్నాడు. పోలీసులు వేసవిలో వాహనాలను నీడలో పార్క్ చేయాలని సూచిస్తున్నారు. అధిక ఉష్ణోగ్రతలను తట్టుకునేందుకు జాగ్రత్తలు తీసుకోవడం చాలా ముఖ్యం. వేసవి కాలం ప్రారంభంలోనే ఎండలు అల్లాడించేస్తున్నాయి. శ్రీకాకుళం జిల్లాలో ఎండ తీవ్రతకు పల్సర్ బైక్ దగ్ధమైపోయింది. జిల్లాలోని పలాస సమీపంలో 16వ నంబర్ జాతీయ రహదారిపై బుధవారం మధ్యాహ్నం ఈ ఘటన చోటు చేసుకుంది. బైక్‌పై వెళు ఒడగా షార్ట్ సర్క్యూట్ జరిగి బయట ఉన్న ఎండ తీవ్రత దానికి తోడై ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. పలాస మండలం రామకృష్ణాపురం గ్రామానికి చెందిన తిమ్మల విశ్వనాథం అనే వ్యక్తి పల్సర్ బైక్‌పై పలాస నుండి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రయాణిస్తున్న బైక్ నుండి మంటలు ఒక్కసారిగా రావటంతో వెంటనే బైకును ఆపి విశ్వనాథం పరుగులు తీశాడు. క్షణాల్లో మంటలు బైక్ మొత్తం వ్యాపించి కళ్ల ముందే బైక్ మొత్తంగా తగలబడిపోయింది. ఎండ తీవ్రతకు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న వేళ వాహనాలను నీడపట్టున పార్క్ చేసుకోవాలని పోలీసులు సూచిస్తున్నారు. ఎండ వేళ జాగ్రత్తలు పాటించాలి.

# ఈనెల 30వ తేదీన అప్పన్న చందనోత్సవం



సింహాచలం వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవం (నిజరూప దర్శనం) వచ్చే నెల 30వ తేదీన జరుగుతుందని కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిరప్రసాద్ తెలిపారు. చందనోత్సవానికి భారీఎత్తున భక్తులు హాజరుకానున్నందున పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం కలెక్టరేట్‌లో చందనోత్సవ ఏర్పాట్లపై రెవెన్యూ, పోలీస్, దేవదాయ, ఇతర శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. చందనోత్సవం నేపథ్యంలో ఏప్రిల్ 29వ తేదీ సాయంత్రం ఆరు గంటల నుంచి దర్శనాలు నిలిపివేయాలని, భక్తులకు ఈ విషయం తెలియజేయాలని అధికారులకు సూచించారు. దర్శనం టికెట్ల విక్రయ కేంద్రాలు నగరంలో అనుకూలమైన ప్రాంతాల్లో ఏర్పాటుచేయాలని ఆదేశించారు.

# జీవీఎంసీలో వైసీపీకి మరో ఎదురుదెబ్బ...



విశాఖపట్నం: జీవీఎంసీలో వైసీపీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. ఆ పార్టీకి చెందిన ఆరుగురు కార్పొరేటర్లు గురువారం టీడీపీలో చేరారు. అమరావతిలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు.. ఆరుగురు కార్పొరేటర్లకు పసుపు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కె. సునీత (13వ డివిజన్), గేదెల లావణ్య (17వ డివిజన్), ఎం. మేరీ జాన్సీ(36వ డివిజన్), చల్లా రజనీ (54వ డివిజన్), ముర్రి వాణి నానాజీ (57వ డివిజన్), భూపతిరాజు సుజాత (73వ డివిజన్) టీడీపీలో చేరిన వారిలో ఉన్నారు. విశాఖ తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, జీవీఎంసీ టీడీపీ ఫ్లోర్ లీడర్ పైలా శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కార్యకర్తలకు పోషణ భీ... పడాయి భీ పై శిక్షణ



కురుపాం (చైతన్యరథం): కురుపాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఐసీడీఎస్ సీడీపీవో కె. విజయగౌరీ ఆధ్వర్యంలో గురువారం పోషణ భీ.. పడాయి భీ కార్యక్రమంపై అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ ఇచ్చారు. అంగన్వాడీ కేంద్రాలకు వస్తున్న బాల బాలికలకు విద్య, ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలు గురించి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు భవాని, జానకి, గౌరీ, శ్రావణి, ఐసీడీఎస్ సిబ్బంది భాగ్యలక్ష్మి, చక్రధర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవ ర్యాలీ..!**

ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా కురుపాం సామాజిక ఆరోగ్య కేంద్రం దంత వైద్యురాలు డా. సుకృత ఆధ్వర్యంలో గురువారం దంతలపై అవగాహన ర్యాలీ చేపట్టారు. ప్రజలకు, రోగులకు నోటి ఆరోగ్య ప్రాముఖ్యత గురించి వివరించారు. నోటి ద్వారా వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో ఆసుపత్రి పర్యవేక్షకురాలు డా. శోభారాణి, వైద్యులు సందీప్, ఆశాకృష్ణన్, సునీల్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# గంజాయి నిర్మూలనకు సమన్వయంతో కృషి చేయాలి



విశాఖపట్నం (చైతన్యరథం): జిల్లాలో గంజాయి నిర్మూలనకు అధికారులు సమన్వయంతో కృషి చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేశ్‌కుమార్ అన్నారు. గంజాయి నిర్మూలన చర్యలపై వివిధ శాఖల అధికారులతో జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్‌తో కలిసి బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గంజాయి సాగువల్ల కలిగే నష్టాలపై రైతులకు అవగాహన కల్పించాలని, గంజాయి సాగును వీడిన రైతులను వ్యవసాయ, ఉద్యానవనాధికారులు ప్రోత్సహించాలన్నారు. ఆయా ప్రాంతాల్లోని రైతులకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా అవసరమైన శిక్షణలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వైద్య ఆరోగ్య శాఖాధికారులు డిఅడిక్షన్ సెంటర్లను పక్కాగా నిర్వహించాలని, విద్యాలయాలకు సమీపంలోని దుకాణాల్లో మత్తు పదార్థాలు విక్రయించకుండా అధికారులు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే జూన్, జూలై నెలల్లో గంజాయి సాగు ప్రారంభించే అవకాశాలుంటాయని, అప్పటి నుంచి మరింత సమర్థవంతంగా పని చేసి పంట వేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. గంజాయి కేసుల్లో ఉన్న వారి బ్యాంకు ఖాతాలు స్తంభింపజేసి, వాళ్లతో సంబంధాలున్న వారి ఖాతాలపై నిఘా పెట్టాలన్నారు.

**గంజాయి సమాచారాన్ని 1972 నంబర్‌కు అందించండి**

గంజాయి సాగు, రవాణా వంటి సమాచారాన్ని ఈగిల్ టోల్ ఫ్రీ నంబర్: 1972కు తెలపాలని జిల్లా ఎస్పీ అమిత్‌బర్దార్ కోరారు. ఇప్పటికే గంజాయి సాగుపై డ్రోన్లు, ఏఐ సాంకేతికతతో గుర్తించి ధ్వంసం చేశామని, గంజాయికి సంబంధించిన సమాచారాన్ని టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలపాలన్నారు. అలాగే గంజాయి నిర్మూలనకు ప్రజలు సహకరించాలని, టోల్‌ఫ్రీ నంబర్‌ను ప్రజల్లోకి మరింతగా తీసుకువెళ్లాలని అధికారులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బీఎస్ నంద్, జిల్లా ఉద్యానవనాధికారి రమేశ్‌కుమార్‌రావు, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పీడీ వి.మురళి, జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు, ఐసీడీఎస్ పీడీ ఎన్.సూర్యలక్ష్మి, డీఎంహెచ్‌వో సి.జమాల్ బాషా, డీసీహెచ్ఎస్ కె.లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

# రాజానగరం అభివృద్ధికి సహకరించండి



రాజానగరం (చైతన్యరథం): నియోజకవర్గ అభివృద్ధి సహకరించాలని ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ సీఎం చంద్రబాబును కోరారు. ఈ మేరకు అమరావతి సచివాలయంలో ముఖ్యమంత్రితో ఆయన భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పురుషోత్తపట్నం లిఫ్ట్ ఇరిగేషన్ పథకంలో ప్రభుత్వం సేకరించిన భూములకు నష్ట పరిహారం చెల్లించాలని, కోరుకొండ శ్రీలక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం భూములను నిషేధిత జాబితా నుంచి తొలగించాలని, సత్యసాయి డ్రింకింగ్ వాటర్ సిబ్బందికి వేతనాలు చెల్లించాలని సీఎంకు విన్నవించారు. అలాగే రూ.681 కోట్లతో వాటర్ గ్రిడ్ ఏర్పాటు చేసి, నియోజకవర్గంలో తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కల్పించాలన్నారు. తొర్రేడు-సీతానగరం అర్అండ్‌బీ రోడ్డు, సీతానగరం-పురుషోత్తపట్నం పంచాయతీ రోడ్లను త్వరగా పూర్తి చేయాలని కోరారు. కోరుకొండ ఆలయ అభివృద్ధికి రూ.36 కోట్లతో ఇచ్చిన డీపీఆర్ కార్యరూపం దాల్చేలా సహకరించాలని, ఇళ్ల స్థలాల కోసం భూములు ఇచ్చిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు. రాబోయే పుష్కరాల దృష్ట్యా సీతాన గరం ప్రాంతంలో 8 ఘాట్లకు ప్రత్యేక నిధులు కేటాయించాలని, ధాన్యం రైతులకు బకాయిలు చెల్లించాలని కోరారు. ఆయా అంశాలపై సీఎం సానుకూలంగా స్పందించారని, సమస్యలు పరిష్కరించే దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే బత్తుల పేర్కొన్నారు.

## వారు గాలికి వదిలేశారు... మనం గాడిలో పెడదాం

### ●వంశధార స్టేజ్ -2పై అసెంబ్లీలో నిమ్మల రామానాయుడు



పాలకొల్లు (చైతన్యరథం): శ్రీకాకుళం జిల్లా హిరమండలం గొట్టా గ్రామం వద్ద వంశధార నదిపై నిర్మించిన గొట్ట బ్యారేజ్ అనుబంధ కాలువల ఆధునికీకరణ పనులను గత వైసీపీ ప్రభుత్వం గాలికి వదిలేసిందని జల వనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు గురువారం నాడు అసెంబ్లీలో ధ్వజమెత్తారు. నరసన్నపేట, టెక్కలి, పలాస ఎమ్మెల్యేలు వంశధార స్టేజ్ 2 కింద ఎడమ కాలువ ఆయకట్టు భూములకు నీరందడం లేదని ఆందోళన చెందిన నేపథ్యంలో మంత్రి వారికి స్పష్టమైన వివరణ ఇచ్చారు. 1,48,235 ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఉద్దేశించిన ఈ బృహత్తర ప్రాజెక్టు ప్రాధాన్యత ప్రభుత్వానికి తెలుసునన్నారు. అందువల్లనే ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు 2018లో గొట్టా బ్యారేజ్ కాలువల ఆధునీకరణకు 676 కోట్ల రూపాయలతో అంచనాలు తయారు చేయించారని చెప్పారు. ప్రతిపాదన కార్యరూపం దాల్చే స్థాయిలో కొత్తగా వచ్చిన అరాచక వైకాపా ప్రభుత్వం గాలికి వదిలేసిందని మంత్రి విమర్శించారు. వంశధార స్టేజ్-2లో కుడికాలువ కొంతవరకు పర్వాలేదు. 48 ఏళ్ల కిందట నిర్మించిన ఎడమ కాలువ రాతి కట్టడాలు, షట్టర్లు పూర్తిగా దెబ్బ తినడంతో అనుకున్న స్థాయిలో ఆయకట్టు రైతులకు నీరు అందడం లేదు. 2481 క్యూసెక్కుల ప్రవాహ సామర్థ్యం ఉన్న ఎడమ కాలువ ద్వారా ప్రస్తుతం 1800-1900 క్యూసెక్కుల మాత్రమే ప్రవహిస్తున్నట్లు మంత్రి రామానాయుడు వివరించారు. దీనికి తోడు ఎడమ కాలువపై 24 లిఫ్టులు ఉండడం వల్ల వాటికి మరో 360 క్యూసెక్కుల నీరు వెళుతోంది. అందువల్లనే ఆయకట్టు భూములకు పూర్తిస్థాయిలో నీరందడం లేదన్నారు. ఆయకట్టు రైతుల అగచాట్లను, సమస్య తీవ్రతను ప్రభుత్వం గుర్తించింది. అందులో భాగంగానే వంశధార స్టేజ్-2 ఎడమ కాలువ పూడిక తీయడం, గట్లు పటిష్ట పరచడం, షట్టర్లు తదితర ఇతర నిర్మాణాలు ఆధునికరించటం వంటి పనులన్నిటికి ప్రతిపాదనలు తయారుచేసి ప్రభుత్వానికి నివేదిస్తామన్నారు. అత్యవసర ప్రాతిపదికన చేపట్టాల్సిందిగా కోరతామన్నారు. అలాగే గొట్టా బ్యారేజ్ ఆధునీకరణకు కూడా 16 కోట్లు వ్యయం కాగల ప్రతిపాదన ఇప్పటికే ప్రభుత్వానికి సమర్పించి పరిపాలనామోదం కోసం చూస్తున్నామని మంత్రి రామానాయుడు వివరించి చెప్పారు.

## ఆవిశ్వాస తీర్మాన నోటీసు అందజేత



నిడదవోలు (చైతన్యరథం): మున్సిపల్ వైసీపీ కౌన్సిలర్లు.. చైర్మన్ భూపతి ఆదినారాయణపై అవిశ్వాస తీర్మాన నోటీసును జిల్లా కలెక్టర్ ప్రశాంతికి గురువారం అందజేశారు. గత మున్సిపల్ ఎన్నికల్లో నిడదవోలు పట్టణంలోని 28 వార్డులకు గాను, 27 వార్డుల్లో వైసీపీ విజయం సాధించింది. ఒక్క వార్డులో మాత్రమే టీడీపీ విజయం సాధించింది. సాధారణ ఎన్నికల్లో రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో చైర్మన్ ఆదినారాయణతో పాటు, మరో ఎనిమిది మంది కౌన్సిలర్లు జనసేనలో చేరారు. దీనిపై వైసీపీ కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానం పెట్టారు. ఈ సందర్భంగా అవిశ్వాస నోటీసును వైసీపీ కౌన్సిలర్ కామిశెట్టి వెంకట సత్యనారాయణ ఆధ్వర్యంలో కలెక్టర్‌కు అందజేశారు.

## కోనసీమలో కావిళ్ల వైభవం



కోనసీమ (చైతన్యరథం): డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా మండపేట మండలం ద్వారపూడిలో కుమారస్వామివారి కావిళ్ల, కలశ ఉత్సవాన్ని బుధవారం వైభవంగా నిర్వహించారు. తమిళనాడు తరహాలో ఇక్కడ ప్రతి ఏటా ఉత్సవం నిర్వహించటం ఆనవాయితీ. దాదాపు 40 రోజులపాటు కుమారస్వామి మాలధారణ దీక్షను ఇక్కడి ప్రజలు చేపడతారు. గ్రామంలో ఉన్న స్వామివారి ఆలయం వద్ద దీక్ష తీసుకున్న స్వాములు కఠోర దీక్షతో పూజలు చేస్తుంటారు. 500 మంది మహిళలు కలశాలతో బయలుదేరుతారు. ఈ క్రమంలో జరిగిన కార్యక్రమానికి ద్వారపూడి పరిసర గ్రామాల ప్రజలు భారీగా తరలివచ్చారు. అనంతరం గ్రామంలోని సుబ్రహ్మణ్యస్వామి ఆలయంలో విశేషపూజలు, జలాభిషేకాలు నిర్వహించారు. స్వామిని టీడీపీ మండలాధ్యక్షుడు యరగతపు బాబ్జీ, బీజేపీ నేత కోనా సత్యనారాయణ, ప్రముఖులు దర్శించుకున్నారు.

## అమరావతి చిత్ర కళా వీధి పోస్టర్‌ను ఆవిష్కరించిన డిప్యూటీ సీఎం




రాజమహేంద్రవరం (చైతన్యరథం): రాష్ట్ర ప్రభుత్వం ఏప్రిల్లో నిర్వహించనున్న 'అమరావతి చిత్ర కళా వీధి' కార్యక్రమం పోస్టర్ను డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, రాష్ట్ర సాంస్కృతిక కమిషన్ చైర్పర్సన్ తేజస్వితో కలిసి ఆవిష్కరించారు. ఏప్రిల్ 4 నుంచి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జరగనున్న 'అమరావతి చిత్ర కళా వీధి' కార్యక్రమం ద్వారా దేశ వ్యాప్తంగా ఉన్న కళాకారులను ఒకే వేదికపైకి తీసుకొచ్చి, వారి కళా ఖండాలను ప్రదర్శించి విక్రయించడానికి, కళాభిమానులతో ప్రత్యక్ష సంభాషణకు అవకాశం కల్పిస్తుందని పవన్ కల్యాణ్ అన్నారు. ఈ ప్రత్యేకమైన కళా ఉత్సవం ఆంధ్రప్రదేశ్లోని కళాకారులందరికీ ఒక ఆశాకిరణంలా నిలుస్తుందని చెప్పారు. ప్రతిభావంతులైన కళాకారులు వారి కళను ప్రదర్శించడానికి, గుర్తింపు పొందడానికి ఒక వేదికను అందించడంలో తన పూర్తి మద్దతు ఉంటుందని హామీ ఇచ్చారు. సంవత్సరాలుగా విస్మరించబడిన కళాకారులను ప్రోత్సహించడానికి మంత్రి కందుల దుర్గేష్ నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ సాంస్కృతిక కమిషన్ కట్టుబడి ఉందని తేజస్వి తెలిపారు.

## హత్యకు గురైంది ట్రాన్స్‌జెండర్...కొనసాగుతున్న విచారణ



కశింకోట (చైతన్యరథం): మండలం బయ్యవరం సమీపంలోని అండర్ బ్రిడ్జి వద్ద ఉదయం రక్తపు మరకలతో ఒక మూట ఉన్నట్టు సమాచారం అందడంతో పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. క్లూస్ టీమ్‌ను రప్పించి మూటను విప్పగా... మహిళ నడుము నుంచి కింద భాగం, కుడి చెయ్యి మాత్రమే ఉన్నాయి. దీంతో హత్యకు గురైన వ్యక్తి ఎవరో గుర్తు పట్టలేకపోయారు. జిల్లా ఇన్‌ఛార్జ్ ఎస్పీ వకుల్ జిందాల్ కూడా సంఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. ఈ కేసు దర్యాప్తు కోసం ఎనిమిది ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేశారు. మహిళను హత్య చేసి కొన్ని శరీర భాగాలను బయ్యవరం వద్ద పడేశారనే వార్త ఈ ప్రాంతంలో దావానలంలా వ్యాపించింది. ఈ నేపథ్యంలో మునగపాక మండలం నాగులాపల్లిలో ట్రాన్స్‌జెండర్ ఒకరు అద్దెకు వుంటున్న ఇంటి వెలుపల రక్తపు మరకలు చూసిన స్థానికులు ఈ విషయాన్ని పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం అర్ధరాత్రి క్లూస్ టీమ్ అక్కడకు వెళ్లి ఇంటిలో పరిశీలించారు. ఇంటిలో ఎవరెరు వుంటున్నారో పోలీసులు ఆరా తీశారు. బన్నీ అనే 30 ఏళ్ల యువకుడు, ట్రాన్స్‌జెండర్ కలిసి వుంటున్నట్టు గుర్తించారు. అర్ధరాత్రి దాటిన తరువాత అతడిని అదుపులోకి తీసుకున్నారు. ట్రాన్స్‌జెండర్ పేరు మైపాలి దిలీప్ శివశంకర్ అలియాస్ దీపు (40) అని అతను చెప్పినట్టు సమాచారం. అతను ఇచ్చిన సమాచారంతో కశింకోట సీఐ స్వామినాయుడు, పోలీసు సిబ్బంది బుధవారం ఉదయం అనకాపల్లి పట్టణ శివారులోని జగలమదుం కూడలి సమీపంలో జాతీయ రహదారికి వెళ్లే మార్గంలో ఒక బాక్సును స్వాధీనం చేసుకున్నారు. దానిని తెరిచిచూడగా తల, ఎడమ చేయి కనిపించాయి. వీటిని ప్యాక్ చేసి ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి పంపారు. అనంతరం నిందితుడిని వెంటబెట్టుకుని కశింకోట మండలం తాళ్లపాలెం మామిడివాక గెడ్డ వద్దకు వెళ్లారు. అక్కడ మిగిలిన శరీర భాగాలు (మొండెం) వున్న సంచిను అతను చూపించాడు. పంచనామా అనంతరం ఎన్టీఆర్ వైద్యాలయం మార్చురీకి తరలించారు. దీంతో బయ్యవరం వద్ద మంగళవారం లభించిన శరీర భాగాలు మహిళవిగా భావించిన పోలీసులు, బుధవారం మిగిలిన శరీర భాగాలు కూడా లభ్యమైన తరువాత హత్యకు గురైంది ట్రాన్స్‌జెండర్‌గా నిర్ధారించారు.

## అరాచక శక్తులను అణచివేస్తాం : బుద్దా వెంకన్న



విజయవాడ (చైతన్యరథం): మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిపై తెలుగుదేశం పార్టీ సీనియర్ నేత బుద్దా వెంకన్న తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం తాగడం ఆరోగ్యానికి హానికరం అని గతంలో ఉండేదని.. కానీ జగన్ జమానాలో మద్యం తాగితే ప్రాణాలు కోల్పోయేలా చేశారని విమర్శలు చేశారు. వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి, పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్ రెడ్డిలు కొత్త స్కాం చేశారని ఆరోపణలు చేశారు. మద్యం అడ్డు పెట్టుకుని వైసీపీ నేతలు వేలమంది ప్రాణాలు తీశారని విమర్శించారు. ఈ అమ్మకాల ద్వారా వచ్చిన సొమ్మును వాటాలుగా ముగ్గురూ పంచుకున్నారని ఆరోపించారు. ముందస్తు బెయిల్ కోసం మిథున్‌రెడ్డి కోర్టులో పిటిషన్ వేశారని అన్నారు. చిత్రగుప్తడు కూడా రాయలేని అన్నిపాపాలను పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, మిథున్‌రెడ్డి చేశారని మండిపడ్డారు. మద్యం, మైనింగ్‌లో భారీగా దోచుకున్నారని ఆరోపించారు. ఈ డబ్బుతోనే కుప్పంలో చంద్రబాబును గెలవనివ్వమని రంకెలు వేశారని ధ్వజమెత్తారు. మీపాపపు సొమ్ము వద్దని కుప్పం ప్రజలు చంద్రబాబుకే పట్టం కట్టారని అన్నారు. పుంగనూరులో చంద్రబాబును అడ్డుకుని దాడి చేయించారని మండిపడ్డారు. నేషనల్ క్రైం రికార్డు ప్రకారం ఏపీలో 2019-24 మధ్య మద్యం ద్వారా వందశాతం మరణాలు సంభవించాయని రిపోర్డు ఇచ్చిందని అన్నారు. ఈ పాపం పెద్దిరెడ్డి కుటుంబానిది కాదా అని ప్రశ్నించారు. ఇన్ని ప్రాణాలు తీసి మధ్యంతర బెయిల్ కోసం కోర్టుకు వెళ్లారని చెప్పారు. పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చేయని స్కాం లేదు, చేయని కబ్జా లేదన్నారు. కోర్టులో ప్రభుత్వ న్యాయవాదులు గట్టిగా వాదనలు వినిపించి బెయిల్ రాకుండా చూడాలని బుద్దా వెంకన్నకోరారు. అరాచక శక్తులను అణచివేస్తాం.. 'చంద్రబాబు మీలాగా దౌర్జన్యాలు చేయిస్తే... మీరు అసలు రోడ్ల మీదకు వచ్చేవారా. అరాచక శక్తులను చంద్రబాబు అణచి వేస్తారు.. మీలాగా దాడులు చేయించరు. పుంగనూరులో మా టీడీపీ కార్యకర్తను చంపించారు... చంద్రబాబు, లోకేష్ మిమ్మలను వదలరు. ఈహత్య కేసులో దోషులను కఠినంగా శిక్షించాలి. గత జగన్ ప్రభుత్వంలో వేలకోట్ల రూపాయల మద్యం కుంభకోణం చేశారు. పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి దమ్ముంటే నేను అడిగే వాటికి సమాధానం చెప్పాలి. ప్రజల సొమ్ము దోచుకున్న మీరు ప్రజా నాయకుడిని ఓడిస్తా అంటూ ప్రగల్భాలు పలుకుతారా. వైసీపీ నేతలతో సోషల్ మీడియాలో చంద్రబాబు, లోకేష్‌లపై నీచంగా ట్రోల్ చేయిస్తారా. అవినీతి సొమ్ముతో అడ్డగోలుగా వ్యవహరిస్తే... మీ అందరి సంగతి తేలుస్తాం. అయ్యప్ప సాక్షిగా మద్యం కుంభకోణంలో మా పాత్ర లేదని చెప్పే ధైర్యం ఉందా. ప్రతి సంవత్సరం మాల వేయడం కాదు...అవినీతి చేయకుండా.. నిజాయితీగా బతకాలి. ఈ మద్యం కుంభకోణం గురించి ప్రజలకు కూడా వాస్తవాలు తెలియాలి. రేపు తండ్రీ, కొడుకులు అరెస్టు అయితే కూటమి ప్రభుత్వంపై గగ్గోలు పెడతారు. తప్పు చేసిన ఎవరైనా జైలుకు వెళ్లక తప్పదు. మేము తప్పు చేయకపోయినా మా వాళ్లను అక్రమంగా అరెస్టు చేశారు. నా ఛాలెంజ్‌కు పెద్దిరెడ్డి కుటుంబం స్పందించాలి. మద్యం అవినీతి సొమ్ముతో మాకు సంబంధం లేదని ప్రమాణం చేయాలి. ప్రమాణం చేయకుండా చంద్రబాబు, కూటమి ప్రభుత్వంపై నిందలు వేస్తే చూస్తూ ఊరుకోం. ప్రజలు కూడా వారి అవినీతి గురించి తెలుసుకుని, వారు చేసే తప్పుడు ప్రచారాలను తిప్పి కొట్టండి' అని బుద్దా వెంకన్న కోరారు.

# సాంస్కృతిక కార్యక్రమాల్లో ఆకట్టుకున్న చీఫ్ విప్ జీవీ స్కిట్




వినుకొండ (చైతన్యరథం): మూడు రోజుల పాటు జరిగిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాల చివరి రోజు స్కిట్‌తో అందర్నీ కడుపుబ్బా నవ్వించారు చీఫ్ విప్, వినుకొండ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు. రాజకీయ నాయకులు ఎదుర్కొనే చిత్రమైన పరిస్థితులను కళ్లకు కట్టారు చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు బృందం. సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ఇదీసంగతి అంటూ హాస్య నాటకం ప్రదర్శించిన చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు, ఎమ్మెల్యేలు విష్ణుకుమార్ రాజు, జూలకంటి బ్రహ్మానందరెడ్డి, కూన రవికుమార్, పాశం సునీల్, అరవిందబాబు, వర్ల కుమార్ రాజా అందర్నీ ఆకట్టుకున్నారు. చీఫ్‌విప్ జీవీ, ఎమ్మెల్యే విష్ణుకుమర్‌రాజు మధ్య సన్నివేశాలతో మొదలైన నాటకం ఆద్యంతం నవ్విస్తునే సాగింది. నాయకులు ఎదుర్కొనే క్లిష్ట పరిస్థితుల్ని సున్నితంగా చెప్పింది. విష్ణుకుమార్‌రాజు తమ ఊరి అల్లుడిని మొదలు పెట్టమంటూ అడిగే విన్నపంతోనే అందరిలో నవ్వులు మొదలయ్యాయి. తమ కుమారుడికి సీట్ కావాలని... సబ్జెక్టులు పాస్ కాకపోయినా తెలుగుదేశం నేతలకు చెందిన నారాయణ, భాష్యం, విజ్ఞాన్, ఎన్నారై కళాశాలల్లో సీటు ఇప్పించాలంటూ అమాయక పాత్రలో మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి ఆ నవ్వులు మరింత పెంచారు. పాస్ కాకపోతే ఏమిటి కనీసం ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌లో సీటు ఇప్పించలేని ఎమ్మెల్యే ఎందుకంటూ హాస్యం పండించారు జూలకంటి. అలాంటి పరిస్థితుల్లో ఏ ఎమ్మెల్యే అయినా సీటు ఇప్పించలేడంటూ కార్యకర్త కోరిక తీర్చలేక.. సమాధానపరచలేక సహనం పాటించే పాత్రలో జీవీ ఆంజనేయులు జీవించారు. అనంతరం పది పాస్ కాని విద్యార్థికి హెడ్‌మాస్టర్ లేదా ఎస్పీ ఉద్యోగం కావాలంటు ఎమ్మెల్యే అరవింద్‌బాబు, బాలయ్య బాబు, పవన్ కళ్యాణ్‌తో సినిమా డైరెక్షన్ ఇప్పించాలంటూ కార్యకర్త పాత్ర పోషించిన కూనరవి నవ్వులు పూయించారు. ఈ స్కిట్ సాగుతున్నంతసేపు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ సహా ప్రతిఒక్కరూ నవ్వుతునే కనిపించారు.

# ఉగాది నుండి గుంటూరులో ఫుడ్ కోర్టు




గుంటూరు (చైతన్యరథం): వచ్చే ఉగాది నుండి నగరంలో ఫుడ్ కోర్టు ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురానున్నామని పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. గురువారం 42వ డివిజన్‌లో రూ.98.90 లక్షలతో సీసీ రోడ్డు, డ్రెయిన్ల నిర్మాణానికి ఎమ్మెల్యేలు గళ్ళా మాధవి, భాష్యం ప్రవీణ్, కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్‌లు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గళ్ళ మాధవి మాట్లాడుతూ... నియోజకవర్గంలో నిత్యం అభివృద్ధి పనులతో ముందుకు వెళ్తున్నామని, 42వ డివిజన్‌లో తాము అధికారంలోకి వచ్చిన తర్వాత రూ.50 లక్షలతో సీసీ డ్రెయిన్ల నిర్మాణం పూర్తి చేసుకోవడం జరిగింది. నేడు రూ.98.90/- లక్షలతో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి శంకుస్థాపన చేసుకోవడం జరిగింది. గత వైసీపీ ప్రభుత్వం కక్ష పూరితంగా ఆపివేసిన విద్యానగర్ 3వ లైన్ రోడ్డు నిర్మాణం పనులు త్వరలో ప్రారంభం కానున్నాయి. మార్చి ఒకటో తేదీ నుండి ప్లాస్టిక్‌పై నిషేధం విధించబోతున్నామని, ఖాళీ స్థలాల విషయంలో జంగిల్ క్లియరెన్స్ పనులు ప్రారభిస్తున్నట్లు మాధవి తెలిపారు.



ఎమ్మెల్యే భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ... ఎన్డీయే కూటమి అధికారంలోకి వచ్చిన నాటి నుండి గళ్ళా మాధవి నాయకత్వంలో గుంటూరు పశ్చిమ నియోజకవర్గం అభివృద్ధిలో వేగంగా అడుగులు పడుతున్నాయని అన్నారు. నిత్యం గళ్ళా మాధవి అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించి రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థకు శ్రీకారం చుట్టారని అన్నారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం ఇలాగే అభివృద్ధిలో ముందుకు వెళ్లాలని ఆకాంక్షిస్తున్నట్లు భాష్యం ప్రవీణ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కార్పొరేటర్ వేములపల్లి శ్రీరామ్ ప్రసాద్, కనపర్తి శ్రీనివాసరావు, కసుకుర్తి హనుమంతరావు, లంకా ఉదయ్ పాల్గొన్నారు.

# నాగార్జునసాగర్ కుడికాలువపై ఉన్న లిఫ్ట్ వ్యవస్థను తక్షణమే పునరుద్ధరించాలి: ప్రత్తిపాటి



అమరావతి (చైతన్యరథం): ఆయకట్టు స్థిరీకరణ పెంపునకు టీడీపీ ప్రభుత్వం కృషి చేస్తే, గత ప్రభుత్వం ఉన్న ఆయకట్టుని నిర్వీర్యం చేసిందని మాజీమంత్రి, చిలకలూరిపేట నియోజకవర్గ టీడీపీ ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు వ్యాఖ్యానించారు. గోదావరి - కృష్ణా, పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా రూ.6వేల కోట్లతో నిర్మించ తలపెట్టిన హరిశ్చంద్రాపురం-నకరికల్లు ప్రాజెక్టుకి టెండర్లు పిలిచి, కాంట్రాక్టర్లను కూడా ఖరారు చేయడం జరిగిందని, ఆ ప్రాజెక్ట్‌లో గత ప్రభుత్వం రూపాయి పనిచేయలేదని మండిపడ్డారు. ఆ ప్రాజెక్టును ఎప్పుడు పూర్తిచేస్తారో చెప్పాలని నీటిపారుదల శాఖా మంత్రి నిమ్మల రామానాయుడుని సభాముఖంగా ఎమ్మెల్యే ప్రత్తిపాట పుల్లారావు ప్రశ్నించారు. గురువారం ప్రశ్నోత్తరాల సమయంలో ఆయకట్టు స్థిరీకరణ... కాలువల ఆధునికీకరణ అంశంపై జరిగిన స్వల్పకాలిక చర్చలో ఆయన సాగు, తాగునీటి సమస్యలపై ప్రభుత్వ వివరణ కోరారు. హరిశ్చంద్రాపురం-నకరికల్లు ప్రాజెక్ట్ ను బనకచర్ల ప్రాజెక్ట్‌లో విలీనంచేసే ఆలోచన ఏమైనా ఉందా లేక టెండర్లు ఖరారైనందున నిర్మాణం పూర్తిచేస్తారా అని ప్రత్తిపాటి ప్రశ్నించారు. నాగార్జున సాగర్ కుడికాలువ పరిధిలో గత ప్రభుత్వం ఎలాంటి అభివృద్ధి పనులు చేయలేదన్న ప్రత్తిపాటి, సాగర్ కాలువ నిర్వహణకు కూడా సరిగా నిధులు కేటాయించలేదన్నారు. నాచు, గుర్రపుడెక్క, పూడికతో నిండిపోయిన కాలువ నుంచి నీటిసరఫరా సక్రమంగా జరగక దిగువ ప్రాంత రైతులు సాగు కోసం తీవ్ర ఇబ్బందులు పడ్డారని చెప్పారు. వైసీపీ హయాంలో కాలువపై ఉన్న షట్టర్లకు కనీసం గ్రీజు కూడా పెట్టలేదని ప్రత్తిపాటి తెలిపారు. ఆ కాలువపై ఆధారపడిన 200లకు పైగా లిఫ్ట్ ఇరిగేషన్లను జగన్ ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందన్నారు. ఆ లిఫ్ట్ ఇరిగేషన్లకు అవసరమైన మరమ్మతులు చేయించి, రైతులను.. గ్రామాలను ఆదుకోవాలని, కూటమి ప్రభుత్వం ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకుంటుందో చెప్పాలని జలవనరుల శాఖమంత్రి నిమ్మల రామానాయుడిని కోరారు.

# ఎంటీఎంసీలో నాలుగో రోజు స్వచ్ఛ-మంగళగిరి

**●5,6 వార్డులు, తాడేపల్లి 3వ వార్డులో స్వచ్ఛ-మంగళగిరి నిర్వహించిన అధికారులు, నాయకులు**



మంగళగిరి (చైతన్యరథం): స్వచ్ఛ-మంగళగిరి కార్యక్రమంలో భాగంగా గురువారం మంగళగిరి పట్టణం 5,6 వార్డులోని ఇందిరానగర్, మూడు పంపుల సెంటర్, స్కూలు రోడ్డు, తాడేపల్లి పట్టణం 3వ వార్డులో అధికారులు, కూటమి నాయకులు ప్రత్యేక పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వార్డులలో ఇంటింటికి వెళ్లి పారుశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోడ్డుపక్కన వేసిన చెత్తను, డంపింగ్‌లను తొలగించి శుభ్రం చేశారు. స్వచ్ఛ మంగళగిరి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంటీఎంసీ కమిషనర్ యస్.అలీం బాషా మాట్లాడుతూ... ప్రజలు అందరూ కూడా మున్సిపల్ కార్పొరేషన్ సిబ్బందికి సహకరించాలని కోరారు. చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకూడదని ఇళ్ల వద్దకే వచ్చే వాహనాల్లో వేయాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ కె శకుంతల, డిప్యూటి కమిషనర్ శ్రీకాంత్, సెక్రటరీ యం దివ్యకుమారి, అసిస్టెంట్ ఇంజనీరు కుమారి, టౌన్ ప్లానింగ్ సూపర్వైజర్ సుస్మిత, శానిటరి ఇన్స్పెక్టర్ ఆర్ ఇందు, ప్రత్యేక పర్యావరణ కార్యదర్శి ఉదయ్ సింగ్, నియోజకవర్గ పరిశీలకులు ముమ్మిడి సత్యనారాయణ, తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు,రాష్ట్ర పద్మశాలి డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కందుల నాగార్జున, మంగళగిరి పట్టణ తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షులు గోవాడ దుర్గారావు, పట్టణ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, కృష్ణ బలిజి సాధికార సమితి సభ్యుడు అన్నం నాగబాబు, వాకా మాధవరావు, భోగి కోటేశ్వరరావు, గొర్ల వేణుగోపాల్ రెడ్డి , తాడిబోయిన భాస్కర్, మండవ గోపాలరావు, ఇట్టా పేంచలయ్య, ఇట్టా భాస్కర్, వనమా సుధాకర్, సీమాన్, శివ,దాసరి చిన్ని, అడపా నరేష్, నక్కా నవీన్ రాజా, హరే రామ్, జి అంకలరావు, అన్నం కుసుమ, కాటాబత్తుని నిర్మల, పత్రపల్లి కృష్ణవేణి, నాగుల మేరీ, షేక్ సలాం, యార్లగడ్డ ప్రసాద్, సంకూర్ సతీష్, కోగంటి వెంకటేశ్వరావు, కొయ్యగూర మల్లేశ్వరరావు, బి సాంబిరెడ్డి, బేజ్జం రామకృష్ణ, కంతేటి విజయ్, అద్దంకి మురళి, కంతేటి విజయ్, వినుకొండ నవీన్, జొన్నాదుల రామాంజనేయులు, నైనాల లావణ్య, నల్లగొర్ల శివరామకృష్ణ, గోసాల రాఘవ, పేరం ఏడుకొండలు, వీరబాబు, మరియు నగరపాలక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, స్కిల్‌డెవలప్ సెంటర్ ఏర్పాటు చేయాలి



జి.కొండూరు (చైతన్యరథం): గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పి.హెచ్.సి) అవసరం చాలా ఉందని, పి.హెచ్.సిను అత్యవసరం ఏర్పాటు చేయించాలని, అలాగే మహిళలు కుట్టు మిషన్, అల్లికలు నేర్చుకునేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ కావాలని చెరువు మాధవరం గ్రామ ప్రజలు పంచాయతీ ఛాంపియన్స్‌కు తెలిపారు. విజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని) సారథ్యంలో నిర్వహిస్తున్న కేశినేని ఫౌండేషన్ ద్వారా హైదరాబాద్‌లోని హైదరాబాద్ జాతీయ గ్రామీణ అభివృద్ధి పంచాయతీ రాజ్ సంస్థలో (ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్)లో వికసిత్ పంచాయతీలో భాగంగా సమగ్ర గ్రామాభివృద్ధికి శిక్షణ పొందిన పంచాయతీ ఛాంపియన్స్ ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ సొంగా సంజయ్ వర్మ ఆధ్వర్యంలో గురువారం మైలవరం నియోజకవర్గం జి.కొండూరు మండలంలోని చెరువు మాధవరం గ్రామ ప్రజలు, డ్వాక్రా సంఘాల మహిళలతో సమావేశం నిర్వహించారు. గ్రామ పార్టీ అధ్యక్షులు గూగులోతు శ్రీనివాసరావు అధ్యక్షత వహించిన ఈ సమావేశంలో పంచాయతీ ఛాంపియన్స్ గ్రామ ప్రజలకు సమగ్ర గ్రామాభివృద్ధిపై అవగాహన కల్పించటంతో పాటు, గ్రామ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మహిళలు తమకి కుట్టుమిషన్, అల్లికలకు శిక్షణ ఇచ్చే స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ కావాలని కోరారు. కోతుల వల్ల పడుతున్న ఇబ్బందులు తెలిపి వాటి బెడద నుంచి రక్షించాలని అడిగారు. ఇక గ్రామంలో రోడ్లు, సైడ్ డ్రైన్స్ లేక పడుతున్న ఇబ్బందులను కూడా తెలియజేశారు. ఎన్టీఆర్ జిల్లా ఎన్.ఐ.ఆర్.డి.పి.ఆర్. ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ సొంగా సంజయ్ వర్మ నియోజకవర్గంలో ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ కుటుంబానికి ఒక వ్యాపారవేత్తను తయారు చేసేందుకు చేస్తున్న కృషిని వివరించారు. ఎమ్.ఎస్.ఎమ్.ఈ లోన్లపై చిన్న, మధ్య తరహా పరిశ్రమలు చేపట్టాల్సిన విధి విధానాలను వాటి పై ప్రభుత్వం, బ్యాంకులు కలిగిస్తున్న ప్రోత్సాహకాలను తద్వారా చేకూరే సబ్సిడీలను పూర్తిగా వివరించారు.ఈ రుణాల్లో ముఖ్యంగా మహిళలకు 45% సబ్సిడీ వుంటుందని వివరించారు.

# సీఎం పర్యటనకు భారీ బందోబస్తు



తెనాలి (చైతన్యరథ:): సీఎం చంద్రబాబు పర్యటనకు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. రేణిగుంట విమానాశ్రయంలో పారా మిలటరీ బలగాలు మోహరించాయి. తిరుమల, తిరుపతిలో అడుగడుగునా తనిఖీలు చేస్తున్నారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుమలకు వెళ్లే అన్ని మార్గాల్లోని కల్వర్టులు, బ్రిడ్జిలు, రోడ్లకు ఇరువైపులా బాంబు స్క్వాడ్లు తనిఖీలు చేస్తుండగా.. రోడ్డు డిగ్గింగ్ పార్టీలు అనుమానిత ప్రాంతాల్లో రోడ్లు తవ్వి పరిశీలిస్తున్నాయి. ఇక, గరుడ సర్కిల్ నుంచి తిరుమల ఘాట్ రోడ్లలో రిజర్వు బలగాలు తనిఖీలు చేస్తున్నాయి. ఎస్టీఎఫ్ బలగాలు శేషాచలం అడవుల్లో కూంబింగ్ చేపట్టాయి. తిరుపతి, తిరుమలలో తనిఖీలు చేసిన పోలీసులు ఇప్పటికే దాదాపు 40 మంది అనుమానితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు తెలిసింది.

అనంతపురం డీఐజీ షిమోషీ నేతృత్వంలో ఇద్దరు ఎస్పీల పర్యవేక్షణలో ముగ్గురు అదనపు ఎస్పీలు, 25 మంది డీఎస్పీలు, 56 మంది సీఐలు, 100 మంది ఎస్ఐలు, ఏఎసఐలు, హెడ్ కానిస్టేబుళ్ళతో పాటు మరో 200 మంది పోలీసులు, రిజర్వు బలగాలు, డాగ్, బాంబు స్క్వాడ్‌లు, హెూంగార్డులు, మహిళా పోలీసులు, ఎస్టీఎఫ్ బలగాలు సీఎం బందోబస్తు విధుల్లో పాల్గొంటున్నారు. మరోవైపు విమానాశ్రయం నుంచి తిరుమల వరకు భద్రతా సిబ్బంది సీఎం కాన్వాయ్ ట్రయల్‌రన్ నిర్వహించారు. సీఎం బస చేసే పద్మావతి అతిథిగృహం, కాన్వాయ్ ప్రయాణించే మార్గాలు, శ్రీవారి ఆలయం, అన్నప్రసాద భవనాల్లో ఇప్పటికే కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు. తిరుమల పోలీసు, విజిలెన్స్ అధికారులతో కలిసి ఎస్పీ హర్షవర్ధన్‌రాజు శ్రీవారి ఆలయం, పరిసర ప్రాంతాలు, ఘాట్‌రోడ్లలో తనిఖీలు నిర్వహించి భద్రతాపరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు చేశారు. సీఎం పర్యటన నేపథ్యంలో టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి అన్నప్రసాద భవనంలో తనిఖీలు నిర్వహించారు. కాగా, సీఎంతో పాటు మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఆనం రామనారాయణరెడ్డి తిరుమలకు రానున్నారు.

# తిరుమలలో భక్తుల మధ్య ఘర్షణ... గాయాలు

తిరుమల (చైతన్యరథం): శ్రీవారి దర్శనం కోసం వచ్చిన భక్తుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. అది కాస్తా ఘర్షణగా మారింది. చివరకు ఓ భక్తుడు ఆసుపత్రి పాలయ్యాడు.ఇంతకీ ఏం జరిగిందంటే..గురువారం తిరుమలలోని సీఆర్వో కార్యాలయం వద్ద భక్తులు క్యూ లైన్‌లో నిల్చనున్నారు. ఆ క్రమంలో తన కుమారుడిని తోసిన వ్యక్తిపై అతడి తండ్రి ఆగ్రహం వ్యక్తం చేశాడు. ఆ క్రమంలో ఇద్దరి మధ్య మాట మాట పెరిగింది. దీంతో ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. అదే సమయంలో క్యూ లైన్‌లోని వ్యక్తులంతా కలిసి... యువకుడి తండ్రిని కొట్టారు. దీంతో ఆగ్రహించిన ఆ తండ్రి.. తన చేతిలోని గాజు బాటిల్‌తో ఎదుటి వ్యక్తిపై దాడి చేశాడు. తలకు తీవ్ర గాయం కావడంతో.. తోటి భక్తుడు ఆసుపత్రి పాలయ్యారు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న టీటీడీ విజిలెన్స్ అధికారులు సంఘటన స్థలానికి చేరుకున్నారు. ఆ క్రమంలో జరిగిన ఘటనపై ఆరా తీశారు. అనంతరం గాజు సీసాతో దాడి చేసిన వ్యక్తిని వారు అదుపులోకి తీసుకున్నారు. అయితే దాడి కారణంగా ఆసుపత్రిలో చేరిన వ్యక్తికి ప్రాణాపాయం లేదని.. అయితే బలమైన గాయం అయితే అతడికి తగిలిందని వైద్యులు వెల్లడించారు.



# సొంతింటి కలనెరవేర్చడమే సీఎం లక్ష్యం : భూపేష్




కడప (చైతన్యరథం): సొంతింటి కళను ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు నెరవేర్చుతాడని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి పేర్కొన్నారు. జమ్మలమడుగు టీడీపీ కార్యాలయంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ కులాలకు సంబంధించిన కార్యకర్తలు, ఇతరులతో ఆయన సమావేశమై మాట్లాడారు. 2019-24 సంవత్సరంలో ఇళ్లకు సంబంధించి ఎస్టీలకు రూ.75 వేలు, ఎస్సీ, బీసీ కులాలకు రూ.50 వేలు, ప్రభుత్వం ఆర్థికసాయం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఐఎల్ చిన్న, పొన్నతోట మల్లి, బిర్రు సంతోష్ పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

జమ్మలమడుగు పట్టణంలోని వెంకటేశ్వర కాలనీలో పేద ముస్లింలకు టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. రంజాన్ మాసం పురష్కరించుకుని స్థానిక నాయకులు వెంకటేశ్వర కాలనీకి చెందిన కొమెర్ల జాకీర్ ఏర్పాటు చేసిన రంజాన్ తోఫాను భూపేశ్‌రెడ్డి హాజరై అందజేశారు. కార్యక్రమంలో కమిషనర్ వెంకటరామిరెడ్డి, కొమెర్ల మోదీన్, షేక్షావలిలున్నారు.

# చెంచుల అభివృద్ధి కూటమి ప్రభుత్వంతోనే సాధ్యం



ఎర్రగొండపాలెం (చైతన్యరథం): రాష్ట్రంలో చెంచుల జీవితాల గురించి కాని వారి అభివృద్ధి గురించి గత పాలకులు పట్టించుకున్న పాపాన పోలేదని అందుకే వారిని ప్రజలు 11 సీట్లకే పరిమితం చేశారని ఎర్రగొండపాలెం టీడీపీ ఇన్‌ఛార్జ్ గూడూరి ఎరిక్షన్‌బాబు అన్నారు. స్థానిక డా.బిఆర్ అంబేద్కర్ ఆడిటోరియంలో సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ శ్రీశైలం వారి ఆధ్వర్యంలో పౌష్టికాహార కిట్లు ఎలక్ట్రికల్ టూల్ కిట్లు పంపిణీ చేశారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలల కాలంలో గిరిజను ల కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నార ని అన్నారు. ఇటీవల దోర్నాల మండలంలో రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చొరవతో పలు గూడేలలో సౌలార్ విద్యుత్ సదుపాయం ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. అలాగే వారి కోసం ప్రత్యేకంగా గృహనిర్మాణాలు అమలు చేశామన్నారు. అలాగే చెంచుల ఆరోగ్య దృష్ట్యా రక్తహీనత పెంచేందుకు రెండు వేల రూపాయల విలువైన నిత్యావసర సరుకుల కిట్లు పంపిణీ చేస్తునట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ప్రతి చెంచు నివాసాన్ని పలకరించి వారి కష్టాలను తెలుసుకున్నట్లు తెలిపారు. వారి అభివృద్ధి కోసం తను శ్రీశైలం ఐటీడీఏ ద్వారా అభివృద్ధి చేస్తామన్నారు. అందుకు ప్రాజెక్టు అధికారి వెంకట శివప్రసాద్ కూడ పూర్తి సహకారం అందిస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చెంచు కుటుంబాలకు పౌష్టికాహార కిట్లను పంపిణీ చేశారు. అలాగే రైతులకు ఎంతో ఉపయోగపడే ఎలక్ట్రికల్ టూల్ కిట్లు పంపిణి చేశారు. ఆయా కార్యక్రమాలలో ఐటీడీఏ పీవోతో పాటు ఏపివో సురేష్, పీహెచ్‌వో ధనుంజయ్, ఎస్‌వో జి నాయక్, ఏపీటీవో మధుసుదన్ రావు, జూనియర్ అసిస్టెంట్ రాజ సిబ్బంది, టీడీపీ నాయకులు చేకూరి సుబ్బారావు, షేక్ మస్తాన్‌వలి, చెవుల ఆంజయ్య, శ్రీశైలపతి నాయుడు, వేగినాటి శ్రీను, సత్యనారాయణ గౌడ్, ఎంసీహెచ్ మంత్రునాయక్, వెంగళ్‌రెడ్డి, పయ్యా వుల ప్రసాద్, భూమిరెడ్డి సుబ్బారెడ్డి, బి వెంకటేశ్వర నాయక్, చెవుల భయన్న, మూగన్న, అచ్యూతరావు, మల్లికార్జునాచారి, కూటమి నాయకులు, చెంచు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ప్రమాదవశాత్తు చెరువులో పడి చిన్నారుల మృతి

- విచారం వ్యక్తం చేసిన దర్శి ఇన్‌ఛార్జ్ గొట్టిపాటి లక్ష్మీ



దర్శి (చైతన్యరథం): కురిచేడు చెరువు ప్రమాదంలో ఇద్దరు పిల్లల మృతి చాలా బాధాకరమని గొట్టిపాటి లక్ష్మీ అని అన్నారు. కురిచేడులోని మాల పల్లెలో గురువారం చెరువులో ప్రమాదవశాత్తు ఇద్దరు చిన్నారులు మృతి చెందడం పట్ల గొట్టిపాటి లక్ష్మీ విచారం వ్యక్తం చేశారు. మృతి చెందిన బత్తుల అభిషేక్ పది సంవత్సరాలు బత్తుల పాల్ అనే ఇద్దరు అన్నదమ్ములు చెరువులో ప్రమాదవశాత్తు జరిగిన ఈ ఘటనలో మృతి చెందడం తనకెంతో బాధ కలిగిస్తుందన్నారు. కుటుంబానికి మన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ప్రభుత్వపరంగా వారికి సహాయం అందిస్తామని లక్ష్మీ తెలిపారు. ఈ సందర్భంగా లక్ష్మీ మాట్లాడుతూ... చెరువులు కాలవలులో పిల్లలు ఈతకు సరదాకు నీళ్లలో దిగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అనేకసార్లు ప్రజలకు తెలియజేశాం ప్రజలు చైతన్యంతో ఇలాంటి ఘటనలు పునరావతం కాకుండా చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. పోలీస్ రెవిన్యూ ఫైర్ శాఖలు కూడా ప్రజల్లో చైతన్య కలిగించి గ్రామాలలో చెరువులు వద్ద హెచ్చరిక బోర్డులను ఉంచాలని కూడా ఆదేశించినట్లు లక్ష్మీ తెలిపారు. జరిగిన సంఘటనపై సంబంధిత పోలీస్ శాఖతో మాట్లాడినట్లు లక్ష్మీ చెప్పారు ఏదేమైనా తల్లిదండ్రులు గ్రామ పెద్దలు వీఆర్వోలు స్వచ్ఛంద సంస్థలు ఇలాంటి ప్రమాదాలు జరగకుండా ప్రజల్లో చైతన్యం కలిగించాలని  ప్రజలకు సూచించారు.

# మండే ఎండలు ఓ వైపు... మధ్యలో వర్షాలు... ఏపీలో విచిత్రమైన వాతావరణ పరిస్థితులు

ఏపీలో ఎండలు మండపోనున్నాయి. మధ్యలో వర్షాలు కూడా దంచి కొట్టనున్నాయి. అవును.. ఈ మేరకు వాతావరణ శాఖ వెదర్ అప్ డేట్ ఇచ్చింది. ఇంతకీ ఏ జిల్లాల్లో ఎండలు దంచికొట్టనున్నాయి..? ఏ జిల్లాల్లో వర్షాలు పడే చాన్స్ ఉంది.. శుక్రవారం (2-03-25) శ్రీకాకుళం జిల్లా-12, విజయనగరం-16, పార్వతీపురం మన్యం-13, అల్లూరి సీతారామరాజు-1, కాకినాడ-2, తూర్పుగోదావరి-5 మండలాల్లో(49) వడగాల్పులు ప్రభావం చూపే అవకాశం ఉన్నట్లు విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు. శనివారం అల్లూరి జిల్లా చింతూరు, మన్యం జిల్లా సీతంపేట మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 29 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందన్నారు. వైఎస్సార్ కడప, నంద్యాల , ప్రకాశం , పల్నాడు జిల్లాల్లో ఆదివారం చెదురుమదురుగా పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తారు వర్షాలు పడే అవకాశం ఉందని, ఉరుములతో కూడిన వర్షం పడేప్పుడు చెట్ల క్రింద నిలబడరాదని సూచించారు. గురువారం నంద్యాల జిల్లా దొర్నిపాడులో 40.3, వైఎస్సార్ జిల్లా ఒంటిమిట్టలో 40.2, కర్నూలు జిల్లా లద్దగిరిలో 40.1, అన్నమయ్య జిల్లా గాదెల మరియు విజయనగరంలో 40 అధిక ఉష్ణోగ్రతలు నమోదైనట్లు, అలాగే 30 మండలాల్లో వడగాల్పులు వీచాయని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ రోణంకి కూర్మనాథ్ తెలిపారు.. ఎండదెబ్బ తగలకుండా టోపీ, గొడుగు, టవల్, కాటన్ దుస్తులు ఉపయోగించాలి. వృద్ధులు, గర్భిణీలు, బాలింతలు తగిన జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలి. చెవుల్లోకి వేడిగాలి వెళ్ళకుండా జాగ్రత్త పడాలి. ప్రజలు వీలైనంతవరకు ఇంట్లోనే ఉండాలి, డీహైడ్రేట్ కాకుండా ఉండటానికి (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్), ఇంట్లో తయారుచేసిన పానీయాలైన లస్సీ, నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు మొదలైనవి త్రాగాలని సూచించారు.



జోన్-5
(నంద్యాల, కర్నూలు, హిందూపూరం, అనంతపురం, కడప)
చైతన్యరథం

# నిరుద్యోగ సమస్య నిర్మూలనకు మంత్రి మండిపల్లి ప్రత్యేక చర్యలు

రాయచోటి (చైతన్యరథం): అన్నమయ్య జిల్లాలో నిరుద్యోగ సమస్య నిర్మూలనకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని రాష్ట్ర రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాం ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.... ఈనెల 21వ తేదీ శుక్రవారం శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాల, మాసాపేట నందు మెగా జాబ్ మేళా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళాకు 30 ప్రముఖ కంపెనీలు అభ్యర్థుల చెంతకు రావడం జరుగుతుందని జిల్లాలోని నిరుద్యోగ యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉద్యోగ అవకాశాలు పొందాలన్నారు. జాబ్ మేళాలో 2000 ఉద్యోగాలు భర్తీ చేయడం జరుగుతుందన్నారు. ఉదయం 9 గంటలకు అభ్యర్థులు శ్రీ సాయి ఇంజనీరింగ్ కళాశాలకు చేరుకొని తమ వివరాలు నమోదు చేసుకోవాలన్నారు. మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో అభ్యర్థులకు భోజన వసతి జిల్లా నలుమూలల నుంచి ఎన్నో వ్యయ ప్రయాసాల కోర్చి అభ్యర్థులు జాబ్ మేళాకు హాజరు కావడం జరుగుతుందని అభ్యర్థుల సమస్యలను దృష్టిలో ఉంచుకొని మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మండిపల్లి నాగిరెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో భోజన వసతి కల్పించడం జరుగుతుంది.

# ఉమ్మడి కడప జిల్లా అభివృద్ధికి సహకరించండి



అమరావతి (చైతన్యరథం): ఉమ్మడి కడప జిల్లా అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించి అభివృద్ధికి సహకరించాలని జిల్లా టీడీపీ అధ్యక్షులు ఆర్. శ్రీనివాస్‌రెడ్డి కోరారు. వైఎస్‌ఆర్ జిల్లాగా ఉన్న పేరును వైఎస్‌ఆర్ కడప జిల్లాగా మార్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. మే నెలలో అంగరంగ వైభవంగా నిర్వహించనున్న మహానాడు కార్యక్రమం ఏర్పాట్లపై ప్రత్యేకంగా చర్చించారు. గురువారం అమరావతిలోని అసెంబ్లీలో సీఎం చంద్రబాబునాయుడును ఉమ్మడి కడప జిల్లా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిశారు.

# కడప జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నికకు నోటిఫికేషన్

కడప (చైతన్యరథం): జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నికకు ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈనెల 27వ తేదీన ఉమ్మడి కడప జిల్లా.. జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎంపికకు ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించనున్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఛైర్మన్ ఎన్నికకు నామినేషన్లు స్వీకరించనున్నారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంటకు నామినేషన్ల పరిశీలన తర్వాత జాబితాలో ఉన్న అభ్యర్థుల వివరాలను ప్రకటిస్తారు. మధ్యాహ్నం జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నిక నిర్వహిస్తారు. గత జిల్లా పరిషత్ ఛైర్మన్‌గా పనిచేసిన ఆకే పాటి అమర్నాథ్ రెడ్డి రాజీనామాతో ఖాళీ అయిన జిల్లా పరిషత్ ఛైర్మన్ పదవికి నోటిఫికేషన్ విడుదల చేసింది ఎన్నికల సంఘం. ప్రస్తుతం ఉమ్మడి కడప జిల్లాలో 50 జడ్పీటీసీ స్థానాలకు 49 వైసీపీ, ఒకస్థానం టీడీపీ దక్కించుకున్నాయి. ఎన్నికల అనంతరం ఇద్దరు జడ్పీటీసీలు మృతి చెందారు. 48 జడ్పీటీసీలకు గాను ఒక జడ్పీటీసీ తన పదవికి రాజీనామా చేశారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు 6 మంది జడ్పీటీసీలు టీడీపీలో చేరగా, ఒకరు బీజేపీలో చేరారు. దీంతో కూటమికి 8 మంది జడ్పీటీసీల బలం చేకూరింది. ప్రస్తుతం కడప జిల్లా పరిషత్‌లో వైసీపీకి 39 మంది జడ్పీటీసీల బలం ఉంది. అయితే వైసీపీ నుంచి బ్రహ్మంగారి మఠం మండల జడ్పీటీసీ రామ గోవిందరెడ్డిని అభ్యర్థిగా వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రకటించారు. దాదాపు వైసీపీకి జడ్పీ పీఠం కైవసం అయ్యే అవకాశం ఉంది. అయితే వైసీపీలోని అసంతృప్తి జడ్పీటీసీలను తమ వైపు తిప్పుకోవడానికి టీడీపీ ముమ్మర ప్రయత్నాలు చేస్తోంది. దీంతో కడప జిల్లా పరిషత్ ఛైర్మన్ ఎన్నిక ఉత్కంఠ భరితంగా మారింది.



# ఆ 11 వేల మంది ఉద్యోగస్తులందరికి పాత పెన్షన్ వర్తింపు చేయండి

**● అసెంబ్లీలో ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ స్కీమ్ సమస్యపై గట్టిగా ప్రస్తావించిన ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి**



పుట్టపర్తి (చైతన్యరథం): 2003లో ప్రభుత్వ నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగ అవకాశాలు పొందిన ప్రభుత్వ ఉద్యోగులందరికీ పాత పెన్సన్ వర్తింపు చేయాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. విజయవాడ అమరావతి లో 15 వ రోజు గురువారం జరిగిన శాసనసభ సమావేశాల సందర్భంగా జీరో అవర్ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి ఈ విషయాన్ని ప్రస్తావించారు. డిసెంబర్ 18 ,2003 ఉద్యోగ నియామకాల భర్తీకి నోటిఫ్టికేషన్ ఇచ్చిందని వీరికి 2005లో అప్పటి ప్రభుత్వం ఉద్యోగాలు ఇచ్చినట్లు తెలిపారు. దీనివల్ల ఆ నోటిఫికేషన్‌తో ఉద్యోగాలు పొందిన వారు ఓపిఎస్, ఎన్‌పిఎస్‌కు అర్హులని ప్రభుత్వం దృష్టికి తీసుకొచ్చారు. ఈ ఉద్యోగ నియామకాలకు ముందుగానే నోటిఫికేషన్ రావడం వల్ల గతంలో ఉన్న ఈ స్కీములకు వీరు అర్హులవుతారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 22 డిసెంబర్ 2003లో న్యూ పెన్షన్ స్కీమును నోటిఫై చేసిందని తెలిపారు. 22 డిసెంబర్ 2003 ముందు ఉద్యోగ నియామకానికి నోటిఫికేషన్ ద్వారా ఆ తర్వాత ఉద్యోగాలు పొందిన ఉద్యోగులకు పాత పెన్షన్ వర్తించేలా చూడాలని కోరారు. ఇందులో అప్పోట్లో డీఎస్సి ద్వారా ఉపాధ్యాయుల తోపాటు పోలీస్ కానిస్టేబుల్స్, గ్రూప్ 2 ద్వారా భర్తీ చేసిన ఇతర ప్రభుత్వ ఉద్యోగులు మొత్తం 11వేల మంది ఉద్యోగులందరూ పాత పెన్షన్ పొందడానికి వారు అర్హులన్నారు. ఆ తర్వాత కేంద్రం ప్రభుత్వం అన్ని రాష్ట్రాలను అభిప్రాయాలను కోరుతూ 03 మార్చి 2023 నోటిఫికేషన్ ఇచ్చిందని తెలిపారు. అయితే ఎన్‌పిఎస్ స్కీం కంటే ముందుగానే ఏపీలో 2003లో ఈ ఉద్యోగ నియామక భర్తీకి నోటిఫికేషన్ రావడం వల్ల ఆంధ్రప్రదేశ్లో ఉన్న 11,000 మంది పెన్షన్ స్కీమ్ అందక వీరికి తీవ్ర అన్యాయం జరిగిందని అన్నారు. అయితే 18-12-2003లో నోటిఫికేషన్ ఇవ్వడం వల్ల అప్పట్లో అమలు చేసిన పాత పెన్షన్ విధానాన్ని వీరికి వర్తింపు చేసి అమలు చేయాలని ఈ ఉద్యోగులు కోరుతున్నారని తెలిపారు. ఈ సమస్యపై చాలా రాష్ట్రాలు కేంద్రాన్ని కోరడంతో కేంద్రం ప్రభుత్వం 2023లో అన్ని రాష్ట్రాలను ఈ విషయంపై వివరణ కోరింది. 2004కు ముందు నియామక నోటిఫికేషన్ ద్వారా ఉద్యోగాలు పొందిన వారికి ఎన్.పీ.ఎస్ స్కీం వర్తింపు ప్రకటన ఇవ్వడం వల్ల చాలా రాష్ట్రాలు మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఝార్ఖండ్, కర్ణాటక, గోవా లాంటి రాష్ట్రాలు అప్పట్లో నియకాలు పొందిన ఐపీఎస్‌లకు కూడా ఈ స్కీమును వర్తింపజేసిన విషయాన్ని ఎమ్మెల్యే అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గత వైసీపీ ప్రభుత్వం ఉద్యోగులను పూర్తిగా విస్మరించిందని అన్నారు. మన కూటమి ప్రభుత్వంలో వీరందరికీ న్యాయం చేస్తే ఎల్లకాలం మన ముఖ్యమంత్రిని ప్రభుత్వాన్ని తప్పకుండా గుర్తుపెట్టుకుంటారని అన్నారు. ఇతర రాష్ట్రాల్లో అమలు చేసిన విధంగానే ఆంధ్రప్రదేశ్‌లో 2003లో ఉద్యోగ నియామక నోటిఫికేషన్ ద్వారా 2005లో ప్రభుత్వ నియామకాలు పొందిన 11 వేల ఉద్యోగులందరికీ పాత పెన్షన్ స్కీము వర్తింపజేయాలని పల్లె సింధూర రెడ్డి కోరారు.

# ప్రజా సమస్యలే లక్ష్యంగా పనిచేస్తున్నాం

**●నియోజకవర్గ పర్యటనలో పులివర్తి సుధారెడ్డి వెల్లడి**



చంద్రగిరి (చైతన్యరథం): చంద్రగిరి నియోజకవర్గ పాకాల మండలం దామలచెరువు పంచాయతీలోని దామలచెరువు సాదిమహల్, భారతంమిట్ట, బాలిరెడ్డిగారిపల్లిలో ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి మహిళలతో ముఖాముఖి కార్యక్రమం చేపట్టారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ... పంచాయతీలలో ఉన్న ఇతర సమస్యలను తెలుసుకుంటూ... మహిళల పొదుపు సంఘాలతో వారు ఏ విధంగా ఆర్థికంగా ఎదగవచ్చునో అవగాహనక కల్పించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు నెరవేర్చడమే కాక పంచాయతీలో ఉన్న సమస్యలను పరిష్కరించే దిశగా పనిచేస్తున్నామని అన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ ముందు చూపుతో మహిళలకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పించాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తుందన్నారు. నియోజకవర్గంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సహకారంతో మహిళలకు స్వయం ఉపాధి కింద ఉచిత టైలరింగ్, స్కిల్ డెవలప్మెంట్ ఆధ్వర్యంలో ఉద్యోగాలు, మరెన్నో గొప్ప అవకాశాలు కల్పిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు ఎక్కువగా ఉన్నారని, అసెంబ్లీలో మామిడి రైతులకు సంబంధించి టన్నుకు గిట్టుబాట ధరతో పాటు రీసెర్చ్ ఇన్స్టిట్యూట్ ఏర్పాటు చేయాలని వ్యవసాయ శాఖ మంత్రిని నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని కోరారని తెలిపారు. దామల చెరువు పంచాయతీలో సుమారు 3 కోటి 50 లక్షల 85 వేల రూపాయితో అభివృద్ధి పనులు చేపట్టం జరిగిందన్నారు. స్వయం ఉపాధి అవకాశాలు కల్పించిన రాష్ట్ర ప్రభుత్వంలో భాగంగా "నెట్ వర్క్ ఆన్ లైన్ డిజిటల్ కామర్స్" ద్వారా తిను బండారాలును ఆన్ లైన్ ద్వారా విక్రయాలు చేస్తున్న దాముల చెరువు పంచాయతీకి చెందిన భువనేశ్వరిని పులివర్తి సుధా రెడ్డి అభినందించారు. అనంతరం పంచాయతీలలోని సమస్యలు డ్రైనేజ్, వాటర్ ట్యాంక్, ఇంటి పట్టాలు, సీసీ రోడ్ ఇతర సమస్యలను స్థానికులు పులివర్తి సుధారెడ్డి దృష్టికి తీసుకొచ్చారని వాటిని వీలైనంత త్వరగా పూర్తి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం నాయకులు, కార్యకర్తలు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

# అనంతపురం రాజకీయాలపై సీఎం చంద్రబాబుతో చర్చించిన ఎమ్మెల్యే దగ్గుపాటి



అమరావతి /అనంతపురం (చైతన్యరథం): అనంతపురం అర్బన్ నియోజకవర్గంలో నెలకొన్న తాజా రాజకీయ పరిస్థితులపై ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుతో చర్చించారు. అసెంబ్లీ సమావేశాలు ముగింపు నేపథ్యంలో సీఎం ఛాంబర్ కు వెళ్లి ఆయన్ని కలిశారు. అర్బన్ నియోజకవర్గంలో నెలకొన్న రాజకీయ పరిస్థితుల గురించి చర్చించారు. మొత్తం పరిస్థితుల గురించి ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరా తీశారు. అన్ని అంశాలను ఎమ్మెల్యే దగ్గుపాటి కూలంకశంగా వివరించారు. మరోవైపు నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. ముఖ్యంగా డంపింగ్ యార్డ్ తరలింపు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మరువ వంక ప్రొటెక్షన్ వాల్ తోపాటు పలు అభివృద్ధి కార్యక్రమాల గురించి చర్చించారు. అన్ని అంశాల మీద ముఖ్యమంత్రి చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. ఈ బడ్జెట్‌లోనే నిధులు కేటాయించేలా చూస్తామని హామీ ఇచ్చినట్టు ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు.

# సర్వేలను త్వరగా పూర్తి చేయాలి

సర్వేలను వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగులు, సిబ్బంది త్వరగా పూర్తి చేయాలని అడిషనల్ డీఎంహెచవో సత్యవతి ఆదేశించారు. గోనెగండ్లలోని ప్రభుత్వ ఆసుపత్రిని తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ప్రతిరోజు ఓపి ఎంత ఉంటుంది. రెగ్యులర్ రోగులు ఎంత మంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. అలాగే ఆసుపత్రిలోని గదులను, స్టోర్‌రూమ్, వార్డు గదులను, ఇతర గదులను ఆమె పరిశీలించారు. రోగులకు వైద్యం సకాలంలో అందే విధంగా చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. ఏమైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో స్థానిక వైద్యులు రంగా రవళి, రజిని, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# రక్తమోడిన దండకారణ్యం

- రెండు చోట్ల భారీ ఎన్‌కౌంటర్లు
- 30 మంది మావోలు హతం
- ఒక జవాను కూడా మృతి



బీజాపూర్: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యం మరోసారి కాల్పులతో దద్దరిల్లింది. ఒకేరోజు బీజాపూర్, కాంకెర్ జిల్లాల్లో జరిగిన వేర్వేరు ఎన్ కౌంటర్లలో 30 మంది మావోయిస్టులు మృతి చెందారు. ఈ ఎదురుకాల్పుల్లో ఓ జవాను కూడా అమరుడైనట్లు అధికారులు వెల్లడించారు. బీజాపూర్ – దంతెవాడ జిల్లాల సరిహద్దులో ఉన్న గంగలూరు పరిధి అండ్రీ అడవుల్లో నక్సల్స్ నక్కినట్లు నిఘా వర్గాలకు సమాచారం రావటంతో జిల్లాల నుంచి సంయుక్త బలగాలు గురువారం ఉదయం నుంచి అడవుల్లో కూంబింగ్ ఆపరేషన్ చేపట్టాయి. ఈ క్రమంలో ఇరువర్గాల మధ్య భారీ ఎదురుకాల్పులు జరిగాయి. ఈ కాల్పుల్లో మావోయిస్టులకు భారీ నష్టం వాటిల్లినట్లు అధికారులు వెల్లడించారు. ఈ ప్రాంతంలో 26 మంది మావోయిస్టుల మృతదేహాలను గుర్తించినట్లు తెలిపారు. ఘటనాస్థలంలో పెద్ద ఎత్తున ఆయుధాలు, పేలుడు పదార్థాలను స్వాధీనం చేసుకున్నారు. బీజాపూర్ ఎదురుకాల్పుల్లో ఓ జవాను కూడా ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు వెల్లడించారు.

ఇక, ఇదే సమయంలో కాంకెర్ జిల్లాలోనూ ఎన్‌కౌంటర్ చోటుచేసుకుంది. ఇక్కడ డీఆర్‌జీ, బీఎస్‌ఎఫ్ సిబ్బంది సంయుక్తంగా జరిపిన ఆపరేషన్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. రెండు జిల్లాల్లోనూ ప్రస్తుతం యాంటీ–నక్సల్స్ ఆపరేషన్ కొనసాగుతోంది. మరణాల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**మూడు నెలల్లో 90 మంది..**

ఛత్తీస్ గఢ్‌లో ఈ ఏడాది చోటుచేసుకున్న ఎన్‌కౌంటర్లలో ఇది రెండో అతిపెద్ద ఘటన. ఫిబ్రవరి 9న బీజాపూర్ జిల్లాలో జరిగిన ఎదురుకాల్పుల్లో 31 మంది మావోలు హతమమైన సంగతి తెలిసిందే. మొత్తంగా ఈ ఏడాది ఇప్పటివరకు చోటుచేసుకున్న పలు ఎన్ కౌంటర్లలో దాదాపు 90 మంది నక్సల్స్ మృతి చెందినట్లు అంచనా

## ఇది మరో భారీ విజయం

- 2026 నాటికి మావోయిస్టు రహితంగా దేశం
- కేంద్ర హోంమంత్రి అమిత్ షా



ఢిల్లీ: ఛత్తీస్‌గఢ్ లో జరిగిన కాల్పుల్లో భారీ సంఖ్యలో మావోయిస్టులు మృతి చెందిన ఘటనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పందించారు. భారత్‌ను నక్సల్ రహిత దేశంగా మార్చేందుకు చేపట్టిన ఆపరేషన్లో ఇది మరో పెద్ద విజయంగా అభివర్ణించారు. ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం నక్సలైట్ల పట్ల కఠిన వైఖరి అవలంబిస్తోందని స్పష్టం చేశారు. అన్ని విధాలుగా సౌకర్యాలు కల్పిస్తున్నా కొందరు నక్సలైట్లు లొంగిపోవడం లేదు. అలాంటి వారి పట్ల మోదీ సర్కార్ కఠిన వైఖరి అవలంబిస్తోంది. ఈనాడు మన సైనికులు 'నక్సల్ ముక్త్ భారత్ అభియాన్' దిశలో మరో పెద్ద విజయాన్ని సాధించారు. ఛత్తీస్‌గఢ్ లోని బీజాపూర్, కాంకెర్లలో మన భద్రతా దళాలు నిర్వహించిన రెండు వేర్వేరు ఆపరేషన్లలో 30 మంది నక్సలైట్లు హతమయ్యారు. 2026 మార్చి 31 నాటికి దేశం మావోయిస్టు రహితంగా మారుతుందని 'ఎక్స్' (ట్విటర్) వేదికగా అమిత్ షా పేర్కొన్నారు.

## నినాదాలు రాసిన టీ షర్టులతో సభకు రావొద్దు

- డీఎంకే ఎంపీలపై లోక్‌సభ స్పీకర్ అసహనం



ఢిల్లీ: ప్రతిపక్ష పార్టీ ఎంపీలు నినాదాలు రాసి ఉన్న టీ షర్టులు ధరించి సభకు రావడంపై లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా గురువారం అసహనం వ్యక్తం చేశారు. ఇది పార్లమెంటరీ నియమాలకు విరుద్ధమని వ్యాఖ్యానించారు. అనంతరం సభను మధ్యాహ్నానికి వాయిదా వేశారు. నిబంధనలు, విధానాలతో సభలు నిర్వహిస్తారు. సభ్యులు హుందాగా వ్యవహరించి సభ గౌరవాన్ని కాపాడుకోవాలి. కానీ, ప్రతిపక్ష పార్టీలోని కొంతమంది ఎంపీలు నిబంధనలు పాటించడం లేదు. ఇది సరైనది కాదు. ఎంత పెద్ద నాయకుడైనా సభ గౌరవాన్ని తగ్గించే ఇలాంటి దుస్తులు ధరించడం ఆమోదయోగ్యం కాదని ఓం బిర్లా పేర్కొన్నారు. ఈ సందర్భంగా సభను మధ్యాహ్నానికి వాయిదా వేస్తూ.. సభ్యులు బయటకు వెళ్లి దుస్తులు మార్చుకుని రావాలని సూచించారు.

నియోజకవర్గాల పునర్విభజనపై కేంద్రంలోని బీజేపీ, తమిళనాడులోని డీఎంకేల మధ్య వివాదం కొనసాగుతున్న సంగతి తెలిసిందే. ఈక్రమంలో గురువారం డీఎంకే సభ్యులు నినాదాలు రాసి ఉన్న టీషర్టులు ధరించి పార్లమెంటుకు వచ్చారు. 'పునర్విభజన న్యాయబద్ధంగా జరగాలి. తమిళనాడు పోరాడుతుంది. తమిళనాడు గెలుస్తుంది' అనే నినాదాలు టీ షర్టులపై రాసి ఉన్నాయి. అంతకు ముందు ఈ అంశంపై పార్లమెంటు వెలుపల నిరసనలు తెలిపారు. లోక్‌సభలోనూ ఇదే అంశాన్ని లేవనెత్తేందుకు ప్రయత్నించారు.

## ఆదిత్య థాక్రేపై కేసు నమోదు చేయండి

- ముంబయి హైకోర్టులో దిశా సాలియన్ తండ్రి పిటిషన్



ముంబయి: శివసేన (యూబీటీ) నేత ఆదిత్య థాక్రేపై కేసు నమోదు చేయాలంటూ బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ మాజీ మేనేజర్ దిశా సాలియన్ తండ్రి సతీశ్ సాలియన్ ముంబయి హైకోర్టును ఆశ్రయించారు. ఆదిత్య థాక్రేకు వ్యతిరేకంగా ఆయన న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేయటం మహారాష్ట్రలో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సతీశ్ సాలియన్ తన పిటిషన్లో ఆదిత్య థాక్రేపై లైంగిక ఆరోపణలు చేశారు.

ఐదేళ్ల క్రితం బాలీవుడ్ నటుడు సుశాంత్ సింగ్ రాజ్‌పుత్ ఆత్మహత్య చేసుకున్న సంగతి తెలిసిందే. రాజ్‌పుత్ మరణానికి వారం రోజుల ముందు అతడి మాజీ మేనేజర్ దిశా సాలియన్ అనుమానాస్పద పరిస్థితుల్లో మరణించారు. 2020 జూన్ 8న ముంబయిలోని ఓ భవనంపై నుంచి దూకి ఆమె ఆత్మహత్య చేసుకున్నారు. దిశా చనిపోయిన రోజుల వ్యవధిలోనే నటుడు సుశాంత్ తన ఫ్లాట్లో శవమై కనిపించారు. ఈ కేసు రాష్ట్ర రాజకీయాల్లో తీవ్ర దుమారం రేపింది. ఆ సమయంలో అధికారంలో ఉన్న ఉద్ధవ్ థాక్రే ప్రభుత్వం ఈ కేసును కప్పిపుచ్చేందుకు యత్నించిందనే ఆరోపణలు వచ్చాయి. హత్య, అత్యాచారంతో పాటు సుశాంత్ మృతితోనూ ముడిపెడుతూ ప్రచారం సాగింది.


నాడు సతీశ్ సాలియన్.. తన కుమార్తె మృతికి సంబంధించి ఎవరిపైనా అనుమానాలు వ్యక్తం చేయలేదు. ఉన్నట్టుండి ఆదిత్య థాక్రేతో పాటు మరికొందరిపై కేసు నమోదు చేయాలని కోరుతూ న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. జూన్ 8న తన కుమార్తె ఇంట్లో పార్టీ ఏర్పాటు చేసిందని.. దానికి ఆదిత్య థాక్రేతో పాటు అతని బాడీగార్డులు, నటులు సూరజ్ పంచోలి. డినో మోరియా, మరికొందరు హాజరయ్యారని తాజాగా వేసిన పిటిషన్లో పేర్కొన్నారు. తన కుమార్తె లైంగిక వేధింపులకు గురైందని... తన కుమార్తెపై సామూహిక అత్యాచారం జరిగిందని ఆరోపించారు. ఈ కేసుపై విచారణ జరిపించాలని కోరారు. దీంతో ఈ అంశం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది.

**అవన్నీ అబద్ధం: ఆదిత్య థాక్రే**

ఈ క్రమంలోనే ఆదిత్య థాక్రే స్పందిస్తూ తనపై వచ్చిన ఆరోపణలను కొట్టిపారేశారు. నాపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు. నా పరువు, ప్రతిష్టలకు భంగం కలిగించేందుకు ఐదేళ్లుగా ప్రయత్నం జరుగుతోంది. ఈ అంశం కోర్టు పరిధిలో ఉంటే.. నేను న్యాయస్థానంలోనే స్పందిస్తానని చెప్పారు.

## చట్ట విరుద్ధంగా కంటెంట్ నియంత్రణ

- కర్ణాటక హైకోర్టులో కేంద్రంపై ఎక్స్ పిటిషన్



బెంగళూరు: చట్టవిరుద్ధంగా కంటెంట్‌ను నియంత్రిస్తోందని, ఏకపక్షంగా సెన్సార్‌షిప్‌నకు పాల్పడుతోందని ఆరోపిస్తూ భారత ప్రభుత్వంపై ప్రపంచకుబేరుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని సోషల్ మీడియా 'ఎక్స్' దావా వేసింది. ఈ మేరకు కర్ణాటక హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. ఐటీ చట్టం, సహ్యోగ్ పోర్టల్ నిబంధనలు తమకున్న చట్టబద్ధమైన రక్షణలను ఉల్లంఘించేలా ఉన్నాయని, ఇది తమపై అనధికారికంగా సెన్సార్ చేయడం కిందికే వస్తుందని ఎక్స్ సంస్థ తన పిటిషన్‌లో పేర్కొంది. ప్రభుత్వం ఐటీ చట్టంలోని సెక్షన్ 79 (3) (బీ)ని దుర్వినియోగం చేస్తోందని ఆరోపించింది. ఐటీ చట్టం ప్రకారం.. బ్లాక్ చేసిన కంటెంట్‌ను తొలగించకపోతే, ఎక్స్ తన చట్టబద్ధమైన రక్షణ కోల్పోయే అవకాశం ఉంటుంది. అయితే ఈ సెక్షన్ కింద కంటెంట్ బ్లాక్ చేసే అధికారం ప్రభుత్వానికి లేదని ఎక్స్ వాదిస్తోంది. సెక్షన్ 69–ఏ ని పక్కదారి పట్టించడానికి అధికారులు ఈ నిబంధనను దుర్వినియోగం చేస్తున్నారని పేర్కొంది. దేశంలో అల్లర్లు, ఘర్షణలకు కారణమయ్యే పోస్టులు, పూర్తి వివరాలు లేకుండా సృష్టించిన ఖాతాలపై నియంత్రణ విధించేందుకు సెక్షన్ 69–ఏ ప్రకారం కేంద్రానికి అధికారం ఉంటుంది. అదే సమయంలో సెక్షన్ 79(3)(బీ) కింద స్పష్టమైన నిబంధనలు, తనిఖీలు లేకుండా సమాచారాన్ని బ్లాక్ చేయడానికి అధికారులు అనుమతి ఇస్తున్నారని, ఇది హద్దులు లేని సెన్సార్‌షిప్‌నకు దారితీస్తుందని తన పిటిషన్లో ఎక్స్ పేర్కొన్నట్లు జాతీయ మీడియా కథనాలు తెలిపాయి.

ఈ దావాపై కేంద్ర ప్రభుత్వవర్గాల నుంచి స్పందన వచ్చింది. ప్రభుత్వం చట్టాన్ని అనుసరించి ముందుకెళ్తుందని, సోషల్ మీడియా సంస్థలు నిబంధనలు పాటించాల్సిందేనని ఆ వర్గాలు స్పష్టం చేశాయి.

## తాగునీటిపై గొడవ, కాల్పులు

- కేంద్రమంత్రి మేనల్లుడి మృతి



భాగల్‌పూర్: ఇంట్లో తాగే నీటి విషయంలో మొదలైన చిన్న గొడవ పెద్దదిగా మారి ఒకరి హత్యకు దారి తీసింది. కేంద్ర మంత్రి నిత్యానందరాయ్ కుటుంబంలో ఈ విషాదం చోటుచేసుకుంది. ఆయన ఇద్దరు మేనల్లుళ్ల మధ్య జరిగిన ఘర్షణలో ఒకరు మృతి చెందారు. మరొకరు తీవ్రంగా గాయపడ్డారు. బీహార్‌లోని భాగల్‌పూర్‌కు చెందిన జగత్‌పూర్ గ్రామంలోని వారి నివాసంలో గురువారం ఉదయం ఈ ఘటన చోటుచేసుకుందని జాతీయ మీడియా కథనాలు పేర్కొన్నాయి. తాగునీటి విషయమై ఇరువురి మధ్య వివాదం చెలరేగి, అదికాస్తా ఒకరి హత్యకు దారితీసిందని తెలిపాయి. దీనిపై పోలీస్ ఉన్నతాధికారి ఒకరు మాట్లాడుతూ.. జగత్‌పూర్ గ్రామంలో ఇద్దరు సోదరుల మధ్య కాల్పులు చోటుచేసుకున్నాయని మాకు సమాచారం అందింది. వెంటనే పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అప్పటికే వారిలో ఒకరు మృతి చెందగా.. మరొకరికి గాయాలయ్యాయి. వారి గొడవను ఆపేందుకు మధ్యలో వారి తల్లి వచ్చినట్లు తెలుస్తోంది. ఆమెకు కూడా బుల్లెట్ గాయం అయింది. ఆమె పరిస్థితి విషమంగా ఉందని వెల్లడించారు. కేంద్ర మంత్రి నిత్యానందరాయ్‌కు బావ అయిన రఘునందన్ యాదవ్‌కు ఇద్దరు కుమారులు. వారు జైజిత్ యాదవ్, విశ్వజిత్ యాదవ్. గురువారం వారింట్లో పనిచేసే సహాయకుడు వడ్డిస్తున్న సమయంలో తన చేతిని నీళ్లు తెస్తున్న గ్లాసులో ముంచడమే ఈ గొడవకు కారణమని తెలుస్తోంది. ఆ గొడవ పెరిగి ఇద్దరు కాల్పులు మొదలెట్టారు. ఈ కాల్పుల్లో విశ్వజిత్ ప్రాణాలు కోల్పోయాడు. ఈ అన్నదమ్ముల మధ్య చాలా కాలం నుంచీ సంబంధాలు సరిగా లేవని సమాచారం.

# వారెంతంటే.. మేమూ అంతే!

## భారత్ టారిఫ్‌లు తగ్గిస్తుందనే భావిస్తున్నా: ట్రంప్

భారత్ విధించే టారిఫ్‌ల తగ్గింపు విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వరం మారింది. న్యూఢిల్లీ సుంకాలను తగ్గించే అవకాశం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఆశాభావం వ్యక్తంచేశారు. తాజాగా ఆయన బ్రీట్‌బాట్ న్యూస్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ వ్యాఖ్యలు చేశారు. గతంలో ఓ సందర్భంలో ఆయన మాట్లాడుతూ భారత్ పన్నులు తగ్గించేందుకు అంగీకరించిందని.. అదంతా తన ఘనతే అని చెప్పుకొచ్చారు. తాజాగా ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "భారత్ టారిఫ్‌లను గణనీయంగా తగ్గించే అవకాశం ఉన్నట్టు నమ్ముతున్నాను. కానీ, ఏప్రిల్ 2నుంచి వారెంత విధిస్తే.. మేమూ అంతే విధిస్తాం" అని ట్రంప్ పేర్కొన్నారు. ఇటీవల కాలంలో ఆయన ఏప్రిల్ 2ను లిబరేషన్ డేగా అభివర్ణిస్తుండటం గమనార్హం.

వాణిజ్య యుద్ధాల నేపథ్యంలో ఇరుదేశాల మధ్య పన్నుల విధానంలో కీలక మార్పులు చోటుచేసుకొంటాయన్న అంచనాల నేపథ్యంలో ట్రంప్ వ్యాఖ్యలు వెలువడటం గమనార్హం. ఒకవేళ పన్నుల తగ్గింపు నిర్ణయం వెలువడితే అది భారత ఆర్థికవ్యవస్థపై, వాణిజ్య మిగులు, ఫైనాన్షియల్



మార్కెట్లపై ప్రభావం చూపించనుంది. ముఖ్యంగా వ్యవసాయోత్పత్తులు, ఆటోమొబైల్స్, ఎలక్ట్రానిక్స్, రంగాలు భారీ పోటీని ఎదుర్కోనున్నాయి.

దీంతోపాటు భారత ప్రభుత్వానికి పన్నులు ప్రధాన ఆదాయ వనరుగా ఉన్న విషయం తెలిసిందే. ట్రంప్ భారత్‌లో పన్నుల విధానాలపై తీవ్ర అసంతృప్తితో ఉన్న విషయం తెలిసిందే. గతంలో కూడా ఆయన మాట్లాడుతూ "భారత్ టారిఫ్ కింగ్" అని వ్యాఖ్యానించారు. అంతేకాదు.. భారత్–అమెరికా వాణిజ్య లోటు 100 బిలియన్ డాలర్లు ఉన్న విషయాన్ని కూడా ఆయన ఎత్తిచూపారు. మరోవైపు భారత విదేశాంగ మంత్రి జైశంకర్ మాత్రం ఇటీవల మాట్లాడుతూ.. "మీరు నమ్మినా, నమ్మకపోయినా.. సుంకాలు, ఆంక్షలు అనేవి వాస్తవ అంశాలు. దేశాలు వాటిని అమలు చేస్తున్నాయి. నిజానికి గత దశాబ్దాన్ని మీరు గమనించినట్లయితే.. సామర్థ్యమేదైనా గొప్ప ఆయుధీకరణను చూశాం. ఆర్థిక ప్రవాహం, ఇంధన సరఫరా, సాంకేతికత బదిలీ పెరగడం చూశాం. ఇదే ప్రపంచంలో జరుగుతున్న వాస్తవం. ఓ దేశం సమగ్ర జాతీయశక్తిగా ఎదిగే పోరాటానికి వ్యాపార, వాణిజ్య సంబంధాలు ముఖ్యమైన సహకారాన్ని అందిస్తాయి. అందుకే ఆ వ్యాపారం కోసం దేశాలు పోటీపడుతున్నాయి." అని వెల్లడించారు.

## యూఎస్ విద్యా శాఖ మూత?

### - ఆ దిశగా అడుగులేస్తున్న ట్రంప్




అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అధికారంలోకి వచ్చిన దగ్గరి నుంచీ ప్రభుత్వ వ్యయం తగ్గింపుపై దృష్టిపెట్టారు. అందులో భాగంగా విద్యాశాఖలో భారీగా ఉద్యోగాల కోతలు పెడుతోన్న ఆయన.. ప్రస్తుతం దానిని మూసివేసే దిశగా అడుగులు వేస్తున్నారు. ఆ దిశగా ఉత్తర్వులు జారీ చేసే అవకాశం ఉందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి. ఉదారవాద భావజాలంతో విద్యాశాఖ కలుషితమైందని ఆయన భావిస్తున్నట్టు పేర్కొన్నాయి. "విద్యాశాఖను మూసివేయడానికి, ఆ శాఖ అధికారాలను రాష్ట్రాలకు తిరిగి ఇవ్వడానికి అవసరమైన అన్ని చర్యలూ తీసుకోవాలి. అదే సమయంలో అమెరికా ప్రజలకు అందుతోన్న సేవల్లో అంతరాయం లేకుండా చూసుకోవాలి" అని విద్యాశాఖ మంత్రి లిండా మ్నెక్మాన్‌ను ఉద్దేశిస్తూ ఉన్న వైట్ హౌస్ ఫ్యాక్ట్‌షీట్‌ను అంతర్జాతీయ మీడియా కథనం పేర్కొంది. అయితే అమెరికా చట్టసభల ఆమోదం లేకుండా దానిని మూసివేయడం దాదాపు అసాధ్యమే. అమెరికా విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తెస్తానని అధ్యక్షుడు ట్రంప్ చెప్పిన విషయం తెలిసిందే. దానిలోభాగంగా ఆ శాఖలోని సిబ్బందిలో సగం మందిని తొలగించే ప్రయత్నాల్లో ఉన్నామని గతంలో ప్రభుత్వం తెలి పింది. విద్యాశాఖ మంత్రిగా లిండా మెక్మాన్ బాధ్యతలు స్వీకరించిన కొన్ని రోజుల్లోనే ఆ పని మొదలుపెట్టారు. "ట్రంప్ నాకు ఇచ్చిన ఆదే శాలు స్పష్టంగా ఉన్నాయి. విద్యాశాఖను మూసివేసేందుకు మేం కాంగ్రెస్ కలిసి పనిచేయాల్సి ఉంటుందని తెలుసు. కానీ ఇప్పుడు తీసుకున్న నిర్ణయం అవసరానికి మించి ఉన్నవారిపై కత్తెరవేయడం కిందికే వస్తుంది" అని లిండా ఇటీవల పేర్కొన్నారు. విద్యాశాఖను తొలగించి, దానిని రాష్ట్రాలకు అప్పగిస్తానని చెప్పారు. ట్రంప్ బాధ్యతలు స్వీకరించే నాటికి విద్యాశాఖలో 4,100 మంది ఉద్యోగులున్నారు. వారిలో 600 మంది స్వచ్ఛందంగా పదవీ విరమణ చేయడానికి ముందుకువచ్చారు.

## పశ్చిమాసియా.. మళ్లీ రణరంగం

### గాజాపై టెల్అవీవ్ వైమానిక దాడులు



ఇజ్రాయెల్–హమాస్‌ల మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో పశ్చిమాసియా మళ్లీ రణరంగంగా మారింది. ఇటీవల ఇజ్రాయెల్ జరిపిన భీకర దాడుల్లో 400మందికి పైగా ప్రాణాలు కోల్పోయిన సంగతి తెలిసిందే. తాజాగా టెల్అవీవ్ దళాలు మరోసారి వైమానిక దాడులతో విరుచుకుపడ్డాయి. ఈ దాడుల్లో అనేకమంది మృతి చెందినట్లు తెలుస్తోంది. గురువారం ఉదయం గాజాపై ఐడీఎఫ్ వైమానిక దాడులు చేసింది. ఈ దాడుల్లో దాదాపు 70మంది మృతి చెందినట్లు స్థానిక అధికారులు తెలిపారు. ఇందులో ఓ మహిళతో సహా అనేకమంది చిన్నారులున్నట్లు వెల్లడించారు. ఇక, ఇజ్రాయెల్ రక్షణమంత్రి కాట్జ్ గాజాకు తీవ్ర హెచ్చరికలు చేశారు. బందీలందరినీ తిరిగివ్వడానికి ఇదే చివరి అవకాశమని లేకుంటే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని పేర్కొన్నారు. మరోవైపు.. నెట్జారిమ్ నడవాలో కొంత భూభాగాన్ని టెల్అవీవ్ స్వాధీనం చేసుకుంది. ఇక్కడినుంచి పాలస్తీనావాసుల కదలికలను నియంత్రించే వెసులుబాటు దానికి దక్కింది. మంగళవారం గాజాపై ఇజ్రాయెల్ భీకర దాడులు చేసింది. ఈ దాడుల్లో 400 మందికి పైగా మృతిచెందగా.. అనేకమంది గాయపడ్డారు. మృతుల్లో చిన్నారులు, మహిళలే ఎక్కువమంది ఉన్నారు. ఇజ్రాయెల్– హమాస్ మధ్య తొలిదశ కాల్పుల విరమణ ఒప్పందం ముగిసిన సంగతి తెలిసిందే. ఈ ఒప్పందంలో మార్పులు చేయడానికి హమాస్ తిరస్కరించడంతోనే దాడులకు ఆదేశించానని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహు తెలిపారు. బందీలను విడుదల చేయడానికి హమాస్ పదేపదే నిరాకరిస్తోందని, యుద్ధ లక్ష్యాలను సాధించడానికి గాజాలోని హమాస్ స్థావరాలే లక్ష్యంగా ఐడీఎఫ్ దాడులు చేస్తోందని ఆయన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఇజ్రాయెల్ ఇప్పటినుంచి హమాస్‌కు వ్యతిరేకంగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. ఈ దాడులను హమాస్ తీవ్రంగా ఖండించింది. టెల్అవీవ్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి బందీల ప్రాణాలను ప్రమాదంలో పడేసిందని పేర్కొంది. ఇందుకు తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తోందని మిలిటెంట్ సంస్థ హెచ్చరించింది.

## 'గ్రామ్ యాత్ర'కు రూ.118 కోట్లు

### - రికార్డు సృష్టించిన ఎంఎఫ్ హుస్సేన్ పెయింటింగ్



ప్రముఖ భారతీయ చిత్రకారుడు ఎంఎఫ్ హుసేన్ గీసిన ఓ పెయింటింగ్ అరుదైన రికార్డు సృష్టించింది. ప్రముఖ వేలం సంస్థ క్రిస్ట్ న్యూయార్క్ తాజాగా నిర్వహించిన వేలంలో హుస్సేన్ గీసిన 'అన్‌టైటిల్డ్' (గ్రామ్ యాత్ర) కళాఖండం 13.8 మిలియన్ డాలర్ల (రూ 118 కోట్లు)కు అమ్ముడు పోయింది. దీంతో ఆధునిక భారత చరిత్రలో అత్యంత ఖరీదైన కళాకృతిగా ఇది రికార్డు సృష్టించింది. 'ప్రముఖ ఆర్టిస్ట్ అమృతా షెర్గిల్ 1937లో గీసిన 'ది స్టోరీ టెల్లర్' పెయింటింగ్‌ను 2023లో వేలం వేయగా రూ.61.8 కోట్ల ధర పలికింది. అత్యంత ఖరీదైన భారతీయ కళాకృతిగా ఇప్పటివరకు ఇదే కొనసాగగా.. తాజాగా ఎంఎఫ్ హుస్సేన్ పెయింటింగ్ దీనికంటే రెట్టింపు ధర పలకడం విశేషం. ఎంఎఫ్ హుస్సేన్ కుంచెనుంచి జాలువారిన 'గ్రామ్ యాత్ర' ఒకే కాన్వాస్ 13 రకాల చిత్రాలతో రూపుదిద్దుకొంది. ఈ అద్భుత కళాఖండం కొత్త రికార్డు సృష్టించడంలో భాగస్వామ్యమైనందుకు సంతోషంగా ఉందని వేలం సంస్థ క్రిస్టీ ప్రతినిధులు పేర్కొన్నారు.

### రెండేళ్ల బిడ్డ పక్కనేవున్నా

## మద్యంమత్తులో కారు డ్రైవింగ్

### - న్యూజెర్సీ మేయర్ అరెస్ట్



బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఓ మేయర్ విచక్షణారహితంగా వ్యవహరించారు. తన రెండేళ్ల బిడ్డ కారులో ఉన్నా పట్టించుకోకుండా. మద్యంమత్తులోనే డ్రైవింగ్ చేశారు. ఆ దృశ్యాలు వైరల్ కావడంతో చివరకు జైలు పాలయ్యారు. అంతర్జాతీయ మీడియా కథనాల ప్రకారం.. న్యూజెర్సీ మేయర్ గినాలాప్లాసా మద్యం మత్తులో వాహనం నడిపి అరెస్టయ్యారు. ఆమె మద్యం సేవించి, డే కేర్ సెంటర్‌నుంచి తన రెండేళ్ల కుమారుడిని ఇంటికి తీసుకొచ్చారు. ఆ సమయంలో ఆమె రోడ్డుపై నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేశారు. త్రుటిలో పెద్ద ప్రమాదాన్ని తప్పించుకున్నారు. ఈ దృశ్యాలన్నింటినీ ప్రత్యక్ష సాక్షి ఒకరు తన కెమెరాలో బంధించారు. ఆ క్లిప్‌లో కారుసీటులో పిల్లాడు కనిపించాడు. ఆ దృశ్యాలు తమ దృష్టికి చేరడంతో పోలీసులు మేయర్ కారును అనుసరించి, ఆమె ఇంటికి చేరుకున్నారు. ఆమె కారులో మద్యం సీసాను గుర్తించారు. ఆల్కహాల్ టెస్టులో పాజిటివ్ రావడంతో అరెస్టు చేశారు. అయితే మేయర్ భర్తమాత్రం ఆమెను వెనకేసుకొచ్చారు. ఆ పిల్లాడిని ఆమెనుంచి దూరంగా ఉంచండి అంటూ వస్తోన్న విమర్శలను తోసిపుచ్చారు. "లక్షలాది అమెరికన్లు ఈ వ్యసనంతో పోరాడుతున్నారు. వారికి ఎలాంటి సహాయం లభించడం లేదు. ఆ వ్యసనాన్ని వదిలించుకోవడానికి గినా చాలా కష్టపడింది. ఇప్పుడు ఆమెకు అవసరమైన సహాయం అందుతోంది. దయచేసి విమర్శలు ఆపండి. ఇతరులకు సహాయం చేయాలనే ఆమె అభిరుచిని గుర్తించండి. ఆమె చేసిన మంచిని మర్చిపోవద్దు" అని సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు.

## గోల్డ్‌కార్డ్.. ట్రంప్ కార్డ్ కానుందా?



అమెరికాలో ఇమిగ్రేషన్ కోసం ప్రకటించిన 'గోల్డ్ కార్డ్' పేరు మారే అవకాశాలున్నట్లు అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంకేతాలిచ్చారు. పార్సి న్యూస్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఈ విషయాన్ని వెల్లడించారు. తన పేరుతో ఉంటే ఆ కార్డులు మరింత వేగంగా అమ్ముడుపోతాయన్నారు. ఈ సందర్భంగా యాంకర్ ఇన్‌గ్రాహం మాట్లాడుతూ ఈబీ5 వీసాల పేరిట ఏళ్ల తరబడి మోసం జరుగుతోందని మీరు అన్నారు. కానీ, అవి ప్రాథమికంగా ఇమ్మిగ్రెంట్ ఇన్వెస్ట్‌మెంట్ వీసాలు. ఇక 8,000 డాలర్లు చెల్లిస్తే.. ఇంగ్లీష్ రాకపోయినా.. ప్రత్యేక నైపుణ్యాలు లేకపోయినా గ్రీన్‌కార్డ్ వేగంగా అందించే ప్రక్రియ ఉంది. ఇది చాలా పాపులర్, చాలామంది ఈమార్గంలో ఎదురు చూస్తున్నారు" అని చెబుతుండగా ట్రంప్ ఆమె మాటలకు అడ్డుతగిలారు. "నా దగ్గర అంతకంటే పాపులర్‌ది ఉంది' అని ట్రంప్ అన్నారు. దీనికి యాంకర్ స్పందిస్తూ.. "మీరు మద్దతు ఇస్తున్న గోల్డెన్ వీసానా..?.. అది అమల్లోకి రావాలంటే కాంగ్రెస్ ఆమోదం పొందాల్సి ఉంటుంది. 'అమెరికా ఫస్ట్' అంటారు కదా.. అమెరికా పౌరసత్వాన్ని ఎందుకు అమ్మకానికి పెట్టారు" అని ప్రశ్నించింది. ట్రంప్ స్పందిస్తూ "దాని ధర 50 లక్షల డాలర్లు. దాంతో మీరు చాలా పొందొచ్చు. 10 లక్షల కార్డులు విక్రయిస్తే.. 5 ట్రిలియన్ డాలర్లు లభిస్తాయి. మనది అత్యంత విజయవంతమైన దేశం. మనం ఆ డబ్బుతో చైనా సహా ఇతరదేశాలకు ఉన్న బకాయిలను తీర్చేస్తాం. భవిష్యత్తులో ఉద్యోగ కల్పన కూడా సాధ్యమవుతుంది. ఇక ఈ కార్డును మావాళ్ళు ఏమని పిలవాలనుకుంటున్నారో తెలుసా..? అది వామపక్షాల వారికి పిచ్చెక్కిస్తుంది. దాని ట్రంప్ కార్డ్ అని పిలవాలనుకుంటున్నారు. గోల్డ్ కార్ట్ కంటే ఆ పేరుతోనే బాగా అమ్ముడవుతుంది" అని పేర్కొన్నారు. ఈ కార్డులను పొందిన వారు సరైన వ్యక్తులుకాదని భావిస్తే., వారి డబ్బులు తిరిగిచ్చేసి దేశం నుంచి బయటకు పంపిస్తామని ట్రంప్ వివరించారు.

ట్రంప్ గత నెలలో తొలిసారి గోల్డెన్ కార్డ్ ప్రకటించారు. 5 మిలియన్ డాలర్లు చెల్లించగలిగితే ఇది నేరుగా అమెరికా పౌరసత్వాన్ని అందజేస్తుంది. ప్రపంచవ్యాప్తంగా సంపన్నులను ఆకర్షించేందుకే దీనిని ప్రవేశపెట్టారు. వారు అమెరికాకు వచ్చి భారీగా డబ్బును ఖర్చుపెడితే స్థానికంగా ఉద్యోగాలు కూడా పెరుగుతాయని ట్రంప్ పేర్కొన్నారు.

చైతన్యరథం

## ఛాంపియన్స్ ట్రోఫీ విజయం..

# టీమిండియాకు భారీ నజరానా!

ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీ 2025లో విజేతగా నిలిచిన భారత జట్టుకు భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) భారీ క్యాష్ ప్రైజ్‌ను ప్రకటించింది. రూ. 58 కోట్ల రూపాయాలను నగదు బహుమతిగా అందజేస్తామని తెలిపింది. ఈ మేరకు గురువారం సోషల్ మీడియా వేదికగా బీసీసీఐ ఓ ప్రకటనను విడుదల చేసింది. ఈ క్యాష్ ప్రైజ్‌ను జట్టులోని ఆటగాళ్లు, కోచ్‌లు, సపోర్ట్ స్టాఫ్‌తో పాటు సెలెక్షన్ కమిటీకి ఇస్తామని పేర్కొంది. వారి ప్రదర్శనకు సత్కారంగానే ఈ నజరానాను ప్రకటించినట్లు స్పష్టం చేసింది.

టీమిండియా గెలవగానే క్యాష్ ప్రైజ్ ప్రకటిస్తారని అంతా భావించినా.. బోర్డు 11 రోజుల సమయం తీసుకుంది. అయితే ఈ ప్రైజ్‌మనీలో ఎవరికి ఎంతా? అనే వివరాలను వెల్లడించలేదు. ఐసీసీ ఛాంపియన్స్ ట్రోఫీలో రోహిత్ శర్మ సారథ్యంలోని టీమిండియా అద్భుత ప్రదర్శన కనబర్చి విజేతగా నిలిచిన విషయం తెలిసిందే. ఓటమెరుగని జట్టుగా టీమిండియా టైటిల్ అందుకుంది. లీగ్ దశలో బంగ్లాదేశ్, పాకిస్థాన్, న్యూజిలాండ్‌ను మట్టికరిపించిన టీమిండియా.. సెమీఫైనల్లో ఆస్ట్రేలియాను ఓడించింది. ఉత్కంఠగా సాగిన ఫైనల్లో న్యూజిలాండ్‌పై 4 వికెట్ల తేడాతో గెలిచి విశ్వ విజేతగా నిలిచింది.



టీమిండియాకు ఇది మూడో ఛాంపియన్స్ ట్రోఫీ కాగా.. వరుసగా రెండో ఐసీసీ టైటిల్. గతేడాది వెస్టిండీస్ వేదికగా జరిగిన టీ20 ప్రపంచకప్ 2024ను కూడా టీమిండియా కైవసం చేసుకుంది. ఆ సమయంలో భారత జట్టుకు బీసీసీఐ రూ. 125 కోట్ల భారీ నజరానాను ప్రకటించింది.

ఈ రూ. 125 కోట్లలో జట్టులోని ఆటగాళ్లతో పాటు హెడ్ కోచ్ రాహుల్ ద్రవిడ్‌కు తలో రూ.5 కోట్లు ఇచ్చిన బీసీసీఐ.. సహాయక కోచ్‌లకు తలో రూ.2.5 కోట్లు, అలాగే ఇతర సహాయక సిబ్బందిగా ఉన్న తొమ్మిది మందికి తలో రూ. 2 కోట్లు ఇచ్చింది. అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ సభ్యులకు, రిజర్వ్ ప్లేయర్లుగా ఎంపికైన రింకూ సింగ్, శుభ్‌మన్ గిల్, అవేశ్ ఖాన్, ఖలీల్ అహ్మద్‌లకు తలా రూ.కోటి అందజేశారు. అయితే సపోర్ట్ స్టాఫ్‌తో సమంగా తనకు కూడా రూ. 2.5 కోట్లు ఇవ్వాలని రాహుల్ ద్రవిడ్ కోరినట్లు అప్పట్లో వార్తలు వచ్చాయి. ఈ క్రమంలోనే తాజా రూ. 58 కోట్ల ప్రైజ్‌మనీలో ఎవరికి ఎంత ఇవ్వాలనే వివరాలను వెల్లడించలేదని అర్థమవుతోంది.

# డబ్ల్యూటీసీ 2025-27 కోసం ప్రత్యేక బోనస్ పాయింట్ల




డబ్ల్యూటీసీ 2025-27 సైకిల్ కోసం బోనస్ పాయింట్లను ప్రతిపాదించే ఆలోచనల్లో ఐసీసీ ఉన్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్‌లో జరగనున్న బోర్డు మీటింగ్‌లో ఈ మేరకు నిర్ణయం తీసుకోనున్నట్లు సమాచారం. ముఖ్యంగా విదేశాల్లో సాధించే భారీ విజయాలకు బోనస్ పాయింట్లు వర్తింపజేయనున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి. డబ్ల్యూటీసీ కొత్త సైకిల్ భారత్, ఇంగ్లాండ్ మధ్య జరగనున్న అయిదు మ్యాచ్‌ల సిరీస్‌లో ప్రారంభం కానుంది. ప్రస్తుతం అమల్లో ఉన్న నిబంధనల ప్రకారం తక్కువ అంతరంతో గెలిచినా లేక ఇన్నింగ్స్ తేడాతో విజయం సాధించినా 12 పాయింట్లు లభిస్తాయి. అలాగే మ్యాచ్ టై అయితే 6 పాయింట్లు, డ్రా అయితే 4 పాయింట్లు వస్తాయి.

**పెద్ద జట్లపై గెలిస్తే.....**

నూతన విధానంలో మాత్రం ఇన్నింగ్స్ తేడా లేదా... వంద పరుగులకు పైగా ఆధిక్యంతో విజయం సాధిస్తే, గెలిచిన టీమ్‌కు బోనస్ పాయింట్లు కేటాయించనున్నారు. టీమిండియా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌లాంటి పెద్ద జట్లపై ప్రత్యర్థి జట్లు విజయం సాధిస్తే వారికి అదనపు పాయింట్లు కేటాయించే అంశం పరిశీలనలో ఉంది. అలాగే ఐసీసీ బోర్డు మీటింగ్లో ఆస్ట్రేలియా ప్రతిపాదిస్తున్న టూ టైర్ టెస్ట్ సిస్టమ్‌ను కూడా పరిగణనలోకి తీసుకోవచ్చు.

'నిజానికి ఇదో మంచి ముందడుగు. ఒక వేళ పాయింట్ల కేటాయింపుల్లో ఈ మార్పు అమల్లోకి వస్తే జట్లకు మరింత ప్రోత్సాహకంగా ఉంటుంది. మ్యాచ్‌లు కూడా మరింత ఆసక్తికరంగా మారతాయి. గత సంవత్సరం న్యూజిలాండ్ జట్టు భారతదేశంలో టీమిండియాను ఓడించింది. నిజానికి ఇదో చారిత్రక విజయం. ఎన్నో జట్లు టీమిండియాతో తలపడడానికి ఇక్కడికి వస్తాయి. ఆ మ్యాచ్‌ల్లో విజయం సాధిస్తే ఆ జట్లు అదనపు పాయింట్లేమీ పొందవు. ఒక వేళ అదనపు పాయింట్ల నియమం అమల్లోకి వస్తే మరింత ప్రోత్సాహకరంగా ఉంటుంది' అని భారత మాజీ క్రికెటర్ ఒకరు... ఓ వార్తాసంస్థతో తన అభిప్రాయాన్ని పంచుకున్నాడు.

# బీసీసీఐ నయా రూల్.. ఇక టాస్‌తో భయం లేదు!

ఐపీఎల్ 2025 సీజన్ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి(బీసీసీఐ) కీలక నిర్ణయాలు తీసుకుంది. మార్చి 22 నుంచి ఈ క్యాష్ రిచ్ లీగ్‌కు తెరలేవనుండగా.. గురువారం పది ఫ్రాంచైజీల కెప్టెన్లతో బీసీసీఐ సమావేశం నిర్వహించింది. పలు అంశాలే ఏజెండాగా జరిగిన ఈ సమావేశంలో బీసీసీఐ కీలక నిర్ణయాలు తీసుకుంది. లీగ్‌లో చేయాల్సిన మార్పుల చేర్పులపై సలహాలు, సూచనలను కెప్టెన్లను స్వీకరించింది.




### 1. సలైవాపై నిషేధం ఎత్తివేత..

ఐపీఎల్ సారథుల విజ్ఞప్తి మేరకు సలైవాపై విధించిన నిషేధాన్ని ఎత్తేసింది. ఇక నుంచి బౌలర్లు బంతి షైన్ కోసం ఉమ్మిని వాడవచ్చు. సాధారణంగా సలైవా వాడటం వల్ల బంతి తన మెరుపును కోల్పోకుండా ఉండి రివర్స్ స్వింగ్‌కు సహకరిస్తోంది. ఎన్నో ఏళ్లుగా బౌలర్లు ఉమ్మిని వాడుతున్నప్పటికీ.. కరోనా నేపథ్యంలో సలైవాను వాడకుండా ఐసీసీ నిషేధం విధించింది. ఇప్పుడు కరోనా ప్రభావం లేకపోవడంతో ఈ నిషేధాన్ని ఎత్తేయాలని బౌలర్లు కోరారు. ఈ విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకున్న బీసీసీఐ.. ఈ నిషేధాన్ని ఎత్తేసింది.

### 2. కొంత బంతితో డ్యూకు చెక్

అంతేకాకుండా బ్యాటర్ల ఆధిపత్యం కొనసాగే ఈ ధనాధన్ లీగ్‌లో బౌలర్లకు అనుకూలంగా మరో నిర్ణయాన్ని తీసుకుంది. మ్యాచ్ ఫలితాలపై డ్యూ ప్రభావం చూపిస్తుండటంతో బీసీసీఐ కొత్త రూల్‌ను ప్రవేశ పెట్టింది. అప్‌కమింగ్ సీజన్ నుంచి రెండో ఇన్నింగ్స్‌లో రెండు బంతులను ఉపయోగించనున్నారు. రెండో ఇన్నింగ్స్ 11వ ఓవర్ తర్వాత కొత్త బంతిని ప్రవేశ పెట్టనున్నారు. దాంతో మ్యాచ్ ఫలితాలపై టాస్ ప్రభావం కూడా తగ్గనుంది. గతంలో టాస్ గెలిచిన జట్లు ఎక్కువగా ఫీల్డింగ్ ఎంచుకునేవి.

డ్యూ ప్రభావం కారణంగా రెండో ఇన్నింగ్స్‌లో బంతి తడిగా మారి బౌలర్ల చేతుల్లో నుంచి జారిపోయేది. దాంతో కచ్చితమైన లైన్ అండ్ లెంగ్త్‌లో బంతులు వేయలేక బౌలర్లు పరుగులు సమర్పించుకునేవారు. రెండో ఇన్నింగ్స్ 11వ ఓవర్ తర్వాత కొత్త బంతిని ప్రవేశపెడితే బౌలర్లకు ఆ సమస్య తప్పనుంది. అయితే రాత్రి జరిగే మ్యాచ్‌లకు మాత్రమే ఈ రూల్‌ను అమలు చేయనున్నారు. అది కూడా 11వ ఓవర్ తర్వాత డ్యూ ఉందా? లేదా? అని అంపైర్ పరిశీలించి కొత్త బంతిపై నిర్ణయం తీసుకుంటారు. మధ్యాహ్నం 3.30 గంటలకు ప్రారంభమయ్యే మ్యాచ్‌లను ఒక్క బంతితోనే ఆడిస్తారు.

### 3. ఇంపాక్ట్ రూల్ కొనసాగింపు..

ఇంపాక్ట్ ప్లేయర్ రూల్‌ను తీసేయాలనే డిమాండ్‌ను బీసీసీఐ పట్టించుకోలేదు. ఈ రూల్ కారణంగా ఆల్‌రౌండర్లకు అన్యాయం జరుగుతుందని రోహిత్ శర్మ వంటి ఆటగాళ్లు అభిప్రాయపడ్డారు. ఈ విమర్శల నేపథ్యంలోనే ఈ రూల్‌ను ఎత్తేస్తారనే ప్రచారం జరిగింది. కానీ యువ ఆటగాళ్లకు మేలు చేస్తున్న ఈ రూల్‌ను కొనసాగించాలని బీసీసీఐ నిర్ణయించింది. ఎంతో మంది యువ ఆటగాళ్లు ఇంపాక్ట్ ప్లేయర్‌గా బరిలోకి దిగి సత్తా చాటారు. అయితే ఈ రూల్స్ మార్పులపై ఇప్పటి వరకు ఎలాంటి అధికారిక ప్రకటన అయితే రాలేదు.



# మైదానంలో నాకు అండగా నిలవండి

**- హార్దిక్ పాండ్యా**

*ఐపీఎల్ 2025 సీజన్ నేపథ్యంలో ముంబై ఇండియన్స్ కెప్టెన్ హార్దిక్ పాండ్యా తమ అభిమానులకు ఓ అభ్యర్థన చేశాడు. ఈ సారి తాను మైదానంలోకి అడుగుపెట్టినప్పుడు హేళన చేయకుండా అండగా నిలవాలని కోరాడు. బ్యాటింగ్ చేసే సమయంలో.. టాస్ సందర్భంగా మైదానంలోకి వచ్చినప్పుడు తనను ఎంకరేజ్ చేయాలని రిక్వెస్ట్ చేశాడు.*

*ఐపీఎల్ 2024 సీజన్‌లో హార్దిక్ పాండ్యాను సొంత అభిమానులే గేలి చేసిన సంగతి తెలిసిందే. రోహిత్ శర్మను కాదని ముంబై ఇండియన్స్ సారథ్య బాధ్యతలను హార్దిక్ పాండ్యాకు కట్టబెట్టడాన్ని వారు జీర్ణించుకోలేకపోయారు. సీజన్ మొత్తం అతనిపై విమర్శలు గుప్పించారు. టాస్ సమయంలో.. బ్యాటింగ్ చేసేటప్పుడు రోహిత్ అని గట్టిగా అరుస్తూ దారుణంగా అవమానించారు. కెప్టెన్సీ ఆఫర్‌తోనే గుజరాత్ టైటాన్స్ నుంచి ముంబై ఇండియన్స్‌లోకి వచ్చాడని, హార్దిక్ కారణంగానే రోహిత్ సారథ్యం కోల్పోయాడని ఫ్యాన్స్ ఆగ్రహానికి గురయ్యారు.*

*ఆ సీజన్‌లో ముంబై ఇండియన్స్ దారుణంగా విఫలమై పాయింట్స్ టేబుల్‌లో అట్టడుగు స్థానంలో నిలిచింది. సొంత అభిమానుల చేత ఘోర అవమానానికి గురైన హార్దిక్ పాండ్యా తీవ్ర మానసిక క్షోభను అనుభవించాడు. ఈ విపత్కర పరిస్థితుల నుంచి అద్భుతంగా పుంజుకొని టీమిండియా టీ20 ప్రపంచకప్ 2024, ఛాంపియన్స్ ట్రోఫీ 2025 గెలవడంలో కీలక పాత్ర పోషించాడు. మరోవైపు ముంబై ఇండియన్స్ కూడా హార్దిక్ పాండ్యానే కెప్టెన్‌గా కొనసాగించింది.*

### ప్లీజ్.. సపోర్ట్ చేయండి

*ఐపీఎల్ 2025 సీజన్ ప్రారంభానికి ముందు మీడియాతో మాట్లాడిన హార్దిక్ పాండ్యా అభిమానులను ఉద్దేశించి కీలక వ్యాఖ్యలు చేశాడు. 'నేను బ్యాటింగ్‌కు వచ్చినప్పుడు నన్ను ప్రోత్సహించండి. నేను సిక్స్ కొట్టినప్పుడు గట్టిగా అరుస్తూ మరింత మద్దతు తెలపండి. టాస్ కోసం వచ్చినప్పుడు.. బౌలింగ్ చేస్తున్నప్పుడు కూడా నాకు అండగా నిలవండి. వాంఖడే స్టేడియంలో ముంబై ఇండియన్స్ జెర్సీ కలర్ తప్పా మరే రంగును చూడకూడదనుకుంటున్నా. మిమ్మల్ని నేను కోరేది ఒక్కటే.'అని హార్దిక్ పాండ్యా చెప్పుకొచ్చాడు.*

*ఈ వ్యాఖ్యలు గతేడాది అతనికి జరిగిన అవమానాన్ని మరిచిపోలేదనే విషయాన్ని సూచిస్తున్నాయి. నిషేధం కారణంగా చెన్నై సూపర్ కింగ్స్‌తో జరిగే తొలి మ్యాచ్‌కు హార్దిక్ పాండ్యా దూరమయ్యాడు. అతని స్థానంలో సూర్యకుమార్ యాదవ్ జట్టును నడిపించనున్నాడు.*

చైతన్య రథం
సినిమా
శుక్రవారం 21 మార్చి 2025


బ్లో అప్

రకుల్‌ప్రీత్ సింగ్





## 'ది రాజా సాబ్'పై అప్పుడే క్లారిటీ

రెబల్ స్టార్ ప్రభాస్ హీరోగా మాళవిక మోహనన్, అలాగే నిధి అగర్వాల్‌లు హీరోయిన్లుగా దర్శకుడు మారుతి తెరకెక్కిస్తున్న భారీ చిత్రం "ది రాజా సాబ్". అన్నీ అనుకున్నట్టు జరిగుంటే.. ఈ పాటికే సినిమా ప్రమోషన్స్‌లో ఉండేది. కానీ రిలీజ్ వాయిదా పడటం తెలిసిందే. కొత్త డేట్ ఎప్పుడు అనే దానిపై లేటెస్ట్ బజ్ వినిపిస్తోంది. ఉగాదికిగాని లేదా ఏప్రిల్‌లో టీజర్‌తో ఆ డేట్‌ని మేకర్స్ రివీల్ చేయనున్నట్లు ఇపుడు తెలుస్తోంది. దీనితో ఈ సినిమా ట్రీట్ కోసం చూస్తున్న వారికి అప్పుడు ఒక క్లారిటీ రానుంది అని చెప్పవచ్చు. ఇక ఈ చిత్రానికి థమన్ సంగీతం అందిస్తున్నాడు అలాగే పీపుల్ మీడియా ఫ్యాక్టరీ వారు నిర్మాణం వహిస్తున్న సంగతి తెలిసిందే.


## కింగ్‌డమ్: హిట్టుకొడితే సీక్వెల్




టాలీవుడ్‌లో తెరకెక్కుతున్న ప్రెస్టీజియస్ చిత్రాల్లో విజయ్ దేవరకొండ నటిస్తున్న 'కింగ్‌డమ్' ఒకటి. సినిమాను దర్శకుడు గౌతమ్ తిన్ననూరి డైరెక్ట్ చేస్తుండగా భారీ యాక్షన్ డ్రామా చిత్రంగా ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతుంది. ఇప్పటికే ఈ సినిమా నుంచి రిలీజ్ అయిన పోస్టర్స్, టీజర్ ఈ మూవీపై అంచనాలను పెంచాయి. ఇక ఈ సినిమాకు సీక్వెల్ ఉంటుందా..? అనే అంశంపై చిత్ర నిర్మాత నాగవంశీ తాజాగా స్పందించారు. ఆయన ప్రొడ్యూస్ చేస్తున్న 'మ్యాడ్ స్క్వేర్' చిత్ర ప్రమోషన్స్ లో భాగంగా 'కింగ్‌డమ్' చిత్ర సీక్వెల్‌పై మాట్లాడారు. దర్శకుడు గౌతమ్ తనకు చెప్పిన కథ రెండు భాగాలకు సంబంధించినది అని.. అయితే, ఇప్పుడు తెరకెక్కించింది తొలి భాగమని.. అయితే, రెండో భాగానికి స్క్రీన్ ప్లే వేరేలా ఉంటుందని నాగవంశీ తెలిపారు.

కింగ్‌డమ్ సినిమాలో భారీతనం, యాక్షన్.. ఇలా అన్ని అంశాలు కనిపిస్తాయన్నారు. ఈ సినిమాకు వచ్చే రెస్పాన్స్ ను బట్టి సీక్వెల్ చిత్రానికి సంబంధించిన టైటిల్‌ను ఫిక్స్ చేస్తామని అన్నారు. ఇక 'కింగ్‌డమ్' సినిమాలో భాగ్యశ్రీ బోర్సె హీరోయిన్‌గా నటిస్తుండగా అనిరుధ్ రవిచందర్ సంగీతం అందిస్తున్నాడు. ఈ చిత్రాన్ని మే 30న వరల్డ్‌వైడ్ గ్రాండ్ రిలీజ్‌కు రెడీ చేస్తున్నారు.

## షూటింగులకు సిద్ధమవుతున్నా



బాలీవుడ్ నటి దీపికా పదుకొణె గతేడాది ఆడబిడ్డకు జన్మనిచ్చిన విషయం తెలిసిందే. తన బిడ్డతో కొంతకాలంగా సరదాగా గడిపిన దీపికా తిరిగి షూటింగులలో పాల్గొనేందుకు సన్నద్ధమవుతున్నారు. ఈనేపథ్యంలో తల్లిగా తన కుమార్తెతో సమయం గడపడం, చిత్రీకరణలో పాల్గొనడం గురించి తాజాగా ఓ ఇంటర్వ్యూలో మాట్లాడారు. "ఒక తల్లిగా చిత్రీకరణలో పాల్గొనడం అనేది ఎప్పుడూ సవాలే. ప్రస్తుతం నేను నా జీవితంలో మాతృత్వపు మాధుర్యాన్ని ఆస్వాదిస్తున్నాను. ఇకపై షూటింగులో పాల్గొనేందుకు సిద్ధమవ్వాలి. నా కుమార్తెకు తల్లిగా నా బాధ్యతలను నిర్వర్తిస్తూనే చిత్రీకరణల్లో పాల్గొనాలి. ఈ విషయంలో సలహాలు ఇచ్చేందుకు ఎంతోమంది మహిళలు ఉన్నారని నాకు తెలుసు. కానీ, ఇది నాకు అతిపెద్ద సవాలుగా కనిపిస్తోంది. దీన్ని ఎలా ఎదుర్కోవాలో ఆలోచిస్తున్నాను. కచ్చితంగా దీన్ని ఎదుర్కొంటాననే నమ్మకం నాకు ఉంది. మాతృత్వం అనేది గొప్ప అనుభూతి. ఇది నేను ఎంచుకొనే సినిమాలపై ప్రభావం చూపుతుందని నాకు తెలుసు. నేను తల్లి కాకముందు కూడా సినిమాల ఎంపికలో జాగ్రత్తలు తీసుకున్నాను. ఇకపై కూడా అలానే తీసుకుంటాను" అని దీపికా చెప్పారు.

## ఓజీ బ్లాస్ట్
## ఏప్రిల్‌లో టీజర్ విధ్వంసం

పవన్ కళ్యాణ్ హీరోగా నటిస్తున్న లేటెస్ట్ చిత్రాల్లో దర్శకుడు సుజీత్‌తో చేస్తున్న భారీ చిత్రం "ఓజి" ఒకటి. ఈ సినిమాపై ఉన్న అంచలనాలకి అయితే ఆకాశమే హద్దు అని చెప్పడంలో కూడా ఎలాంటి సందేహం లేదు. మరి ఈ చిత్రంని పవన్ కళ్యాణ్ ఎంత వేగంగా కంప్లీట్ చేసారో అంతో గ్యాప్ కూడా ఇచ్చేసారు. దీనితో తన డేట్స్ కోసం మేకర్స్ ఎదురు చూస్తున్నారు. అయితే ఈ సినిమా రిలీజ్ ఎప్పుడు అనేది కూడా మంచి సస్పెన్స్‌గా మారగా ఇపుడు కొన్ని క్రేజీ రూమర్స్ ఈ చిత్రంపై వినిపిస్తున్నాయి. దీనితో ఈ సినిమాని మేకర్స్ ఈ ఏడాది సెప్టెంబర్‌లోనే దింపేందుకు సన్నాహాలు చేస్తున్నారట. గత ఏడాది సెప్టెంబర్ నెలలో మిస్ అయ్యింది కానీ మళ్ళీ ఇదే ఏడాదిలో అదే నెలలో రావాలని ప్లాన్ చేస్తున్నారట. ఇక దీనికంటే ముందు బ్లాస్టింగ్ టాక్ ఒకటి వినిపిస్తుంది. దీనితో ఓజి టీజర్‌ని మేకర్స్ ఈ ఏప్రిల్‌లోనే రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్టుగా రూమర్స్ వినిపిస్తున్నాయి. మరి ఇందులో ఎంతవరకు నిజం ఉంది అనేది వేచి చూడాలి.



# సినీ ప్రముఖులపై 'బెట్టింగ్ యాప్' కేసులు

## ప్రమోషన్స్‌లో రానా, విజయ్, ప్రణీత, నిధి అగర్వాల్


### 25మందిపై కేసు పెట్టిన మియాపూర్ పోలీసులు

బెట్టింగ్ యాప్స్ వ్యవహారంలో మరో కీలక పరిణామం చోటు చేసుకుంది. ఆ యాప్‌ను ప్రమోట్ చేసిన వారిలో ఉన్న ప్రముఖ నటీనటులపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. నటీనటులు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు సహా మొత్తం 25 మంది ఈ జాబితాలో ఉన్నారు. సినీ ప్రముఖుల జాబితాలో రానా దగ్గుబాటి, విజయ్ దేవరకొండ, ప్రకాశ్‌రాజ్, మంచు లక్ష్మి, ప్రణీత, నిధి అగర్వాల్ ఉన్నారు. సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లలో అనన్య నాగళ్ల, సిరి హనుమంతు, శ్రీముఖి, వర్షిణి సౌందరరాజన్, వాసంతి కృష్ణన్, శోభా శెట్టి, అమృత చౌదరి, నయని పావని, నేహా పఠాన్, పండు, పద్మావతి, ఇమ్రాన్‌ఖాన్, విష్ణు ప్రియ, హర్షసాయి, బయ్యా సన్నీ యాదవ్, యాంకర్ శ్యామల, టేస్టీ తేజ, రీతూ చౌదరి, బండారు సుప్రీత ఉన్నారు. మియాపూర్ వాసి ప్రమోద్ శర్మ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

#### తప్పుతేలితే చర్య తప్పదు: టీఎఫ్‌సీసీ

నటీనటుల జీవన విధానం మారడంవల్ల బెట్టింగ్ యాప్స్‌వంటి వాటి ప్రచారాల్లో పాల్గొంటున్నారని తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అభిప్రాయం వ్యక్తం చేసింది. కొంతమంది తెలియక, కొంతమంది తెలిసి ప్రమోషన్స్ చేస్తున్నారని పేర్కొంది. ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా నిలిచిన బెట్టింగ్ యాప్ వ్యవహారంపై స్పందిస్తూ ప్రకటన విడుదల చేసింది.

"సినిమావారైనా, మరొకరైనా చట్టానికి, న్యాయానికి కట్టుబడి ఉండాలి. బెట్టింగ్ యాప్‌ల వ్యవహారంపై రెండు రోజులుగా సినీ పరిశ్రమలో చర్చ జరుగుతోంది. ఆ యాప్‌ల వల్ల సమాజానికి చెడు జరుగుతుంటే అది ముమ్మాటికీ తప్పే. రెండు రోజుల్లో 'మా'కు లేఖ రాస్తాం. సంబంధిత యాప్ ప్రమోషన్స్ నిర్వహించే నటీనటులపై చర్యలు తీసుకోవాలని కోరతాం" అని ప్రకటనలో పేర్కొంది.



"బెట్టింగ్ యాప్ వ్యవహారంపై 'మా' సభ్యులకు అవగాహన కల్పించాలి. డబ్బు కోసం, రాత్రికి రాత్రే ఫేమస్ అవడానికి బెట్టింగ్ యాప్‌లు ప్రచారం చేస్తున్నారు. ఆ యాప్‌లు ప్రోత్సహించడం తప్పు. సమాజానికి చెడు చేసే వాటిపై విచక్షణతో వ్యవహరించాలి. మీకు సెలబ్రిటీ హోదా ఎవరు ఇచ్చారు? సెలబ్రిటీ హోదా ఇచ్చిన ప్రజలకు చెడు చేయాలనుకుంటే ఎలా? ఆ హోదాలో ప్రచారం చేసే వాటిని చాలామంది నమ్ముతారు. తెలుగు ఫిల్మ్ ఛాంబర్ బాధ్యతగా మేం అవగాహన కల్పిస్తాం. అయినా అలాంటి యాప్ల ప్రచారం చేస్తే కఠిన చర్యలు తప్పవు. చాలామంది అగ్ర నటీనటులకు పలు సంస్థలు అవకాశాలు ఇచ్చాయి. కోట్ల రూపాయలు ఆఫర్ చేసినా వారు ప్రచారానికి అంగీకరించలేదు. బెట్టింగ్ యాప్‌లను ప్రోత్సహించడం వల్ల యువత బానిసలవుతున్నారు. సినీ పరిశ్రమ వ్యక్తులైనా, యూట్యూబర్లు అయినా యువత చెడిపోయేందుకు కారకులు కాకూడదు" అని సూచించింది.